




సమాజ హితం – మా అభిమతం

www.arunaprabha.com

# అరుణ ప్రభ

ARUNAPRABHA TELUGU DAILY

తెలుగు దినపత్రిక

RNI NO. TEL TEL/2023/89778








రంగారెడ్డి - హైదరాబాద్ సంపుటి : 04 సంచిక : 197 పేజీలు : 12, వెల రూ. 5/- మంగళవారం, సెప్టెంబరు 8, 2026

PUBLISHED FROM RANGAREDDY, HYDERABAD. CIRCULATED BY : RANGAREDDY, NALGONDA, KHAMMAM, KARIMNAGAR, WARANGAL, MAHABOOBNAGAR, MEDAK, NIZAMABAD, ADILABAD, CHITTOOR, VISAKHAPATNAM, SRIKAKULAM, ELURU, ONGOLE, VIJAYAWADA, SPSR NELLORE, PRAKASHAM, GUNTUR, KURNOOL, KADAPA






## అసెంబ్లీ గేటు వద్ద

# ఉద్రిక్తత

## నల్ల టీషర్టులతో వచ్చిన బీఆర్ఎస్ నేతలను అడ్డుకున్న పోలీసులు

**గేటు వద్దే బైఠాయించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు**

**తోపులాటలో కిందపడిన హరీశ్, జగదీశ్‌రెడ్డి**

**కేటీఆర్, హరీశ్‌రావు సహా పలువురు నేతలను అదుపులోకి తీసుకున్న పోలీసులు**

**మహిళా ఎమ్మెల్యేలతో పోలీసులు దురుసుగా ప్రవర్తించారంటూ బీఆర్ఎస్ ఆరోపణ**

**టీషర్టు విప్పి సభలోకి అనుమతించాలని హరీశ్‌రావు డిమాండ్**

**తాతా మధు వ్యాఖ్యలపై అధికార, విపక్షాల మధ్య తీవ్ర వాగ్వాదం**

తెలంగాణ శాసనసభ వర్షాకాల సమావేశాల ప్రారంభ రోజే అధికార కాంగ్రెస్, ప్రధాన ప్రతిపక్షం బీఆర్ఎస్ మధ్య తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. సమావేశాలకు హాజరయ్యేందుకు నల్ల టీషర్టులు ధరించి వచ్చిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలను అసెంబ్లీ ప్రధాన ద్వారం వద్ద పోలీసులు అడ్డుకోవడంతో పరిస్థితి ఒక్కసారిగా ఉద్రిక్తంగా మారింది. నేతలు అక్కడే బైఠాయించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేయడంతో కొద్దిసేపు అసెంబ్లీ పరిసరాలు నిరసనలతో మార్మోగాయి. లోపలికి వెళ్లేందుకు బీఆర్ఎస్ సభ్యులు ప్రయత్నించగా పోలీసులు అడ్డుకోవడంతో ఇరువర్గాల మధ్య తోపులాట జరిగింది.



హైదరాబాద్: సోమవారం ఉదయం గన్‌పార్కు వద్ద అమరవీరుల స్తూపానికి బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు నివాళు లర్పించారు. అనంతరం కేటీఆర్, హరీశ్‌రావు నేతృత్వంలో నల్ల టీషర్టులు ధరించి అసెంబ్లీకి బయలుదేరారు. కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల పాలనలో ఇచ్చిన హామీలను

(మిగతా 2వ పేజీలో)

## సభాపతికి అవమానం..

# సీఎం తీవ్ర ఆగ్రహం

**తాతా మధు వ్యాఖ్యలు నాలుగు కోట్ల తెలంగాణ ప్రజలకు అవమానం**

**సభాపతి పదవికి పార్టీలకు అతీతంగా గౌరవం ఇవ్వాలి**

**అనుచిత వ్యాఖ్యలు చేసిన సభ్యుడిపై కఠిన చర్యలు తీసుకోవాలి**

**తాతా మధు సభ్యత్వాన్ని శాశ్వతంగా రద్దు చేయాలని సీఎం డిమాండ్**

**ప్రతిపక్ష నేత కేసీఆర్ బహిరంగంగా క్షమాపణ చెప్పాలని స్పష్టీకరణ**

**ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా స్వయం నియంత్రణ విధానం అవసరం**

**బీఆర్ఎస్ సభ్యులను రెచ్చగొట్టారని సీఎం రేవంత్‌రెడ్డి ఆరోపణ**





హైదరాబాద్: శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌పై బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధు చేసిన వ్యాఖ్యలు తీవ్ర దుమారం రేపాయి. ఈ ఘటనను రాష్ట్రానికే చీకటి రోజుగా అభివర్ణించిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి.. సభాపతిని అవమానించడం అంటే యావత్ తెలంగాణ ప్రజలను అవమానించడమేనని అన్నారు. సభాపతి పదవి అత్యున్నతమైనదని, ఆ స్థానంలో ఉన్న వ్యక్తిని గౌరవించడం పార్టీలకు అతీతంగా ప్రతి సభ్యుడి బాధ్యత అని స్పష్టం చేశారు. సోమవారం భోజన విరామం అనంతరం మధ్యాహ్నం 2 గంటలకు శాసనసభ తిరిగి సమావేశమైంది. తాతా మధు వ్యాఖ్యలపై విస్తృతంగా చర్చ చేపట్టాలని సభా వ్యవహారాల మంత్రి శ్రీధర్‌బాబు ప్రతిపాదించారు. అదే సమయంలో బీజేపీ సభ్యులు 22ఏ అంశంపై చర్చకు పట్టుబట్టి ప్లకార్డులతో నిరసన తెలిపారు. బీఏసీ సమావేశంలో చర్చించిన తర్వాత ఆ అంశాన్ని చేపట్టవచ్చని మంత్రి సూచించారు. అయితే స్పీకర్‌కు జరిగిన అవమానంపై చర్చ

(మిగతా 2వ పేజీలో)



## ఎమ్మెల్యేలను అడ్డుకోవద్దు.. పోలీసులకు తెలంగాణ హైకోర్టు కీలక ఆదేశాలు

**అసెంబ్లీకి వెళ్లే ఎమ్మెల్యేలను అడ్డుకోవద్దని పోలీసులకు ఆదేశం**

**నిబంధనల ఉల్లంఘనపై స్పీకర్ చర్యలు తీసుకుంటారని స్పష్టీకరణ**

**మహిళా ఎమ్మెల్యేలపై దాడి ఘటనపై విచారణ జరపాలని ఉత్తర్వులు**



## నేను స్పీకర్‌ను, ఛైర్మన్‌ను దూషించలేదు నా మాటలను కాంగ్రెస్ వక్రీకరిస్తోంది: ఎమ్మెల్సీ తాతా మధు

**అసెంబ్లీ ప్రాంగణంలో స్పీకర్‌ను ఉద్దేశించి అనుచిత వ్యాఖ్యలు చేసిన తాతా మధు**

**స్పీకర్ స్థానంపై తనకు అపారమైన గౌరవం ఉందని వ్యాఖ్య**

**తన గొంతు నొక్కేందుకు యత్నించిన పోలీసు అధికారులపై మాత్రమే తాను ఆగ్రహం వ్యక్తం చేశానన్న మధు**

## జన్వాడ అక్రమ వెంచర్‌పై ఉక్కుపాదం..

# 60 ఎకరాల లేఅవుట్ కూల్చివేత

**111 జీవో నిబంధనలను ఉల్లంఘించడంతో అధికారుల కఠిన చర్యలు**

**హెచ్ఎండీఏ, సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ సంయుక్త ఆపరేషన్**

**క్లబ్‌హౌస్ పిల్లర్లు, రోడ్లు, డ్రైనేజీ నిర్మాణాలను ధ్వంసం చేసిన అధికారులు**

**సీఎంసీ పరిధిలో మరో 16 అక్రమ కట్టడాలను కూడా తొలగింపు**



హైదరాబాద్ : హైదరాబాద్ శివారులోని శంకర్‌పల్లి మండలం జన్వాడలో ఏర్పాటు చేసిన భారీ అక్రమ వెంచర్‌పై అధికారులు కొరడా ఝుళిపించారు. గండిపేట జలాశయ పరిరక్షణకు ఉద్దేశించిన 111 జీవోను ఉల్లంఘిస్తూ సుమారు 60 ఎకరాల్లో నిర్మిస్తున్న ఈ లేఅవుట్‌ను సోమవారం హెచ్ఎండీఏ, సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (సీఎంసీ) అధికారులు సంయుక్తంగా కూల్చివేశారు. ఈ కూల్చివేత ఆపరేషన్‌లో భాగంగా, వెంచర్‌లో క్లబ్‌హౌస్ కోసం నిర్మిస్తున్న పిల్లర్లను, కాంక్రీట్ నిర్మాణాలను ఎక్స్‌కవేటర్లతో నేలమట్టం చేశారు. అలాగే, అక్రమంగా వేసిన రోడ్లు, ఫుట్‌పాత్‌లు, బాక్స్ డ్రెయిన్లను కూడా పూర్తిగా ధ్వంసం చేశారు. రెండు రోజుల క్రితం హెచ్ఎండీఏ, రెవెన్యూ, ఇరిగేషన్, సీఎంసీ అధికారులు క్షేత్రస్థాయిలో తనిఖీలు నిర్వహించి, అక్రమాలను

(మిగతా 2వ పేజీలో)




## తెలంగాణలో 'ఎస్ఐఆర్' గడువు

# మరోసారి పొడిగింపు

**అక్టోబర్ 7 వరకు అభ్యంతరాలు, క్లెయిమ్స్ స్వీకరణ**

**సీఎం రేవంత్ విజ్ఞప్తిని అంగీకరించిన ఎన్నికల సంఘం**

**నవంబర్ 9న తుది ఓటర్ల జాబితా విడుదల**

హైదరాబాద్ : తెలంగాణలో ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ (సర్) కార్యక్రమం గడువును కేంద్ర ఎన్నికల సంఘం పొడిగించింది. జాబితాపై అభ్యంతరాలు, క్లెయిమ్‌లు దాఖలు చేసేందుకు అక్టోబర్ 7వ తేదీ

(మిగతా 2వ పేజీలో)

## గ్యాస్ వినియోగదారులకు గుడ్‌న్యూస్

# బుకింగ్‌పై కేంద్రం కీలక నిర్ణయం



**గ్రామీణ ప్రాంతాల్లోనూ 25 రోజులకే రీఫిల్ బుకింగ్**

**పట్టణ, గ్రామీణ ప్రాంతాలకు ఇక ఒకే నిబంధన**

**వెంటనే అమల్లోకి రానున్న కొత్త విధానం**

**45 రోజుల గ్రామీణ నిబంధనకు కేంద్రం ముగింపు**

**ఐఓసీఎల్, బీపీసీఎల్, హెచ్‌పీసీఎల్‌కు ఆదేశాలు**

## యూపీలో ఘోర రోడ్డు ప్రమాదం..

# 12 మంది దుర్మరణం

**ఉత్తరప్రదేశ్‌లోని బాఘ్‌పత్‌లో పికప్ వాహనం బోల్తా**

**ప్రమాదంలో 12మంది మృతి, పదుల సంఖ్యలో గాయాలు**

**రాజస్థాన్ నుంచి బదౌన్ వెళ్తుండగా అర్ధరాత్రి ఘటన**

**డివైడర్‌ను ఢీకొట్టడంతో ప్రమాదం జరిగిందని ప్రాథమిక అంచనా**

**మృతుల కుటుంబాల కోసం హెల్ప్‌లైన్ నంబర్ ఏర్పాటు**



# సభాపతికి అవమానం.. సీఎం తీవ్ర ఆగ్రహం

అత్యంత ప్రాధాన్యమైనదని అధికార పక్షం పేర్కొంది. ఈ దశలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి జోక్యం చేసుకుని సుదీర్ఘంగా మాట్లాడారు. స్పీకర్ పదవి రాజ్యాంగబద్ధమైన అత్యున్నత స్థానం అని, ముఖ్యమంత్రి అయినా, సాధారణ సభ్యుడైనా సభాపతి ముందు సమానమేనని పేర్కొన్నారు. అలాంటి స్థానంలో ఉన్న వ్యక్తిని కించపరిచేలా మాట్లాడటం ఏమాత్రం సమర్థనీయం కాదన్నారు.

**'తెలంగాణ సిగ్గుపడే ఘటన'**

తాతా మధు ఉపయోగించిన భాష సభ్య సమాజం అంగీకరించలేనిదని సీఎం అన్నారు. వ్యక్తిగతంగా స్పీకర్‌కు జరిగిన అవమానంగా కాకుండా నాలుగు కోట్ల తెలంగాణ ప్రజలకు జరిగిన అవమానంగా ఈ ఘటనను చూడాలని సూచించారు. సభలోని అన్ని పార్టీల సభ్యులు ఈ వ్యాఖ్యలను ముక్తకంఠంతో ఖండించాలని కోరారు. ఇలాంటి ఘటనలను ఉపేక్షిస్తే భవిష్యత్‌లో శాసనసభ గౌరవానికి భంగం కలిగే ప్రమాదం ఉందని హెచ్చరించారు. చట్టసభల్లో ఏం మాట్లాడినా చెల్లుతుందనే పరిస్థితి రాకుండా కఠినంగా వ్యవహరించాల్సిన అవసరం ఉందన్నారు. భవిష్యత్‌లో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా సభలో స్వయం నియంత్రణ విధానాన్ని తీసుకురావాలని సూచించారు.

**కేసీఆర్ క్షమాపణ చెప్పాలి**

తాతా మధు వ్యాఖ్యలకు ప్రతిపక్ష నేత కేసీఆర్ బాధ్యత వహించి బహిరంగంగా క్షమాపణ చెప్పాలని రేవంత్‌రెడ్డి డిమాండ్ చేశారు. అనుచిత వ్యాఖ్యలు చేసిన సభ్యుడి సభ్యత్వాన్ని శాశ్వతంగా రద్దు చేయాల్సిన అవసరం ఉందన్నారు. స్పీకర్‌ను అవమానించిన ఘటనపై రాజకీయాలకు అతీతంగా అన్ని పార్టీలు ఒకే వైఖరి తీసుకోవాలని కోరారు. బీజేపీ సభ్యులు 22ఏపై చర్చకు పట్టుబడుతున్న సమయంలోనూ సీఎం తీవ్రంగా స్పందించారు. సభాపతిని అవమానించిన అంశాన్ని పక్కన పెట్టి ఇతర అంశంపై మాత్రమే చర్చకు పట్టుబట్టడం సరికాదన్నారు. బీఆర్ఎస్‌ను కాపాడుతున్నారనే భావన ప్రజల్లో కలిగేలా వ్యవహరించవద్దని బీజేపీ సభ్యులకు సూచించారు.

**'ఫాంహౌస్ నుంచే పురిగొల్పారు'**

అసెంబ్లీ సమావేశాలకు ముందు రోజు బీఆర్ఎస్ నాయకత్వం ఫాంహౌస్‌లో సమావేశం ఏర్పాటు చేసి పార్టీ సభ్యులను రెచ్చగొట్టిందని సీఎం ఆరోపించారు. పోలీసులపై దాడికి ప్రయత్నించడం, సభాపతిని అవమానించడం సాధారణ రాజకీయ నిరసన కాదన్నారు. ఇవి తీవ్రమైన చర్యలని పేర్కొన్నారు. సభా ప్రాంగణంలో స్పీకర్‌తో పాటు ఆయన కుటుంబ సభ్యులను అవమానించేలా మాట్లాడటం క్షమించరాని విషయమని అన్నారు. ఇలాంటి చర్యలను ఇప్పుడే నియంత్రించకపోతే రాబోయే తరాలు చట్టసభల తీరును ప్రశ్నించే పరిస్థితి వస్తుందని హెచ్చరించారు.



**బీఆర్ఎస్‌పై దళిత వ్యతిరేక ముద్ర**

బీఆర్ఎస్ గత పాలనను కూడా సీఎం ప్రస్తావించారు. తెలంగాణ ఉద్యమ సమయంలో, ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన సమయంలో దళితుల పేరుతో అనేక హామీలు ఇచ్చిన ఆ పార్టీ.. అధికారంలోకి వచ్చిన తర్వాత వాటిని పూర్తిస్థాయిలో అమలు చేయలేదని విమర్శించారు. దళిత ముఖ్యమంత్రి, మూడు ఎకరాల భూమి, దళిత బంధు వంటి హామీలను ప్రస్తావిస్తూ బీఆర్ఎస్‌పై తీవ్ర ఆరోపణలు చేశారు. దళిత ఉప ముఖ్యమంత్రిని పదవి నుంచి తొలగించడం నుంచి నేరెళ్ల ఘటన వరకు పలు అంశాలను సీఎం సభలో ప్రస్తావించారు. కాంగ్రెస్ సీఎల్పీ నాయకుడిగా దళితుడికి అవకాశం వచ్చిన సమయంలో పార్టీ ఫిరాయింపులను ప్రోత్సహించి ప్రతిపక్ష హోదా లేకుండా చేశారని బీఆర్ఎస్‌పై ఆరోపణలు గుప్పించారు.

**'తల్లిని దూషిస్తే రక్తం మరుగుతుంది'**

తల్లిని అవమానించేలా ఎవరైనా మాట్లాడితే ఏ కుమారుడికైనా ఆవేశం వస్తుందని సీఎం అన్నారు. అదే తరహాలో సభాపతిని, ఆయన కుటుంబాన్ని అవమానించే భాషను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించరాదన్నారు. ఇలాంటి చర్యలపై చట్టసభలోనే తగిన నియంత్రణ ఉండాలని స్పష్టం చేశారు. విశృంఖలత్వం, అడ్డగోలుతనం, ఏం మాట్లాడినా చెల్లుతుందనే ధోరణికి అడ్డుకట్ట వేయాలని పిలుపునిచ్చారు. క్షమించి వదిలేస్తే చట్టసభల ప్రతిష్ఠ దెబ్బతింటుందని పేర్కొన్నారు. ఈ ఘటనపై సమగ్రంగా చర్చించి భవిష్యత్‌లో ఇలాంటి పరిణామాలు చోటుచేసుకోకుండా కఠినమైన స్వయం నియంత్రణ విధానాన్ని రూపొందించాల్సిన అవసరం ఉందని సీఎం రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు.

# అసెంబ్లీ గేటు వద్ద ఉద్రిక్తత

అమలు చేయడంలో విఫలమైందంటూ టీషర్టులపై నినాదాలను ముద్రించారు. ఈ దుస్తులతో సభలోకి రావడంపై పోలీసులు అభ్యంతరం వ్యక్తం చేసి వారిని ప్రధాన గేటు వద్ద నిలిపివేశారు. దీంతో బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు గేటు వద్దే కూర్చొని నిరసనకు దిగారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ అసెంబ్లీలోకి అనుమతించాలని డిమాండ్ చేశారు. పరిస్థితిని అదుపులోకి తీసుకునేందుకు పోలీసులు ప్రయత్నించడంతో బీఆర్ఎస్ నేతలకు, పోలీసులకు మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. అనంతరం తోపులాట జరగడంతో హరీశ్‌రావు, మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి కిందపడిపోయారు. జగదీశ్‌రెడ్డి అస్వస్థతకు గురికావడంతో తోటి నేతలు ఆయనకు సపర్యలు చేశారు. పోలీసులు తనను సభలోకి అనుమతించకపోవడంపై హరీశ్‌రావు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. తాను ధరించిన నల్ల టీషర్టును విప్పి, దానిపై ఎలాంటి నినాదాలు లేవని.. ఇక తనను లోపలికి అనుమతించాలని పోలీసులను కోరారు. ఎమ్మెల్యే దేవిరెడ్డి సుదీర్‌రెడ్డి, ఎమ్మెల్సీ నవీన్‌రెడ్డి కూడా టీషర్టులు విప్పి నిరసన తెలిపారు. అయినప్పటికీ పరిస్థితి సద్దుమణగకపోవడంతో పోలీసులు పలువురు బీఆర్ఎస్ నేతలను అదుపులోకి తీసుకున్నారు. కేటీఆర్‌ను పోలీసులు బలవంతంగా వాహనంలోకి ఎక్కించేందుకు ప్రయత్నించడంతో ఆయన తీవ్రంగా స్పందించారు. హరీశ్‌రావు, బండారు లక్ష్మారెడ్డి, శంభీపూర్ రాజు తదితరులను కూడా పోలీసులు అదుపులోకి తీసుకుని తెలంగాణ భవన్ వైపు తరలించారు. మరికొందరు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు అసెంబ్లీ ప్రధాన గేటు వద్దే నిరసన కొనసాగించారు. తోపులాట సందర్భంగా మహిళా బీఆర్ఎస్ నేతలు పోలీసుల తీరుపై తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. సబితా ఇంద్రారెడ్డి తనతో పోలీసులు దురుసుగా వ్యవహరించారని ఆరోపించారు. సునీతా లక్ష్మారెడ్డి తన చీరను పోలీసులు లాగారని ఆరోపిస్తూ కన్నీటి పర్యంతమయ్యారు. సబిత, సునీతతో పాటు కోవా లక్ష్మి తదితరులు గేటు వద్ద బైఠాయించి నిరసన తెలిపారు. అనంతరం వారిని కూడా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ ఘటనపై బీఆర్ఎస్ నేతలు తీవ్రంగా స్పందించారు. సభలోకి వెళ్లే అవకాశం ఇవ్వకుండా తమను బయటే అడ్డుకోవడం ప్రజాస్వామ్య విరుద్ధమని ఆరోపించారు. తమ పార్టీ ప్రజాప్రతినిధులపై పోలీసులు వ్యవహరించిన తీరుకు ప్రభుత్వం బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. అసెంబ్లీ గేటు వద్ద జరిగిన పరిణామాలను బీఆర్ఎస్ నేతలు తీవ్రంగా ఖండించారు. ఇదే సమయంలో పోలీసులతో జరిగిన వాగ్వాదంలో బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధు చేసిన వ్యాఖ్యలు మరో వివాదానికి దారితీశాయి. స్పీకర్‌ను ఉద్దేశించి ఆయన అనుచిత వ్యాఖ్యలు చేశారని అధికార కాంగ్రెస్ ఆరోపించింది. ఈ అంశాన్ని సీఎం రేవంత్‌రెడ్డి శాసనసభలో ప్రస్తావిస్తూ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. తాతా మధుతో రాజీనామా




చేయించాలని, ప్రతిపక్ష నేత బహిరంగంగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. బీజేపీ సభ్యులు కూడా తాతా మధు వ్యాఖ్యలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మరోవైపు బీఆర్ఎస్ మాత్రం అసెంబ్లీ గేటు వద్ద తమ పార్టీ నేతలపై జరిగిన పరిణామాలకు ముఖ్యమంత్రి బాధ్యత వహించాలని, పోలీసుల వ్యవహారంపై క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేసింది. అసెంబ్లీ ప్రాంగణం వెలుపల చోటుచేసుకున్న పరిణామాల ప్రభావం సభా వ్యవహారాలపైనా పడింది. తమ పార్టీ సభ్యులపై పోలీసులు వ్యవహరించిన తీరును నిరసిస్తూ స్పీకర్ అధ్యక్షతన జరిగిన బీఏసీ సమావేశాన్ని బహిష్కరిస్తున్నట్లు హరీశ్‌రావు ప్రకటించారు. దీంతో తొలిరోజే అధికార, ప్రతిపక్ష పార్టీల మధ్య విభేదాలు మరింత తీవ్రరూపం దాల్చాయి. వెయ్యి రోజుల కాంగ్రెస్ పాలనపై నిరసన తెలిపేందుకు బీఆర్ఎస్ చేపట్టిన నల్ల టీషర్టుల కార్యక్రమం.. అసెంబ్లీ ప్రధాన గేటు వద్ద పోలీసులతో జరిగిన ఘర్షణతో రాజకీయంగా మరింత వేడిని పెంచింది. సభలోకి వెళ్లే ముందు చోటుచేసుకున్న ఈ పరిణామాలు రానున్న సమావేశాల్లో అధికార, ప్రతిపక్షాల మధ్య వాగ్వాదాలు మరింత ముదిరే పరిస్థితిని సూచిస్తున్నాయి.

## ఉద్యోగాల పేరుతో మోసం
## ప్రముఖ యూట్యూబర్ నందన అరెస్ట్

**శంషాబాద్ విమానాశ్రయంలో యూట్యూబర్ నందన అరెస్ట్**

**లుకౌట్ నోటీసులు ఉండటంతో అదుపులోకి తీసుకున్న పోలీసులు**

**లండన్‌లో ఉద్యోగాల పేరిట డబ్బు వసూలు చేశారన్న ఆరోపణలు**

**ఇబ్రహీంపట్నం పోలీసులకు నందనను అప్పగించిన అధికారులు**

**కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న పోలీసులు**

ప్రముఖ యూట్యూబర్ నందనను శంషాబాద్‌లోని రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఆమెపై ఇప్పటికే లుకౌట్ నోటీసులు పెండింగ్‌లో ఉండటంతో విమానాశ్రయంలో ఆమెను గుర్తించి అరెస్ట్ చేశారు. అనంతరం ఆమెను ఇబ్రహీంపట్నం పోలీసులకు అప్పగించారు. వివరాల్లోకి వెళితే.. నందన, ఆమె భర్త కలిసి లండన్‌లో ఉద్యోగాలు ఇప్పిస్తామని పలువురి నుంచి పెద్ద మొత్తంలో డబ్బులు వసూలు చేశారని ఆరోపణలు ఉన్నాయి. ఈ మోసంపై బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఇబ్రహీంపట్నం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఈ కేసులో భాగంగానే ఆమెపై లుకౌట్ నోటీసులు జారీ అయ్యాయి. ఈ క్రమంలో సోమవారం శంషాబాద్ విమానాశ్రయానికి వచ్చిన నందనను ఇమ్మిగ్రేషన్ అధికారులు గుర్తించి, ఎయిర్‌పోర్ట్ పోలీసులకు సమాచారం అందించారు. వారు వెంటనే ఆమెను అదుపులోకి తీసుకుని, కేసు విచారణ చేస్తున్న ఇబ్రహీంపట్నం పోలీసులకు అప్పగించారు. ఈ ఘటనకు సంబంధించి మరిన్ని వివరాలు తెలియాల్సి ఉంది. పోలీసులు కేసు దర్యాప్తును కొనసాగిస్తున్నారు.





## గ్యాస్ వినియోగదారులకు
## గుడ్‌న్యూస్.. బుకింగ్‌పై కేంద్రం కీలక నిర్ణయం

**గ్రామీణ ప్రాంతాల్లోనూ 25 రోజులకే రీఫిల్ బుకింగ్**

**పట్టణ, గ్రామీణ ప్రాంతాలకు ఇక ఒకే నిబంధన**

**వెంటనే అమల్లోకి రానున్న కొత్త విధానం**

వంట గ్యాస్ వినియోగదారులకు కేంద్ర ప్రభుత్వం శుభవార్త చెప్పింది. ఇక గ్రామీణ ప్రాంతాల్లోనూ 25 రోజులకే ఎల్పీజీ సిలిండర్ రీఫిల్ బుక్ చేసుకోవచ్చు. ఇప్పటివరకు అక్కడ 45 రోజుల వ్యవధి ఉండేది. పట్టణ, గ్రామీణ ప్రాంతాలన్నింటికీ ఇక 25 రోజుల నిబంధనే అమల్లో ఉంటుంది. ఈ మార్పును వెంటనే అమలు చేయాలని ప్రభుత్వ రంగ చమురు సంస్థలను కేంద్రం ఆదేశించింది. ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ (ఐఓసీఎల్), భారత్ పెట్రోలియం (బీపీసీఎల్), హిందుస్థాన్ పెట్రోలియం (హెచ్‌పీసీఎల్) ఈ నిబంధనను అమలు చేయనున్నాయి. రీఫిల్ బుకింగ్‌లో పట్టణ, గ్రామీణ ప్రాంతాల మధ్య ఉన్న తేడా ఇక ఉండదు. కేంద్ర పెట్రోలియం, సహజ వాయువు, పర్యాటక శాఖ సహాయ మంత్రి సురేశ్ గోపీ సోమవారం ఈ విషయాన్ని వెల్లడించారు. ఎల్పీజీ సరఫరా పరిస్థితి మెరుగుపడిందని తెలిపారు. రీఫిల్ బకాయిలు కూడా గణనీయంగా తగ్గాయని చెప్పారు. దీంతో 45 రోజుల నిబంధనను సడలించినట్లు పేర్కొన్నారు. పశ్చిమాసియాలో యుద్ధ పరిస్థితుల కారణంగా ఈ ఏడాది ఫిబ్రవరిలో ఎల్పీజీ సరఫరాపై ఒత్తిడి పెరిగింది. దీంతో డిమాండ్‌ను నియంత్రించేందుకు పట్టణ ప్రాంతాల్లో 25 రోజులు, గ్రామీణ ప్రాంతాల్లో 45 రోజుల వ్యవధిని కేంద్రం తీసుకొచ్చింది. ఇప్పుడు పరిస్థితి మెరుగుపడటంతో ఆ పరిమితిని తొలగించింది.

## ఎమ్మెల్యేలను అడ్డుకోవద్దు..
## పోలీసులకు తెలంగాణ హైకోర్టు కీలక ఆదేశాలు

తెలంగాణ శాసనసభకు వెళ్లే ఎమ్మెల్యేలను అడ్డుకోవద్దని రాష్ట్ర పోలీసులను హైకోర్టు సోమవారం ఆదేశించింది. శాసనసభ్యులు ఏవైనా నిబంధనలు ఉల్లంఘిస్తే ఆ వ్యవహారాన్ని స్పీకర్ చూసుకుంటారని, పోలీసులు వారిపై ఎలాంటి చర్యలు తీసుకోరాదని న్యాయస్థానం స్పష్టం చేసింది. అసెంబ్లీ సమీపంలో సోమవారం ఉదయం చోటుచేసుకున్న పరిణామాలను పరిగణనలోకి తీసుకున్న ఉన్నత న్యాయస్థానం, ఈ మేరకు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. ఈ ఉదంతంపై రాష్ట్ర హోం శాఖకు హైకోర్టు నోటీసులు జారీ చేసింది. విచారణలో భాగంగా, మహిళా ఎమ్మెల్యేలపై దాడికి పాల్పడ్డారన్న ఆరోపణలు ఎదుర్కొంటున్న పోలీసు అధికారులను గుర్తించాలని ఆదేశించింది. ఈ ఘటనపై పూర్తిస్థాయి విచారణ జరిపి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేసింది. ఈ మొత్తం వ్యవహారంపై సమగ్ర నివేదికను సమర్పించాలని డీజీపీని ఉన్నత న్యాయస్థానం ఆదేశించింది. అనంతరం తదుపరి విచారణను రెండు వారాలకు వాయిదా వేసింది. ఉదయం అసెంబ్లీ వద్ద జరిగిన పరిణామాల నేపథ్యంలో హైకోర్టు ఆదేశాలు అత్యంత ప్రాధాన్యత సంతరించుకున్నాయి.

## నేను స్పీకర్‌ను, చైర్మన్‌ను దూషించలేదు..
## నా మాటలను కాంగ్రెస్ వక్రీకరిస్తోంది: ఎమ్మెల్సీ తాతా మధు

తన గొంతు నొక్కేందుకు యత్నించిన పోలీసు అధికారులపై మాత్రమే తాను ఆగ్రహం వ్యక్తం చేశానన్న మధు అసెంబ్లీ స్పీకర్ ను ఉద్దేశించి అనుచిత వ్యాఖ్యలు చేసిన బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధును ఎమ్మెల్సీ పదవి నుంచి బర్తరఫ్ చేయాలంటూ కాంగ్రెస్ దళిత ఎమ్మెల్యేలు డిమాండ్ చేస్తున్నారు. మధు చేసిన వ్యాఖ్యలు సరికాదంటూ అధికార పార్టీ నేతలు తీవ్రంగా ఖండించారు. ఈ నేపథ్యంలో తాతా మధు మాట్లాడుతూ... శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్, శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డిలను ఉద్దేశించి తాను ఎలాంటి అనుచిత వ్యాఖ్యలు చేయలేదని, స్పీకర్ స్థానమంటే తనకు అపారమైన గౌరవం ఉందని స్పష్టం చేశారు. ఈ వ్యవహారంలో తనపై కాంగ్రెస్ పార్టీ కావాలనే దుష్ప్రచారం చేస్తోందని మండిపడ్డారు. అసెంబ్లీ గేటు వద్ద బీఆర్ఎస్ మహిళా ఎమ్మెల్యేల పట్ల, ప్రజాప్రతినిధుల పట్ల దురుసుగా ప్రవర్తిస్తూ, తన ప్యాంటు లాగి గొంతు నొక్కేందుకు యత్నించిన పోలీసు అధికారులపై మాత్రమే తాను ఆగ్రహం వ్యక్తం చేశానని, తీవ్ర అసహనంతో అన్న మాటలను స్పీకర్‌కు ఆపాదిస్తూ రాజకీయ లబ్ధి పొందాలని చూస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అసెంబ్లీ వేదికగా ప్రజా సమస్యలపై చర్చించే ధైర్యం, చేతకానితనంతోనే కాంగ్రెస్ ప్రభుత్వం ఇటువంటి తప్పుడు ఆరోపణలకు తెరతీసిందని తాతా మధు విమర్శించారు. "పోలీసుల అక్రమాలను ప్రశ్నిస్తే.. దాన్ని స్పీకర్‌ను అవమానించినట్లు చిత్రీకరిస్తూ కాంగ్రెస్ నేతలు శవరాజకీయాలు చేస్తున్నారు. కాంగ్రెస్ నేతల డిమాండ్లకు భయపడేది లేదు" అని తేల్చిచెప్పారు. అధికార ప్రతిపక్షాల మధ్య సాగుతున్న ఈ ఆరోపణలు, సవాల్‌లతో అసెంబ్లీ ప్రాంగణంలో పొలిటికల్ హీట్ మరింత రగిలింది.

## తెలంగాణలో
## 'ఎస్ఐఆర్' గడువు మరోసారి పొడిగింపు

వరకు అవకాశం కల్పించింది. ఈ మేరకు సవరించిన షెడ్యూల్‌ను ఈసీ విడుదల చేసింది. గతంలో పొడిగించిన షెడ్యూల్ ప్రకారం ఈ గడువు సెప్టెంబర్ 16తో ముగియాల్సి ఉంది. అయితే, ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియకు మరింత సమయం కావాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి కేంద్ర ఎన్నికల సంఘానికి వేర్వేరుగా లేఖలు రాశారు. వారి విజ్ఞప్తిని సానుకూలంగా పరిగణనలోకి తీసుకున్న ఎన్నికల సంఘం, గడువును మరోసారి పొడిగిస్తూ నిర్ణయం తీసుకుంది. కొత్త షెడ్యూల్ ప్రకారం అక్టోబర్ 7 వరకు అభ్యంతరాలను స్వీకరించి, వాటిని పరిష్కరించిన అనంతరం నవంబర్ 9వ తేదీన తుది ఓటర్ల జాబితాను ప్రచురించనున్నారు. ఈసీ నిర్ణయంతో కొత్తగా ఓటరుగా నమోదు చేసుకోవాలనుకునే వారికి, అలాగే జాబితాలో తప్పులను సరిదిద్దుకోవాలనుకునే వారికి అదనపు సమయం లభించినట్లయింది.

## జన్వాడ అక్రమ వెంచర్‌పై ఉక్కుపాదం..
## 60 ఎకరాల లేఅవుట్ కూల్చివేత

నిర్ధారించుకున్నారు. అనంతరం రియల్టర్లకు నోటీసులు జారీ చేసి, తహసీల్దార్ ఆదేశాలతో కూల్చివేతలు చేపట్టారు. 111 జీవో పరిధిలో అనుమతులు లేకుండా ఎవరు నిర్మాణాలు చేపట్టినా కఠిన చర్యలు తప్పవని అధికారులు హెచ్చరించారు. అక్రమ కట్టడాలపై నిరంతరం నిఘా కొనసాగిస్తామని స్పష్టం చేశారు. అధికారుల చర్యలపై స్థానిక ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఇదే సమయంలో, సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ తన పరిధిలోని ఇతర ప్రాంతాల్లోనూ అనధికార నిర్మాణాలపై చర్యలను ముమ్మరం చేసింది. సోమవారం ఒక్కరోజే కుత్బుల్లాపూర్, శేరిలింగంపల్లి, కూకట్‌పల్లి జోన్లలో కలిపి మొత్తం 16 అక్రమ నిర్మాణాలను కూల్చివేసినట్లు అధికారులు తెలిపారు. మరో 15 నిర్మాణాలను గుర్తించి, ఒకదాన్ని సీజ్ చేసినట్లు వెల్లడించారు.

## యూపీలో ఘోర రోడ్డు ప్రమాదం.. 12 మంది దుర్మరణం

ఉత్తరప్రదేశ్‌లో ఘోర రోడ్డు ప్రమాదం సంభవించింది. బాఘ్‌పత్ జిల్లాలో సోమవారం తెల్లవారుజామున ప్రయాణికులతో వెళుతున్న ఓ పికప్ వాహనం అదుపుతప్పి బోల్తా పడింది. ఈ దుర్ఘటనలో 12 మంది అక్కడికక్కడే మృతి చెందగా, పలువురు ప్రయాణికులు తీవ్రంగా గాయపడ్డారు. రాజస్థాన్ నుంచి 32 మంది ప్రయాణికులతో బదౌన్‌కు బయలుదేరిన పికప్ వాహనం,. సోమవారం అర్ధరాత్రి దాదాపు 12:30 గంటల సమయంలో ఖేక్డా పోలీస్ స్టేషన్ పరిధిలోకి రాగానే ప్రమాదానికి గురైంది. వాహనం ఒక్కసారిగా అదుపుతప్పి రోడ్డు డివైడర్‌ను బలంగా ఢీకొట్టడంతో బోల్తా పడింది. సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు, సహాయక బృందాలు ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టాయి. గాయపడిన వారిని చికిత్స నిమిత్తం ఖేక్డా, బాఘ్‌పత్‌లోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు, జిల్లా ఆసుపత్రికి తరలించారు. వీరిలో కొందరి పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం ఉన్నత స్థాయి ఆసుపత్రులకు తరలించారు. ప్రమాదం జరిగిన సమయంలో ప్రయాణికులంతా గాఢ నిద్రలో ఉన్నారని, ఒక్కసారిగా పెద్ద శబ్దం రావడంతో మేల్కొనేలోపే వాహనం బోల్తా పడిందని క్షతగాత్రులు తెలిపారు. అయితే, వెనుక నుంచి మరో వాహనం ఢీకొట్టడం వల్లే ఈ ప్రమాదం సంభవించిందని డ్రైవర్ పేర్కొంటున్నాడు. ప్రమాదానికి గల కచ్చితమైన కారణాలపై పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు. మృతుల వివరాలను సేకరిస్తున్నామని, బాధితుల కుటుంబ సభ్యుల సమాచారం కోసం 9454417383 నంబర్‌లో సంప్రదించాలని బాఘ్‌పత్ పోలీసులు విజ్ఞప్తి చేశారు.

## ఈదురుగాలులతో వర్షాలు..
## ఏపీలోని ఈ ప్రాంతాలకు రెడ్ అలర్ట్

**గుంటూరు, బాపట్ల, పల్నాడు, ప్రకాశం జిల్లాలకు రెడ్ అలర్ట్**

ఆంధ్రప్రదేశ్‌లోని నాలుగు కీలక జిల్లాలకు రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ (ఏపీఎస్డీఎంఏ) రెడ్ అలర్ట్ జారీ చేసింది. గుంటూరు, బాపట్ల, పల్నాడు, ప్రకాశం జిల్లాల్లో రాబోయే మూడు గంటల్లో వాతావరణం ఒక్కసారిగా మారనుందని హెచ్చరించింది. ఈ ప్రాంతాల్లో పిడుగులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని స్పష్టం చేసింది. ఈ మేరకు సోషల్ మీడియా ద్వారా ప్రజలను అప్రమత్తం చేసింది. వాతావరణ మార్పుల నేపథ్యంలో ఆయా జిల్లాల్లోని పలు ప్రాంతాలపై ప్రభావం అధికంగా ఉండనుందని విపత్తుల సంస్థ పేర్కొంది. ముఖ్యంగా గురజాల, మాచర్ల, దర్శి, కందుకూరు, ఒంగోలు, బాపట్ల, గుంటూరు, పిడుగురాళ్ల, నరసరావుపేట, చిలకలూరిపేటతో పాటు వాటి పరిసర ప్రాంతాల ప్రజలు జాగ్రత్తగా ఉండాలని సూచించింది. వర్షంతో పాటు గంటకు 50 నుంచి 60 కిలోమీటర్ల వేగంతో బలమైన ఈదురుగాలులు వీచే అవకాశం ఉందని తెలిపింది. ఈ హెచ్చరికల నేపథ్యంలో ప్రజలు, రైతులు, వాహనదారులు అత్యంత అప్రమత్తంగా వ్యవహరించాలని ఏపీఎస్డీఎంఏ విజ్ఞప్తి చేసింది. ముఖ్యంగా పొలాల్లో పనిచేసే రైతులు, కూలీలు వెంటనే సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని సూచించింది.

అరుణ ప్రభ
ARUNAPRABHA TELUGU DAILY
www.arunaprabha.com
తెలుగు దినపత్రిక
మంగళవారం, సెప్టెంబరు 8, 2026

# పొలిటికల్ హీట్ పెంచుతున్న పార్టీలు

తెలంగాణలో మున్సిపల్ ఎన్నికల హీట్ నడుస్తోంది. అధికార, విపక్షాలు ప్రచార రంగంలో దూసుకెళ్తున్నాయి. ఈ క్రమంలో జనసేన చీఫ్, ఏపీ డిప్యూటీ సీఎం పవన్ ఎంట్రీ ఇప్పుడు పొలిటికల్ హీట్‌ను పెంచుతుంది.మున్సిపల్ ఎన్నికల్లో బీజేపీకి మద్ధతుగా పవన్ ప్రచారం చేయనున్నారు. దీంతో అన్న వస్తున్నారంటూ తెలంగాణ జనసేన నేతలు ఫుల్ ఖుష్ అవుతున్నారు. ఇప్పటికే పలు ప్రాంతాల్లో జనసేన అభ్యర్థులు సైతం బరిలో నిలిచారు. బీజేపీకి మద్దతు మద్దతే ఇటు పోటీపోటీనే అంటూ నిజామాబాద్, నల్లగొండ, ఆదిలాబాద్, మహబూబ్‌నగర్, రంగారెడ్డి, మెదక్, వరంగల్ జిల్లాల్లో జనసేన అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేయగా, వాళ్ల గెలుపుకోసం కూడా పవన్ ప్రచారం చేస్తారని పార్టీ నేతలు చెబుతున్నారు. అయితే పవన్ తెలంగాణ ఎంట్రీపై అప్పుడే నెక్స్ట్ లెవల్ రాజకీయం షురూ అయ్యింది. అధికార కాంగ్రెస్, జనసేన మధ్య మాటల యుద్ధం పొలిటికల్ కాక రేపుతోంది.తెలంగాణలో జనసేనకు అసలు చోటే లేదని టీపీసీసీ చీఫ్ మహేష్ గౌడ్ అన్నారు. గతంలో తెలంగాణ భాష, సంస్కృతిని తక్కువ చేసి మాట్లాడిన పవన్ కల్యాణ్‌ను ప్రజలు ఎట్టిపరిస్థితుల్లోనూ నమ్మే ప్రసక్తే లేదని ఘాటుగా రియాక్ట్ అయ్యారు. పవన్ ఆంధ్రా రాజకీయాలు చూసుకుంటే సరిపోతుందంటూ విమర్శలు గుప్పించడం ఇప్పుడు రచ్చ లేపుతోంది. మహేష్‌కుమార్ గౌడ్ కామెంట్స్‌పై తెలంగాణ జనసేన నుంచి గట్టి కౌంటరే వచ్చింది. కాంగ్రెస్ కేవలం తెలంగాణ పార్టీనా...? బీఆర్ఎస్, బీజేపీలు కేవలం తెలంగాణలోనే పనిచేస్తున్నాయా...? వాళ్ల పార్టీల్లానే మాది కూడా ఓ పార్టీ అంటూ జనసేన ఎక్స్‌లో స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చింది. జనసేన కేవలం ఆంధ్ర కోసం పెట్టిన పార్టీ కాదని...ప్రాంతీయ విభేదాలు సృష్టించాలని చూస్తే ఊరుకునేదిలేదని ఫుల్ సీరియస్ అయ్యింది.అసలు మహేష్‌కుమార్ గౌడ్‌కి పవన్ గురించి మాట్లాడే అర్హత లేదని జనసేన తెలంగాణ ఇన్‌ఛార్జ్ శంకర్ గౌడ్ అన్నారు. పవన్ గోల్డెన్ లెగ్ చూసి అధికార కాంగ్రెస్‌కి భయం పట్టుకుందన్నారు. మహారాష్ట్రలో పవన్ ప్రచారం చేస్తే బీజేపీ గెలిచింది కాబట్టి.. ఇక్కడా అలాంటి సీనే రిపీట్ అవుతుందని కాంగ్రెస్ నేతలు వణుకుతున్నారంటూ విరుచుకుపడ్డారు. ఈనెల 7,8 తేదీల్లో పవన్ తెలంగాణలో ప్రచారం నిర్వహించనున్నారు. మరి ఆయన ఎంట్రీకి ముందే ఈ రేంజ్‌లో రచ్చ నడుస్తుంటే... ఆ తర్వాత పొలిటికల్ సీన్ ఎలా ఉండబోతోందన్న ఆసక్తి అందరిలోనూ నెలకొంది.



## పొల్యూషన్ రాజధానిగా హైదరాబాద్

దేశరాజధాని ఢిల్లీ వాయు కాలుష్యానికి కేరాఫ్ అడ్రస్ గా మారింది. అక్కడున్న ప్రజలు.. వాయు కాలుష్యం బారిన పడి ఆరోగ్యాన్ని పోగొట్టుకుంటున్నారు. వీవీఐపీలు ఢిల్లీ వదిలి శివారు ప్రాంతాలకు మకాం మార్చేస్తున్నారు. అదే బాటలో ముంబై, చండీగఢ్ నడుస్తున్నాయి. అయితే వీటి బాటలోనే సౌత్ లో కీలక కేపిటల్ హైదరాబాద్ తయారైంది. హైదరాబాద్ లోని పలు ప్రాంతాల్లో కాలుష్యం ఎయిర్ పొల్యూషన్ ఇండెక్స్ నిర్దేశిత ప్రమాణాలను దాటేసింది.భాగ్యనగరం వాయు కాలుష్య కోరల్లో చిక్కుకుంటోంది. దేశ రాజధాని ఢిల్లీ, ముంబై వంటి నగరాలతో పోలిస్తే గాలి నాణ్యత మెరుగ్గా ఉన్నట్లు కనిపిస్తున్నప్పటికీ, దక్షిణాది రాష్ట్రాల మెట్రో నగరాలతో పోల్చితే హైదరాబాద్‌లోనే పరిస్థితి అత్యంత దారుణంగా ఉందని కాలుష్య నియంత్రణ మండలి (పీసీబీ) వెల్లడించింది.హైదరాబాద్‌లో నిర్వహించిన 'ఎయిర్ పొల్యూషన్ ఇండెక్స్' సదస్సులో పీసీబీ విడుదల చేసిన గణాంకాలు నగరవాసులను ఆందోళనకు గురిచేస్తున్నాయి. ప్రపంచ ఆరోగ్య సంస్థ నిబంధనల ప్రకారం గాలిలో సూక్ష్మ ధూళికణాలు (పీఎం-10) 40 మైక్రోగ్రాములు ఉండాలి. కానీ, హైదరాబాద్‌లో ఇది 82 నుంచి 88 ఎంజీల వరకు ఉంటోంది. అంటే ఉండాల్సిన దానికంటే రెట్టింపు కాలుష్యాన్ని మనం పీలుస్తున్నాం. కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి (సీపీసీబీ) పరిమితి 60 ఎంజీతో పోల్చినా, హైదరాబాద్‌లో 35 శాతం అధిక కాలుష్యం ఉన్నట్లు స్పష్టమైంది.గత ఏడాది పొడవునా నగరంలో ఒక్క రోజు కూడా 'స్వచ్ఛమైన గాలి' ఉన్నట్లు రికార్డు కాలేదు. గాలి నాణ్యత సూచీ (ఏక్యూఐ) కేవలం 'మధ్యస్థం' లేదా 'సంతృప్తికరం' స్థాయిలకే పరిమితమైంది. ఈ ఏడాది జనవరిలో పీఎం-10 స్థాయి గరిష్ఠంగా 105 ఎంజీ వరకు వెళ్లడం నగర గాలిలో పెరుగుతున్న విషతుల్యతకు నిదర్శనం.నగరంలో వాహనాల రద్దీ పెరగడంతో ఏడు ప్రధాన ప్రాంతాలను 'కాలుష్య హాట్‌స్పాట్లు'గా అధికారులు గుర్తించారు. అవి ఖైరతాబాద్-కోఠి, జీడిమెట్ల, బీహెచ్ఈఎల్-అమీర్‌పేట, నాంపల్లి-చార్మినార్, మెహిదీపట్నం-హైటెక్‌సిటీ-కూకట్‌పల్లి, సికింద్రాబాద్-సైనిక్‌పురి, ఎల్‌బీనగర్-కోఠి. ఈ ప్రాంతాల్లో గాలి నాణ్యతను మెరుగుపరిచేందుకు ప్రత్యేక చర్యలు అవసరమని పీసీబీ స్పష్టం చేసిందివాయు కాలుష్యం పెరగడానికి కేవలం వాహనాలే కాకుండా, నగర శివార్లలో జరుగుతున్న నిర్మాణ పనులు, పరిశ్రమల ఉద్గారాలు కూడా ప్రధాన కారణమవుతున్నాయి. పీఎం-10 స్థాయి పెరగడం వల్ల శ్వాసకోశ వ్యాధులు, ఊపిరితిత్తుల సమస్యలు తలెత్తే ప్రమాదం ఉందని వైద్యులు హెచ్చరిస్తున్నారు. రాబోయే రోజుల్లో ఎలక్ట్రిక్ వాహనాల వాడకం పెంచకపోతే గాలి నాణ్యత మరింత పడిపోయే ప్రమాదం ఉంది.

## సంపాదకీయం



# దూసుకు వస్తున్న ఎఐ..అప్రమత్తతే ముఖ్యం !

భారత్‌ను గ్లోబల్ సౌత్‌కు సాంకేతిక కేంద్రంగా నిలబెట్టాలన్న లక్ష్యంతో ఈ సదస్సు నిర్వహిస్తున్నట్లు చెబుతున్నారు. అయితే, ఆ దిశలో తీసుకుంటున్న చర్యలేంటన్నది చర్చకు రావాలి. అంతర్జాతీయ స్థాయిలో నాయకత్వం వహించే సంగతి అలా ఉంచితే ప్రపంచ స్థాయికి సరితూగే లేదా దగ్గరగా ఉన్న పునాది స్థాయి వ్యవస్థ కూడా మన దగ్గర లేదు. ఈ రంగంలో ఇప్పటికే నాయకత్వం వహిస్తూ ప్రపంచానికి దిశా నిర్దేశర చేస్తున్న అమెరికా, చైనాలు పెద్ద ఎత్తున నైపుణ్యాలను, పరిశోధనలను విస్తృతం చేస్తుండగా, మనం ఏం చేయాలి, ఎలా చేయాలి అన్న దాని దగ్గరే ఉన్నాం. అనేకమంది మేధావులు మనచెంత ఉన్నారు. ఎఐ కి సంబంధించిన అనేక విషయాలను అంతర్జాతీయంగా గుర్తించిన నిపుణులు మనవాళ్లలో ఉన్నారు. ఫౌండేషన్ మోడల్ సంగతి అలా ఉంచితే, లార్జి మోడల్స్ ట్రైనింగ్‌కు అవసరమైన హైపర్ స్కేల్ డేటా సెంటర్లు కూడా అందుబాటులో లేవు. ఇవేవీ లేకుండా గ్లోబల్ లీడర్‌షిప్ గురించి, అప్పుడు వెల్లువెత్తే అవకాశాల గురించి మాట్లాడటం ఆకాశానికి నిచ్చెనలు వేయడమే అవుతుంది. సవాళ్లను గుర్తించి, అందుకు సమాధానాలను వెతుక్కునే సమయమిది. ఇంపాక్ట్ సమ్మిట్ కోసం నీతి ఆయోగ్ రూపొందించిన నివేదిక ప్రకారం ఎఐ రంగంలో మన దేశం పూర్తిస్థాయిలో సన్నద్ధం కావడానికి మరో పది నుండి ఇరవై ఏళ్లు పడుతుందని అంటున్నారు. 2047 నాటికి ఎఐ రంగంలో భారత్‌ను సూపర్ పవర్‌గా నిలపనున్నట్లు ప్రధాని నరేంద్రమోడీ చెప్పారు. 'కేవలం ఎఐ వినియోగదారునిగా కాకుండా ఎఐ సృష్టికర్తగా, ఎఐ విప్లవంలో భాగస్వామి దశ నుండి దానిని శాసించే స్థాయికి ఎదిగేలా తీర్చిదిద్దుతున్నాం' అని మోడీ అన్నారు. ఎఐ సదస్సులో ఇదే విషయం చెప్పారు. కొత్త సాంకేతికతను భారత్ ఎప్పటికప్పుడు అందిపుచ్చుకుంటోంది. ప్రతిభావంతులకు స్వర్గధామంగా భారత్ ఉంది. ఏఐ కేంద్రంగా ఇండియా మారుతోంది. ఏఐ అనేది ఓ పరివర్తన శక్తి. దాన్ని దుర్వినియోగం చేస్తే విధ్వంసానికి దారితీస్తుంది. ఏఐ అనేది యువత, భారత్‌కు కొత్త విశ్వాసం, ఆస్తిగా ఉంది. తొలినాళ్లలో ఏఐపై అనేక సందేహాలు వచ్చాయి. కానీ ఇప్పుడు ఏఐని యువత ప్రయోజనకరంగా ఉపయోగిస్తోంది. వివిధ రంగాల సమస్యలకు ఏఐ పరిష్కారం చూపుతోందని మోదీ తెలిపారు. శాస్త్ర సాంకేతిక రంగాల్లో శరవేగంగా మార్పులు చోటుచేసుకుంటున్న ప్రస్తుత తరుణంలో అప్పటికి పరిస్థితులు ఎలా ఉంటాయో, ఏ కొత్త సాంకేతికత ఉనికిలోకి వస్తుందో తెలియదు! మరోవైపు ప్రపంచంలో ఎఐ అభివృద్ధి విస్ఫోటనం చెందుతోంది. శక్తివంతమైన నమూనాలకు శిక్షణ ఇచ్చే కంప్యూటింగ్ శరవేగంగా పెరుగుతోంది. ప్రత్యేకమైన చిప్‌ల తయారీ కోసం పెద్దఎత్తున పోటీ జరుగుతోంది, భారీ టెక్ సంస్థలు ఎఐలోకి పెద్ద మొత్తాలను కుమ్మరిస్తున్నాయి. 2024 నుండి అమెరికా, చైనాలు ఈ రంగంపై దృష్టి సారించి భారీ మొత్తంలో ఖర్చు చేస్తున్నాయి. మన దేశంలో ఈ రంగ అభివృద్ధి కోసం ఇప్పుడిప్పుడే పరిశోధనలు మొదలయ్యాయి. మరోవైపు ఎఐ వద్ధి పేరుతో వ్యక్తిగత గోప్యతకు ముప్పు తలెత్తే ప్రమాదం ఉంది. ఉద్యోగ, ఉపాధి అవకాశాలపై ప్రభావం పడనుంది. న్యాయవ్యవస్థలో కూడా ఎఐ వినియోగంపై జాగ్రత్త అవసరమని ఇటీవల సుప్రీంకోర్టు సూచించింది. ఆరోగ్య రంగంలోనూ ఇటువంటి ఆందోళనలే వ్యక్తమవుతున్నాయి. మీడియా, రాజకీయ రంగాల్లో డీప్‌ఫేక్‌ల భయాలు ఇప్పటికే ప్రారంభమైనాయి. పెద్ద టెక్ సంస్థల ఆధిపత్యం పెరిగితే డేటా, మౌలిక వసతులు వారి చేతుల్లోనే కేంద్రీకృతమయ్యే ప్రమాదం ఉంది. వీటన్నింటిని దృష్టిలో ఉంచుకుని బలమైన పారదర్శక చట్టాలు, డేటా రక్షణ, నైతిక నియంత్రణ, సమగ్ర శిక్షణ విధానాలను రూపొందించాల్సి ఉంది. దేశంలో ఉన్న యువశక్తిని సమర్థవంతంగా వినియోగిం చుకోవడంతో పాటు, డేటా సెంటర్లు, ఫౌండేషన్ మోడల్స్, చిప్ తయారీ వంటి అంశాలపై దృష్టి సారించాలి. ఢిల్లీ ఎఐ సదస్సులో చోటుచేసుకున్న సాంకేతిక లోపాలతో పాటు, మేడ్ ఇన్ చైనా రోబోడాగ్‌ను తమ సొంత ఆవిష్కరణగా ప్రకటించుకుని నగుబాటైన గల్గోటియాస్ యూనివర్సిటీ నిర్వాకం అంతర్జాతీయ వేదికపై దేశ ప్రతిష్టను మసకబార్చాయి. భవిష్యత్తులో ఇటువంటివి జరగకుండా చూడాలి. అన్నింటికి మించి నిరుద్యోగానికి సవాల్‌గా మారిన ఐఎని ఎలా అధిగమించాలన్న దానిపై ప్రయత్నాలు జరగాలి.

ఎఐ దుష్ఫలితాలను చర్చించడం ద్వారా యువత భవిష్యత్ గురించి ఇప్పుడు ప్రపంచం ఆలోచించాలి. ఎఐతో పెనుముప్పు తప్పదని ప్రఖ్యాత కంపెనీలు, నిపుణులు హెచ్చరిస్తున్న వేళ దీనిపై ప్రధానంగా చర్చించాలి. ఎందుకంటే నిరుద్యోగాన్ఇన ఇది పెంచి పోషించడం ఖాయమని అంటున్నారు. దేశ రాజధాని ఢిల్లీలో జరుగుతున్న 'ఇండియా-ఎ.ఐ ఇంపాక్ట్ సమ్మిట్-2026' సందర్భంగా ప్రధానంగా దుష్ఫలితాలను చర్చించాలి. ఉద్యోగావకాశాలు పోతాయని అంటున్నప్పుడు దాని ప్రభావంతో జరిగే నష్టాన్ని చర్చించి, ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలి. ప్రాథమిక స్థాయి వ్యవస్థను పూర్తి స్థాయిలో స్వదేశీ పునాదిమీద ఏర్పాటు చేసుకోవడం భవిష్యత్తులో అన్ని విధాల మేలు చేస్తుందని నిపుణులు సూచిస్తున్నారు. అయితే, ఎలాంటి ముప్పు ఏర్పడబోతుందో అన్నది ప్రధానంగా ఎఐ సమ్మిట్‌లో చర్చిస్తే మంచిది. కేంద్రంలోని నరేంద్రమోడీ ప్రభుత్వం ఆ దిశలో నిపుణులతో కమిటీ వేసి చర్చించి, ఉపద్రవానికి ముందే చర్యలకు పూనుకోవాలి. ఢిల్లీ వేదికగా అట్టహాసంగా నిర్వహిస్తున్న ఎఐ సదస్సులో ఈ మేరకు ప్రకటన రావాల్సి ఉంది.



-గుర్రం పాపిరెడ్డి
ఎడిటర్

# విచారణలో కాలయాపనలు దేనికోసం?



ప్రభుత్వాలు నడుపుతున్న వ్యక్తులకు , పార్టీలకు జవాబుదారీతనం లేకుండా పోయింది. సవాళ్లు, ప్రతిసవాళ్ల తో సమస్యలను పక్కదారి పట్టించేస్తున్నారు. ప్రధానంగా ఇది తెలుగు రాష్ట్రాల్లో ఎక్కువగా కనిపిస్తోంది. సమస్యలను, అవినీతిపై పరస్పర విమర్శలు చేసుకుంటూ ఇది వారి వ్యక్తిగత వ్యవహారంగా ప్రచారం చేసుకునే రీతిలో ప్రవర్తిస్తున్నారు. ఎపిలో టిడిపి, వైసిపి, తెలంగాణలో కాంగ్రెస్, బిఆర్ఎస్ పరిస్థితి ఇలాగే ఉంది. పరస్పర విమర్శలతో ప్రజలను మభ్య పెటట్డం ద్వారా ఈ పార్టీలు పబ్బం గడుపుకునే పరిస్థితి దాపురించింది. నిజానికి ఈ వ్యవహారంపై అంటే అవినీతి ఆరోపణలపై కేంద్రం ప్రేక్షకపాత్ర వహిస్తోంది. బిఆర్ఎస్ హయాంలో జరిగిన ఫోన్ ట్యాపింగ్‌పై రెండేళ్లు దాటినా ఎలాంటి చర్యా తీసుకోలేదు. విచారణల తోనే కాలం గడిచింది. కేంద్ర ప్రభుత్వ టెలిగ్రాఫిక్ చట్టం ప్రకారం ఫోన్ ట్యాపింగ్ తీవ్ర నేరంగా పరిగణించాలి. బిఆర్ఎస్ పాలనా కాలంలో చాలా మంది ఫోన్ సంభాషణలను రికార్డు చేసినట్లు ఆరోపణలు వచ్చాయి. వ్యక్తిగత గోప్యతను హరించివేశారు. వాటి ఆధారాలను తుడిచిపెట్టారు. కేసీఆర్ కుటుంబ సభ్యులు తాము కూడా బాధితులమే అని చెప్పుకొంటున్నారంటే ఏ స్థాయిలో టెలిఫోన్ ట్యాపింగ్ దుర్వినియోగమయిందో అర్థం చేసుకోవచ్చు. ఇందుకు కవిత పదేపదే ఆరోపణలు చేస్తూనే ఉన్నారు. ప్రస్తుత దర్యాప్తుతో సత్వర న్యాయం కాదుకదా, అసలు న్యాయం జరుగుతుందన్న నమ్మకం లేదని అంటున్నారు. ప్రతిపక్షాలతోపాటు జర్నలిస్టులు, ఇతర ప్రముఖుల సంభాషణలు విని వారి కదలికలను తెలుసుకోవడం ద్వారా కేసీఆర్ వారిని కట్టడికి యత్నించారు. అధికారాన్ని కూడా నిలుపుకోవడానికి ఈ నీచయత్నానికి పాల్పడ్డారు. ఎలక్టోరల్ బాండ్స్ పొందడం కోసం టెలిఫోన్ ట్యాపింగ్‌ను సాధనంగా వాడుకున్నట్లు బయటపడింది. కెటిఆర్ విచారణలో ఇదే ప్రధానంగా ప్రస్తావనకు వచ్చింది. ఈ వ్యవహారంపై రెండేళ్లుగా విచారణ జరుగుతోంది. ఇంకెంత కాలం విచారణ జరుపుతారన్నది తెలియదు. సుప్రీంకోర్టు కూడా ఇటీవల ఒక సందర్భంలో ఇంకెంతకాలం అన్న విసయాన్ని ప్రస్తావించింది. టెలిఫోన్ ట్యాపింగ్‌పై అవసరమైన ఆధారాలు ఇప్పటికే ప్రభుత్వానికి లభించాయి. కావాలనుకుంటే ఇప్పటికిప్పుడు చర్యలు తీసుకోవచ్చు. అయినా విచారణను సాగదీస్తున్నారు. బహుశా కేసీఆర్, సంతోష్‌రావును కూడా త్వరలో విచారణకు పిలవవచ్చని అంటున్నారు. విచారణ ఎంత ఎక్కువ కాలం సాగితేస్తే అంతగా లబ్ది పొందాలని ప్రభుత్వం చూస్తున్నదా అన్నది కూడా తెలియాల్సి ఉంది. ఇదే అదనుగా ట్యాపింగ్ విచారణకు హాజరైన హరీశ్‌రావు, కేటీఆర్‌లు ప్రభుత్వంపై ఎదురుదాడి మొదలెట్టారు. వేధింపుల కోసం, ప్రభుత్వ అవినీతిని కప్పిపుచ్చుకునేందుకు ఈ విచారణలను కనసాగిస్తున్నారని బిఆర్ఎస్ నేతలు ఆరోపిస్తున్నారు. అయితే వీలైనంత త్వరగా ముగించడం, దోషలును శిక్షలకు గురి చేయడం అవసరం. గతంలో జరిగిన తప్పులపై చర్యలు తీసుకొనే విధంగా విచారణ సాగాలి. త్వరగా ముగించాలి. అలాకాకపోతే ఇదంతా అధికార విపక్షాల మధ్య నడిచే డ్రామాగా పరిగణించాల్సి ఉంటుంది. ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతోందని బీఆర్ఎస్ నాయకులు ఇప్పటికే విమర్శలు చేయడం మొదలెట్టారు. అతీగతీ లేకుండా విచారణలు సాగుతూ ముఖ్య నాయకులను విచారణల పేరిట పిలుస్తూ పోవడంవల్ల ప్రజలు సహజంగానే వారి విమర్శలను విశ్వసిస్తారు. టెలిఫోన్ ట్యాపింగ్ విచారణ సాగినంత కాలం బీఆర్ఎస్ నాయకులు సింగరేణి వంటి విషయాల్లో ప్రభుత్వంపై ఆరోపణలు చేస్తూనే ఉంటారు. ప్రస్తుతానికి టెలిఫోన్ ట్యాపింగ్ విషయమే హాట్ టాపిక్ అయింది. త్వరలో మరో వివాదం తెరపైకి రావొచ్చు. అప్పుడు ఇది కూడా తెర మరుగవుతుంది. ప్రభుత్వాలకు నిజంగా చిత్తశుద్ధి ఉంటే తప్పు చేసిన వారిపై చర్యలు తీసుకోవడానికి ఎంతో సమయం పట్టదు. అది సింగరేణి విషయమైనా, టెలిఫోన్ ట్యాపింగ్ విషయమైనా ఇదే సూత్రం వర్తిస్తుంది. ప్రభుత్వాలు బలంగా కోరుకున్న సందర్భాలలో విచారణలు వేగంగా పూర్తవుతాయి. శిక్షలు కూడా అంతే వేగంగా పడతాయి. రాజకీయ క్రీడలో భాగమైనప్పుడు మాత్రమే విచారణలు సాగుతూనే ఉంటాయి. ఆరోపణలు, విమర్శలు వెల్లువెత్తుతూనే ఉంటాయి. ఎదురుదాడి వ్యూహాలు పదునెక్కుతాయి. ఇక సింగరేణిపై అటు కేంద్రం.. ఇటు రాష్ట్ర ప్రభుత్వం విషం చిమ్ముతున్నాయి. చరిత్రలో ఎన్నడూ లేని నిబంధనలు పెడుతూ ఆ సంస్థను నిర్వీర్యం చేయడంతో పాటు ప్రైవేటీకరించే దిశగా అడుగులు వేస్తున్నాయని ఆరోపణలు వస్తున్నాయి. ఇప్పటికే రెండు బొగ్గు గనులను కేంద్రం వేలం ద్వారా అమ్మి ప్రైవేట్‌కు ద్వారాలు తెరువగా.. ఇప్పుడు రేవంత్ సర్కార్ కూడా అదేబాటలో నడుస్తున్నది. ఓవర్ బర్డెన్ పనులకు 'సైట్ విజిట్' నిబంధనను ముందుగా తెచ్చి, ఆ తర్వాత నైని బొగ్గు బ్లాక్‌లో ఏకంగా బొగ్గు ఉత్పత్తి ని ప్రైవేట్ వ్యక్తులకు అప్పగించేందుకు భట్టి తదితరలుఉ రంగంలోకి దిగారని అంటున్నారు. సింగరేణి చేతిలో ఉండాల్సిన ఈ గనిని 25 ఏండ్ల పాటు ప్రైవేట్ కంపెనీల చేతుల్లో పెట్టేందుకు రంగం సిద్ధం చేసింది. అంటే పేరు మాత్రమే సింగరేణిది, గనిపై పూర్తి అధికారాలు ప్రైవేట్

అరుణ ప్రభ
ARUNAPRABHA TELUGU DAILY
మంగళవారం, సెప్టెంబరు 8, 2026

# అధిక వడ్డీ వసూళ్లపై పోలీసుల ఉక్కుపాదం!

## 8 మంది వడ్డీ వ్యాపారులకు డీఎస్పీ కౌన్సెలింగ్
## రుణగ్రహీతల ఇళ్ల వద్దకు వెళ్లి బెదిరిస్తే కఠిన చర్యలు డీఎస్పీ బి.వి. జగన్నాథ్‌రాజు



అరుణ ప్రభ

అప్పుల ఉచ్చు.. ఆత్మహత్యాయత్నం!

పేదల ఆర్థిక అవసరాలను ఆసరాగా చేసుకున్న అధిక వడ్డీ వ్యాపారులు..

ధర్మవరంలో అక్రమ ఫైనాన్స్‌పై ప్రత్యేక డ్రైవ్ అవసరం





ధర్మవరం, సెప్టెంబర్ 7; (అరుణ ప్రభ న్యూస్) అధిక వడ్డీలకు అప్పులు ఇస్తూ.. డబ్బుల వసూళ్ల పేరుతో రుణగ్రహీతలను వేధిస్తున్నారన్న ఆరోపణలపై ధర్మవరం పోలీసులు దృష్టి సారించారు. అధిక వడ్డీలకు అప్పులు ఇస్తున్నట్లు గుర్తించిన 8 మందిని డీఎస్పీ కార్యాలయానికి పిలిపించి కౌన్సెలింగ్ నిర్వహించారు. రుణగ్రహీతలు సకాలంలో డబ్బులు చెల్లించలేదనే కారణంతో వారి ఇళ్ల వద్దకు వెళ్లి గొడవలు చేయడం, బెదిరించడం, అసభ్యంగా ప్రవర్తించడం లేదా ఇతర విధాలుగా వేధింపులకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తప్పవని డీఎస్పీ బి.వి. జగన్నాథ్‌రాజు స్పష్టం చేశారు.

**'చట్టాన్ని చేతుల్లోకి తీసుకోవద్దు'**

అధిక వడ్డీలకు అప్పులు ఇస్తున్న కొంతమందిని గుర్తించి, వారికి చట్టపరమైన అంశాలపై అవగాహన కల్పించేందుకే కౌన్సెలింగ్ నిర్వహించినట్లు డీఎస్పీ తెలిపారు. అప్పు ఇచ్చినంత మాత్రాన రుణగ్రహీతలపై తమకు ఇష్టానుసారం ఒత్తిడి తెచ్చే హక్కు ఎవరికీ లేదని, డబ్బుల వసూళ్ల విషయంలో ఎవరూ చట్టాన్ని చేతుల్లోకి తీసుకోవద్దని ఆయన సూచించారు.

**ఇళ్ల వద్దకు వెళ్లి బెదిరిస్తే చర్యలు**

రుణగ్రహీతలు డబ్బులు చెల్లించడంలో ఆలస్యం చేసినా.. వారి ఇళ్ల వద్దకు వెళ్లి గొడవలు చేయడం, బెదిరించడం, అసభ్యంగా ప్రవర్తించడం, మానసికంగా వేధించడం వంటి చర్యలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని డీఎస్పీ హెచ్చరించారు. అప్పు వసూలు పేరుతో రుణగ్రహీతలు లేదా వారి కుటుంబ సభ్యులను వేధించడం ఏమాత్రం సహించబోమని స్పష్టం చేశారు.

**వేధింపులకు గురైతే పోలీసులకు ఫిర్యాదు చేయాలి**

అధిక వడ్డీల వ్యవహారంలో ఎవరైనా వేధింపులకు గురైతే భయపడకుండా సమీప పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని డీఎస్పీ బి.వి. జగన్నాథ్‌రాజు సూచించారు. ప్రజల ఆర్థిక ఇబ్బందులను ఆసరాగా చేసుకుని అధిక వడ్డీలకు అప్పులు ఇచ్చి, అనంతరం వసూళ్ల పేరుతో వేధింపులకు పాల్పడే వ్యవహారాలపై పోలీసులు దృష్టి సారించడం ప్రాధాన్యత సంతరించుకుంది.

**'అరుణ ప్రభ' కథనానికి పోలీసుల స్పందన**

ధర్మవరంలో అధిక వడ్డీ వ్యాపారం, రుణగ్రహీతలపై ఒత్తిళ్లు, అప్పుల బాధతో కుటుంబాలు ఎదుర్కొంటున్న ఇబ్బందులపై 'అరుణ ప్రభ న్యూస్'లో ఇటీవల ప్రచురితమైన ప్రత్యేక కథనం నేపథ్యంలో పోలీసుల ఈ చర్య ప్రాధాన్యత సంతరించుకుంది. ఒక కుటుంబం ఆత్మహత్య అంచుల వరకు వెళ్లే పరిస్థితి ఏర్పడిన నేపథ్యంలో.. సమస్యను కేవలం వ్యక్తిగత అప్పు వ్యవహారంగా కాకుండా సామాజిక సమస్యగా చూడాల్సిన అవసరాన్ని 'అరుణ ప్రభ' కథనం వెలుగులోకి తెచ్చింది. ఇదే సమయంలో పోలీసులు 8 మంది అధిక వడ్డీ వ్యాపారులను గుర్తించి కౌన్సెలింగ్ నిర్వహించడం, రుణగ్రహీతలను బెదిరిస్తే చర్యలు తప్పవని హెచ్చరించడం.. అక్రమ వడ్డీ వసూళ్లపై పోలీసుల దృష్టి మరింత పెరిగిన సంకేతంగా కనిపిస్తోంది.

**బాధితులకు భరోసా.. వడ్డీ వ్యాపారులకు హెచ్చరిక**

అప్పు తీసుకున్న వ్యక్తి రుణం చెల్లించాల్సిన బాధ్యత ఉన్నప్పటికీ.. అప్పు వసూలు పేరుతో చట్టవిరుద్ధంగా వేధించే హక్కు ఎవరికీ లేదన్న పోలీసుల హెచ్చరిక రుణగ్రహీతలకు భరోసా కల్పిస్తోంది. ధర్మవరం పట్టణంలో అధిక వడ్డీల వ్యవహారంపై పోలీసులు మరింత లోతుగా దృష్టి సారించి, చట్టవిరుద్ధంగా వడ్డీ వ్యాపారం చేస్తున్న వారి వివరాలను పూర్తిస్థాయిలో పరిశీలిస్తే మరిన్ని విషయాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది.

**అప్పు తీసుకున్నవాడు నేరస్థుడు కాదు..**

**అప్పు వసూలు పేరుతో చట్టాన్ని ఉల్లంఘిస్తే మాత్రం చర్యలు తప్పవు!**

# భద్రత, బందోబస్తు కోసమే గణేష్ మండపాల ఆన్‌లైన్ నమోదు

## మండప నిర్వాహకులు పోలీసు శాఖ పోర్టల్‌లో వివరాలు నమోదు చేసుకోవాలి: జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే

ఎల్లారెడ్డిపేట అరుణప్రభ): రాబోయే గణేష్ ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు పోలీసు శాఖ ఆధ్వర్యంలో గణేష్ మండపాల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసుకునే విధానాన్ని అమలు చేస్తున్నట్లు రాజన్న సిరిసిల్ల జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే తెలిపారు. గణేష్ మండపాల నిర్వాహకులు పోలీసు శాఖ రూపొందించిన ప్రత్యేక పోర్టల్ ద్వారా మండపానికి సంబంధించిన వివరాలను నమోదు చేసుకుని పోలీసు శాఖకు సహకరిం చాలని ఆయన సూచించారు. గణేష్ విగ్రహాలను వివిధ ప్రాంతాల్లో ఏర్పాటు చేయడానికి ముందు నిర్వాహకులు ముందస్తుగా స్థానిక పోలీస్‌స్టేషన్‌కు సమాచారం అందించాలని ఎస్పీ సూచించారు. మండపం ఏర్పాటు, నిర్వహణకు సంబంధించిన సమాచారాన్ని కంప్యూటర్ లేదా మొబైల్ ఫోన్ ద్వారా ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవచ్చని తెలిపారు. ఆన్‌లైన్‌లో నమోదు చేసుకునే వెబ్‌సైట్: http://policeportal. tspolice.gov.in/index.htm ఈ ఆన్‌లైన్ ఇన్ఫర్మేషన్ విధానం కేవలం గణేష్ మండపాల నిర్వహణకు సంబంధించిన వివరాలను సేకరించడం, మండపాల వద్ద భద్రత మరియు బందోబస్తు ఏర్పాట్లు సులభతరం చేయడం కోసమే రూపొందించినట్లు ఎస్పీ మహేష్ బి. గితే స్పష్టం చేశారు. దీనికి ఎలాంటి రుసుము చెల్లించాల్సిన అవసరం లేదని తెలిపారు. గణేష్ ఉత్సవాల సందర్భంగా పెద్ద సంఖ్యలో భక్తులు, ప్రజలు మండపాలను సందర్శించే అవకాశం ఉన్నందున, ఆయా ప్రాంతాల్లో అవసరమైన భద్రతా చర్యలు, పోలీసు బందోబస్తును ముందస్తుగా ప్రణాళిక చేసుకోవడానికి మండపాల వివరాలు పోలీసులకు అందుబాటులో ఉండటం ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని ఎస్పీ పేర్కొన్నారు. మండప నిర్వాహకులు తమ మండపానికి సంబంధించిన పూర్తి వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవడంతో పాటు, స్థానిక పోలీసులకు ముందస్తు సమాచారం అందించి పోలీసు శాఖకు సహకరించాలని ఆయన కోరారు. గణేష్ ఉత్సవాలను శాంతియుతంగా, సురక్షితంగా నిర్వహించేందుకు ప్రతి ఒక్కరూ పోలీసు శాఖ సూచనలు, నిబంధనలు పాటించాలని ఎస్పీ మహేష్ బి. గితే విజ్ఞప్తి చేశారు.



# కేంద్ర కనీస వేతనాల సలహా మండలిలో సిఐటియు ప్రాతినిధ్యం కల్పించాలి

## సిఐటియు సిద్దిపేట జిల్లా అధ్యక్షులు సందబోయిన ఎల్లయ్య



గజ్వేల్ అరుణ ప్రభ : కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన కనీస వేతనాల సలహా మండలిలో సిఐటియుకు ప్రాతినిధ్యం కల్పించాలని కల్పించాలని సిఐటియు సిద్దిపేట జిల్లా అధ్యక్షులు సందబోయిన ఎల్లయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు సిఐటియు ఆధ్వర్యంలో గజ్వేల్ పట్టణంలో అంబేద్కర్ చౌరస్తాలో ప్లే కార్డులతో నిరసన వ్యక్తం చేయడం జరిగింది ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ప్రజాస్వామ్యం కూని చేస్తున్నదని కార్మిక వర్గం తరపున పోరాడుతున్న సిఐటియుకు కేంద్ర కనీస వేతనాలు సలహా మండల్లో స్థానం కల్పించలేదని అన్నారు ఇటీవల ప్రకటించిన కేంద్ర కనీస వేతన సలహా మండలి గోప్యంగా ఉంచిందని సలహా మండలిలో ప్రభుత్వ అధికారులు, యజమాన్యం ప్రతినిధులు కార్మిక సంఘాల ప్రతినిధులు ఉంటారని కానీ కేంద్రం ప్రకటించిన కనీస వేతనం సలహా మండల్లో కార్మిక సంఘాల తరపున సిఐటియు ఏఐటియూసి ఐఎన్టియుసి కార్మిక సంఘాలకు స్థానం కల్పించలేదని ప్రభుత్వానికి వత్తాసు పడే సంఘాలకు భాగస్వామ్యం చేసిందని అన్నారు కేంద్ర ప్రభుత్వం నిర్ణయాలను కార్మిక వర్గం గమనించాలని, కార్మిక కోడలు అమలు చేసే కుట్రలో భాగంగా కార్మిక వర్గం పై భారాలను సిఐటియు అడ్డుకుంటుందని, ప్రజా వ్యతిరేక విధానాలను కార్మికుల్లో ప్రచారం చేసిందని ఇటువంటి చర్యలకు పూనుకున్నదాని అన్నారు కార్మిక వర్గం పోరాటాల సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిఐటియూ జిల్లా సహాయ కార్యదర్శి చంద్రారెడ్డి, జిల్లా నాయకులు సధాకర్ కనరాజు పరశురాములు భూపతి రాజు యాదగిరి ప్రవీణ్ బండ్ల శ్రీను రవి శ్రావణ్ రాజేందర్ రెడ్డి, మురళి, ఆంజనేయులు, రమేష్ తదితరులు పాల్గొన్నారు

# తీన్మార్ మల్లన్న ఖబడ్దార్..

## రెడ్డి జాతిని కించపరిస్తే సహించేది లేదు
## రెడ్డి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బద్దూరి వెంకటేశ్వర్ రెడ్డి హెచ్చరిక



హైదరాబాద్:అరుణ ప్రభ.కులం పేరుతో రాజకీయ పబ్బం గడపడం తప్ప తీన్మార్ మల్లన్న చేసిన గొప్ప పని ఏమిటో ఒక్కసారి ఆత్మపరిశీలన చేసుకోవాలని రెడ్డి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బద్దూరి వెంకటేశ్వర్ రెడ్డి అన్నారు. కులం పేరుతో సమాజంలో అన్నదమ్ముల్లా జీవిస్తున్న ప్రజల మధ్య చిచ్చుపెట్టే విధంగా వ్యాఖ్యలు చేయడం సరికాదని ఆయన మండిపడ్డారు. రెడ్డి సామాజిక వర్గం పేరుతో యువతను పక్కదారి పట్టించే ప్రయత్నాలను మానుకోవాలని సూచించారు. తన సామాజిక వర్గానికి చెందిన ఎంతమంది యువతకు విద్య, ఉద్యోగ అవకాశాలు కల్పించారో మల్లన్న ఆత్మపరిశీలన చేసుకోవాలని అన్నారు. అలాగే తనను గెలిపించిన పట్టభద్రుల్లో ఎంతమందికి ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు కృషి చేశారో ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. "ప్రజా సమస్యలపై దృష్టి పెట్టకుండా, ఒక సామాజిక వర్గాన్ని లక్ష్యంగా చేసుకుని విమర్శలు చేయడం రాజకీయ పబ్బం గడపడమే" అని బద్దూరి వెంకటేశ్వర్ రెడ్డి విమర్శించారు. సమాజంలో ఏ సామాజిక వర్గానికి చెందిన వ్యక్తి తప్పు చేసినా ఆ తప్పును తప్పుగానే చూడాలని, కులం మొత్తాన్ని నిందించడం సరికాదన్నారు. రెడ్డి సామాజిక వర్గాన్ని పదేపదే విమర్శించడం ద్వారా ప్రజల దృష్టిని అసలు సమస్యల నుంచి మళ్లించే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. "మా రెడ్డి జాతిని కించపరిచేలా మరోసారి మాట్లాడితే సహించేది లేదు. ఒళ్లు దగ్గర పెట్టుకుని మాట్లాడాలి" అని ఆయన హెచ్చరించారు. కులాల మధ్య ఐక్యతను దెబ్బతీసే వ్యాఖ్యలు చేయకుండా, ప్రజా సమస్యలు, యువత భవిష్యత్తు, విద్యా--ఉద్యోగ అవకాశాలపై దృష్టి సారించాలని బద్దూరి వెంకటేశ్వర్ రెడ్డి సూచించారు. సామాజిక వర్గాల మధ్య విద్వేషాలు పెంచే ప్రయత్నాలను రెడ్డి సంఘం తీవ్రంగా వ్యతిరేకిస్తుందని స్పష్టం చేశారు.

# వినాయక మండపాల నిర్వాహకులతో సమన్వయ సమావేశం

ఎల్లారెడ్డిపేట, సెప్టెంబర్ 7 (అరుణప్రభ న్యూస్): వినాయక చవితి వేడుకలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు పోలీస్ శాఖ ఆధ్వర్యంలో వినాయక మండపాల నిర్వాహకులతో సమన్వయ సమావేశం నిర్వహించనున్నారు. మంగళవారం సెప్టెంబర్ 8న ఉదయం 10 గంటలకు పద్మనాయక ఫంక్షన్ హాల్‌లో ఈ సమావేశం జరగనుంది. ఈ సమావేశానికి జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే, ఐపీఎస్ హాజరై వినాయక ఉత్సవాల సందర్భంగా మండపాల నిర్వాహకులు పాటించాల్సిన నిబంధనలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలు, శాంతిభద్రతల పరిరక్షణకు పోలీస్ శాఖ చేపడుతున్న చర్యలపై అవగాహన కల్పించనున్నారు. వినాయక మండపాల నిర్వాహకులు సమావేశానికి హాజరై పోలీస్ శాఖ సూచనలు, నిబంధనలను తెలుసుకుని ఉత్సవాలను సురక్షితంగా, ప్రశాంతంగా నిర్వహించేందుకు సహకరించాలని అధికారులు కోరారు.

# స్పీకర్‌పై అనుచిత వ్యాఖ్యలు సరికావు

## సభాపతి గడ్డం ప్రసాద్‌కుమార్‌పై తాతా మధు వ్యాఖ్యలను ఖండించిన చిలుక మధుసూదన్‌రెడ్డి



హైదరాబాద్: తెలంగాణ శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌పై బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధు చేసిన అనుచిత వ్యాఖ్యలను గడ్డిఅన్నారం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ చిలుక మధుసూదన్‌రెడ్డి తీవ్రంగా ఖండించారు. రాజ్యాంగం కల్పించిన అత్యున్నతమైన సభాపతి పదవిలో ఉన్న వ్యక్తిపై అభ్యంతరకరమైన భాషను ఉపయోగించడం ప్రజాస్వామ్య వ్యవస్థకు తగదని అన్నారు. రాజకీయ విభేదాలు ఉన్నప్పటికీ వ్యక్తిగతంగా, కుటుంబ సభ్యులను ఉద్దేశించి అవమానకర వ్యాఖ్యలు చేయడం సరికాదని పేర్కొన్నారు. సభా ప్రాంగణంలో స్పీకర్‌ను, ఆయన కుటుంబ సభ్యులను కించపరిచేలా మాట్లాడటం అత్యంత తీవ్రమైన విషయమని మధుసూదన్‌రెడ్డి అన్నారు. ఈ ఘటనను కేవలం ఒక వ్యక్తికి జరిగిన అవమానంగా కాకుండా శాసనసభ గౌరవానికి సంబంధించిన అంశంగా చూడాలని సూచించారు. తెలంగాణ ప్రజల ఆత్మగౌరవానికి సంబంధించిన విషయంగా రాజకీయాలకు అతీతంగా ప్రతి ఒక్కరూ ఖండించాల్సిన అవసరం ఉందన్నారు. సభా మర్యాదలను ఉల్లంఘించిన సభ్యుడిపై నిబంధనల ప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. స్పీకర్, ఆయన కుటుంబ సభ్యులకు ప్రతిపక్ష నాయకులు క్షమాపణ చెప్పాలని కోరారు. ఇలాంటి వ్యాఖ్యలు, దుర్మార్గపు రాజకీయ పోకడలు పునరావృతం కాకుండా నియంత్రించాల్సిన బాధ్యత అన్ని పార్టీలపైనా ఉందన్నారు. అసెంబ్లీకి హాజరుకాకుండా పార్టీ నేతలను ప్రోత్సహిస్తున్నారంటూ బీఆర్ఎస్ అధినేత, ప్రతిపక్ష నేత కేసీఆర్‌పై కూడా మధుసూదన్‌రెడ్డి విమర్శలు చేశారు. ఈ వ్యవహారంపై కేసీఆర్ తక్షణమే క్షమాపణ చెప్పడంతో పాటు ప్రతిపక్ష నేత పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. సభా గౌరవాన్ని, రాజ్యాంగ వ్యవస్థల ప్రతిష్ఠను కాపాడేందుకు అందరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని కోరారు.

# ముఖ్యమంత్రి సహాయ నిధి పేదలకు వరం

## నిమ్స్‌లో చికిత్స పొందుతున్న జాలిగామ వాసికి రూ.5 లక్షల ఎల్‌ఓసీ మంజూరు
## టీపీసీసీ అధికార ప్రతినిధి భండారు శ్రీకాంత్‌రావు

గజ్వేల్ అరుణ ప్రభ : ముఖ్యమంత్రి సహాయ నిధి పేద, మధ్యతరగతి కుటుంబాలకు అండగా నిలుస్తోందని టీపీసీసీ అధికార ప్రతినిధి భండారు శ్రీకాంత్‌రావు అన్నారు.జాలిగామ గ్రామానికి చెందిన మహమ్మద్ కాజా బేగం అనారోగ్యంతో హైదరాబాద్‌లోని నిమ్స్ ఆసుపత్రిలో ఆపరేషన్ కోసం చేరారు. వైద్య చికిత్సకు అయ్యే ఖర్చుల కోసం ఎల్‌ఓసీ సాయం కోరగా, రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ సహకారంతో రూ.5 లక్షల ఎల్‌ఓసీ మంజూరైంది. మంజూరైన ఎల్‌ఓసీ పత్రాన్ని టీపీసీసీ అధికార ప్రతినిధి భండారు శ్రీకాంత్‌రావు, తీగుల్ మాజీ సర్పంచ్ కప్పర భానుప్రకాశ్‌రావు చేతుల మీదుగా బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబ సభ్యులు మాట్లాడుతూ.. వైద్య చికిత్స కోసం రూ.5 లక్షల ఎల్‌ఓసీ మంజూరు చేయించిన మంత్రి దామోదర్ రాజనర్సింహకు కృతజ్ఞతలు తెలిపారు. అలాగే తమకు అండగా నిలిచిన టీపీసీసీ అధికార ప్రతినిధి భండారు శ్రీకాంత్‌రావు, తీగుల్ మాజీ సర్పంచ్ కప్పర భానుప్రకాశ్‌రావులకు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాచారం దేవస్థానం డైరెక్టర్ నాయకం శ్రీనివాస్, కొండపోచమ్మ దేవస్థానం డైరెక్టర్ కుమ్మరి ఆనంద్, మంగలి యాదగిరి, నవీన్ గౌడ్, యువజన కాంగ్రెస్ నాయకులు గోవిందు మనోజ్‌కుమార్, నవీన్‌చారి, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# కార్మికుల వేదికను రాజకీయ అజెండాలకు వాడుకోవడం ఇక చెల్లదు

### కేంద్ర కనీస వేతన సలహా మండలి నుంచి కమ్యూనిస్టు యూనియన్ల తొలగింపు హర్షణీయం
### బీఎంఎస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి సల్ల శ్రీనివాస్



గజ్వేల్ అరుణ ప్రభ : కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఏర్పాటు చేసిన కేంద్ర కనీస వేతన సలహా మండలిని రాజకీయ ప్రయోజనాలకు వేదికగా ఉపయోగించడం ఇకనైనా మానుకోవాలని రాణే మద్రాస్ లిమిటెడ్ ప్రజ్ఞాపూర్ భారతీయ మజ్దూర్ సంఘ్ (బీఎంఎస్) యూనియన్ ప్రధాన కార్యదర్శి సల్ల శ్రీనివాస్, వర్కింగ్ ప్రెసిడెంట్ పి. శ్రీశైలం అన్నారు. కార్మికుల సమస్యలపై సమర్థవంతంగా పనిచేయాల్సిన కొన్ని యూనియన్లు కార్మిక ప్రయోజనాల కంటే సొంత రాజకీయ, ఆర్థిక ప్రయోజనాలు, స్వార్థపూరిత అజెండాలకు ప్రాధాన్యత ఇవ్వడం విచారకరమని వారు విమర్శించారు. మండలిలో కొనసాగుతున్న అంతర్గత విభేదాలు, గ్రూపుల మధ్య తగాదాలు, పరస్పర రాజకీయ ఆధిపత్య పోరాటాల కారణంగా కార్మికుల అసలు సమస్యలు పక్కకు నెట్టబడుతున్నాయని ఆరోపించారు. కార్మికుల వేతనాలు, సంక్షేమం కోసం ఏర్పాటు చేసిన వేదికను రాజకీయ ప్రయోగశాలగా మార్చడం ఎంతమాత్రం సమర్థనీయం కాదని అన్నారు. మూడు గ్రూపుల మధ్య తగాదాలతో పాటు, రాజకీయ అవసరాలు, సొంత అజెండాల కోసం పనిచేస్తున్న కమ్యూనిస్టు యూనియన్లను మండలి నుంచి తొలగించడం కార్మిక ప్రయోజనాల దృష్ట్యా స్వాగతించదగిన పరిణామమని సల్ల శ్రీనివాస్ పేర్కొన్నారు. కార్మికుల పేరుతో రాజకీయాలు చేయడం, కార్మిక సమస్యలను రాజకీయ ప్రయోజనాలకు ఉపయోగించుకోవడం ఇకనైనా మానుకోవాలని ఆయన సూచించారు. కనీస వేతనాలు, కార్మిక హక్కులు, ఉద్యోగ భద్రత, సామాజిక భద్రత, సంక్షేమం వంటి మౌలిక సమస్యలపై చిత్తశుద్ధితో పనిచేసే ప్రతినిధులకే కీలకమైన మండళ్లలో ప్రాతినిధ్యం కల్పించాలని డిమాండ్ చేశారు. కార్మికుల హక్కుల విషయంలో భారతీయ మజ్దూర్ సంఘ్ ఎప్పటికీ రాజీపడదని, కార్మిక ప్రయోజనాలే బీఎంఎస్‌కు ఏకైక అజెండా అని సల్ల శ్రీనివాస్ స్పష్టం చేశారు. రాజకీయ రంగులు, గ్రూపుల విభేదాలకు అతీతంగా దేశంలోని కార్మికుల న్యాయమైన హక్కులు, గౌరవప్రదమైన వేతనాలు, సంక్షేమం కోసం బీఎంఎస్ తన పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తుందని తెలిపారు.




# పౌష్టికాహారంతోనే తల్లీబిడ్డల ఆరోగ్యం

## జాతీయ పౌష్టికాహార వారోత్సవాల ముగింపు

ధర్మవరం, సెప్టెంబర్ 07; (అరుణ ప్రభ న్యూస్): పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో జాతీయ పౌష్టికాహార వారోత్సవాలు ముగిశాయి. ఈ సందర్భంగా మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో గర్భిణులకు ఆసుపత్రి సూపరింటెండెంట్ త్రిపేంద్ర నాయక్ చేతుల మీదుగా రొట్టెలు, పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వైద్యులు మాట్లాడుతూ గర్భిణులు చిరుధాన్యాలు, ఆకుకూరలు, పండ్లు, సమతుల్య ఆహారం తీసుకోవాలని సూచించారు. నెలవారీ వైద్య పరీక్షలు తప్పనిసరిగా చేయించుకోవాలని, ప్రభుత్వ ఆసుపత్రి సేవలను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. తగినంత విశ్రాంతి, మంచి నిద్రతో పాటు ప్రశాంతమైన వాతావరణం అవసరమన్నారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ త్రిపేంద్ర నాయక్, గైనకాలజిస్ట్ డాక్టర్ జయలక్ష్మి, డాక్టర్ సురేష్, డాక్టర్ నజీర్, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు సంకారపు నరసింహులు, మానవత సంస్థ అధ్యక్షుడు శంకర్ నాయుడు, ఉపాధ్యక్షుడు మంజునాథ్, వైద్య సిబ్బంది, సంస్థ సభ్యులు పాల్గొన్నారు.



## నేటి నుండీ ధర్మవరంలో మంత్రి సత్యకుమార్ పర్యటన

### రెండు రోజుల పాటు పలు కార్యక్రమాల్లో పాల్గొననున్న మంత్రి

ధర్మవరం, సెప్టెంబర్ 07; (అరుణ ప్రభ న్యూస్): ధర్మవరం ఎమ్మెల్యే, రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ సెప్టెంబర్ 8, 9 తేదీల్లో ధర్మవరంలో పర్యటించనున్నట్లు మంత్రి నియోజకవర్గ ఇన్‌చార్జ్ హరీష్ బాబు తెలిపారు. సెప్టెంబర్ 8న ఉదయం 10 గంటలకు సిఎన్‌బి కళ్యాణ మండపంలో నిర్వహించే మెగా ఉద్యోగ మేళాలో మాజీ డీఆర్‌డీఓ చైర్మన్, ఏపీ ప్రభుత్వ సలహాదారు జి. సతీష్ రెడ్డితో కలిసి మంత్రి పాల్గొంటారు. సెప్టెంబర్ 9న ఉదయం 9 గంటలకు కళాజ్యోతి సర్కిల్ వద్ద మున్సిపల్ కాంప్లెక్స్‌పై ఏర్పాటు చేసిన యోగా కేంద్రాన్ని ప్రారంభిస్తారు. ఉదయం 10 గంటలకు గొట్లూరు గ్రామంలో నిర్వహించే ఓబీసీ జిల్లా కార్యవర్గ సమావేశంలో పాల్గొంటారు. మంత్రి పర్యటనను ప్రజలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు విజయవంతం చేయాలని హరీష్ బాబు కోరారు.



# అర్హులైన నేతలకు నేతన్న నేస్తం అందే వరకు పోరాటం

### అవకతవకలపై మా వద్ద ఆధారాలు ఉన్నాయి : మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి

ధర్మవరం, సెప్టెంబర్ 07; (అరుణ ప్రభ న్యూస్): అర్హులైన చేనేత కార్మికులందరికీ నేతన్న నేస్తం అందే వరకు తమ పోరాటం కొనసాగుతుందని మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి స్పష్టం చేశారు. ధర్మవరంలో గుడ్ మార్నింగ్ కార్యక్రమాన్ని తిరిగి ప్రారంభించిన ఆయన ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ముఖ్యంగా నేతన్న నేస్తం అందని చేనేత కార్మికుల ఇళ్లకు వెళ్లి వివరాలు సేకరించారు. నేతన్న నేస్తం పథకంలో భారీగా అవకతవకలు జరిగాయని, తమ వద్ద ఆధారాలు ఉన్నాయని కేతిరెడ్డి ఆరోపించారు. నిజమైన చేనేత కార్మికులకు సాయం అందకపోవడం బాధాకరమన్నారు. అర్హులైన ప్రతి నేత కార్మికుడికి పథకం అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

**విద్యా వ్యవస్థపైనా విమర్శలు**

విద్యా వ్యవస్థలో చోటుచేసుకున్న అవకతవకలపై ప్రభుత్వం సమగ్ర విచారణ చేపట్టాలని కేతిరెడ్డి డిమాండ్ చేశారు. క్రీడా కోటాలో అర్హత లేనివారికి అవకాశాలు ఎలా కల్పించారని ప్రశ్నించారు. డీఎస్సీ అంశంలో సీబీఐ విచారణ ఎందుకు చేపట్టడం లేదని మంత్రి నారా లోకేష్‌ను ప్రశ్నించారు. మున్సిపల్, పంచాయతీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేసిన కేతిరెడ్డి, ప్రజా సమస్యల పరిష్కారం కోసం భవిష్యత్తులో పార్టీ ఆధ్వర్యంలో మరిన్ని పోరాటాలు చేపడతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ కౌన్సిలర్లు, వార్డు ఇన్‌చార్జులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## నూతన పింఛన్లకు దరఖాస్తులు ఆహ్వానం

### ::: సెప్టెంబర్ 7 నుంచి 16 వరకు గడువు



ధర్మవరం, సెప్టెంబర్ 07; (అరుణ ప్రభ న్యూస్): ఎన్టీఆర్ భరోసా నూతన పింఛన్లకు అర్హులైన వారు సెప్టెంబర్ 7 నుంచి 16వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీవో వెంకటేశు తెలిపారు. వృద్ధులు, వితంతువులు, వికలాంగులు, ఒంటరి మహిళలు తదితర అర్హులు సంబంధిత గ్రామ సచివాలయాల్లో దరఖాస్తులు సమర్పించాలని సూచించారు. ఆధార్, రేషన్ కార్డు లేదా ఆదాయ ధ్రువీకరణ పత్రం తప్పనిసరిగా సమర్పించాలన్నారు. వితంతువులు భర్త మరణ ధ్రువీకరణ పత్రం, వికలాంగులు 40 శాతం లేదా అంతకంటే ఎక్కువ వైకల్యాన్ని చూపే సదరం ధ్రువీకరణ పత్రం సమర్పించాలని తెలిపారు. సెప్టెంబర్ 17--21 వరకు దరఖాస్తుల పరిశీలన, 22--24 వరకు క్షేత్రస్థాయి పరిశీలన జరుగుతుందని ఎంపీడీవో వెల్లడించారు. అర్హులైన వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.



## మంచిరెడ్డి పల్లి గ్రామంలో రైతుల సమావేశం

అరుణ ప్రభ పత్రిక ప్రతినిధి సంగారెడ్డి జిల్లా : సదాశివపేట మండలం మాచిరెడ్డిపల్లి గ్రామంలో రైతుల సమావేశం నిర్వహించబడినది ఈ సమావేశంలో వరిలో సన్న రకాలు వేసిన రైతులు పంట వివరాలు నమోదు చేసుకోగలరని కోరుచున్నాము .రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల అనుసారం ప్రభుత్వం ప్రకటించిన వరిలో సన్న రకాలు సాగు చేసిన రైతులకు అదనంగా 500 రూపాయలు బోనస్ ప్రకటించడం జరిగినది ప్రభుత్వం ప్రకటించిన వరిలో ఏడు సన్న రకాలు ఏవనగా 1)బిపిటి 5204 2) ఎమీ సోనా 3) =చీ= 15048 తెలంగాణ సోనా 4) కే ఎన్ ఎం 1638 5) జైశ్రీరామ్ 6)wgl 44 సిద్ధి 7) కెఎన్‌ఎమ్ 7715 కావున రైతులందరికీ తెలియజేయునది ఏమనగా ప్రభుత్వం ప్రోత్సహిస్తున్న వరిలో సన్న రకాలు ఎవరైతే సాగు చేశారో ఆ రైతులందరూ సంబంధిత డీలర్ దగ్గర గాని ఏఈఓ దగ్గర గానీ పేర్లు నమోదు చేసుకొని ప్రభుత్వము ప్రకటించిన 500 రూపాయలు బోనస్ లబ్ధి పొందగలరని కోరుచున్నాము.చివరి తేదీ ఈ నెల 10వ తేదీ వరకు నమోదు చేసుకోగలరు ఈ సమావేశంలో గ్రామ సర్పంచ్ మండల వ్యవసాయ అధికారి రమేష్ గారు ఏ ఈ ఓ ప్రభు చరణ్ మరియు గ్రామ రైతులు పాల్గొన్నారు



**గౌరవనీయ కేంద్ర మంత్రి వర్యులు శ్రీ జి.కిషన్ రెడ్డి గారిని మర్యాద పూర్వకంగా కలిసి ఆశీస్సులు తీసుకున్న రాక్ టౌన్ కాలనీ అసోసియేషన్ & బీజేపీ GSI డివిజన్ అధ్యక్షులు ఎర్ర వినోద్ రెడ్డి, సెక్రటరీ నాగవెల్లి జైపాల్ రెడ్డి, కాలనీ సభ్యులు గంగాపురం ప్రదీప్ రెడ్డి తదితరులు .**



# నేత్రదానం.. మహాదానం

## నేత్రదానంపై ప్రజల్లో అవగాహన పెంచాలి

గజ్వేల్ అరుణ ప్రభ : హైదరాబాద్ : నేత్రదాన పక్షోత్సవాలను పురస్కరించుకుని లయన్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ ఆధ్వర్యంలో సోమవారం హైదరాబాద్‌లోని సితార గ్రాండ్ హోటల్‌లో 'నేత్రదానం--మహాదానం' అవగాహన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన లయన్ పి.సి. ఓబుల్‌రెడ్డి మాట్లాడుతూ.. ఒక వ్యక్తి మరణించిన అనంతరం వీలైనంత త్వరగా, ముఖ్యంగా మూడు గంటల్లోపు కుటుంబ సభ్యులు ఎల్.వి. ప్రసాద్ కంటి ఆసుపత్రి లేదా సమీపంలోని పెద్ద కంటి ఆసుపత్రికి సమాచారం అందిస్తే, వైద్య బృందం వచ్చి నేత్రాలను సేకరిస్తుందని తెలిపారు. నేత్రదానంపై ప్రజల్లో ఉన్న అపోహలను తొలగించి, అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. లయన్ కోటిరెడ్డి మాట్లాడుతూ.. ఒక వ్యక్తి చేసే నేత్రదానం ద్వారా ఇద్దరు అంధులకు చూపు ప్రసాదించే అవకాశం ఉంటుందని తెలిపారు. మరణానంతరం కూడా మరొకరికి వెలుగును అందించే నేత్రదానం కంటే గొప్ప దానం మరొకటి లేదని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ నేత్రదానానికి ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ సభ్యులు జి.వి. రమణారెడ్డి, వి. తిరుపతిరెడ్డి, రంజిత్ కుమార్‌రెడ్డి, డి.వి. రమణారెడ్డి, లయన్ హనుమాండ్లు, లయన్ పద్మా ఓబుల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## కొత్త జిల్లాలకు డీఐఈఓ పోస్టులు మంజూరు చేయాలి

ధర్మవరం, సెప్టెంబర్ 07; (అరుణ ప్రభ న్యూస్): రాష్ట్రంలో కొత్తగా ఏర్పాటైన జిల్లాలకు ఇంటర్ విద్యాశాఖలో 15 డీఐఈఓ పోస్టులు మంజూరు చేయాలని ప్రిన్సిపాళ్ల సంఘం, జూనియర్ లెక్చరర్ల సంఘం నాయకులు కోరారు. హైస్కూల్ విద్యకు కొత్త జిల్లాల్లో డీఈఓ పోస్టులు మంజూరైనప్పటికీ, ఇంటర్ విద్యకు డీఐఈఓ పోస్టులు ఏర్పాటు చేయలేదన్నారు. కొత్త జిల్లాల్లో సీనియర్లకు బదులు జూనియర్లకు ఎఫ్ఏసీ బాధ్యతలు అప్పగించడం సమంజసం కాదని పేర్కొన్నారు. ఈ సమస్యను వెంటనే పరిష్కరించి కొత్త జిల్లాలకు డీఐఈఓ పోస్టులు మంజూరు చేయాలని విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌ను వారు కోరారు.



## 13న ఉచిత కంటి వైద్య శిబిరం

ధర్మవరం, సెప్టెంబర్ 07; (అరుణ ప్రభ న్యూస్): పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రి ఎదురుగా ఉన్న కోట మున్సిపల్ పాఠశాలలో సెప్టెంబర్ 13న ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు రోటరీ క్లబ్ అధ్యక్షుడు జయసింహ తెలిపారు. రోటరీ క్లబ్ ధర్మవరం, శంకర కంటి ఆసుపత్రి బెంగళూరు, శ్రీ సత్యసాయి జిల్లా అంధత్వ నివారణ సంస్థ ఆధ్వర్యంలో శిబిరం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. అవసరమైన వారికి ఉచిత కంటి ఆపరేషన్లు, లెన్స్‌లు, రవాణా, వసతి, కంటి అద్దాలు అందిస్తామని తెలిపారు. శిబిరానికి వచ్చే వారు రేషన్ కార్డు లేదా ఓటరు గుర్తింపు కార్డు జిరాక్స్ కాపీలు రెండు, మూడు ఫొటోలు తీసుకురావాలని సూచించారు. షుగర్, బీపీ ఉన్నవారు పరీక్షలు చేయించుకుని రావాలని కోరారు. ఈ సందర్భంగా రోటరీ క్లబ్ ప్రతినిధులు కరపత్రాలను విడుదల చేశారు. కార్యక్రమంలో కార్యదర్శి చంద్రశేఖర్, కోశాధికారి పెద్దారెడ్డి, ఉపాధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి, క్యాంపు చైర్మన్ ప్రసన్నకుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజాసమస్యల వేదికకు 7 దరఖాస్తులు



ధర్మవరం, సెప్టెంబర్ 07; (అరుణ ప్రభ న్యూస్): ధర్మవరం ఆర్డీఓ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ప్రజల నుంచి 7 దరఖాస్తులు స్వీకరించారు. వాటిలో రెవెన్యూ శాఖకు 3, సర్వే, సెటిల్‌మెంట్, భూ రికార్డుల శాఖకు 3, ఇతర శాఖకు 1 దరఖాస్తు అందాయి. భూ హక్కులు, భూసేకరణ, భూమి విస్తీర్ణం, మార్గ వివాదాలు, తాగునీటి సమస్యలపై దరఖాస్తులు వచ్చాయి. మండలాల వారీగా ధర్మవరం నుంచి 3, తాడిమర్రి నుంచి 2, చెన్నేకొత్తపల్లి, ముదిగుబ్బ నుంచి ఒక్కొక్కటి చొప్పున దరఖాస్తులు అందాయి. బత్తలపల్లి, కనగానపల్లి, రామగిరి మండలాల నుంచి దరఖాస్తులు రాలేదు. దరఖాస్తులను సంబంధిత అధికారులు త్వరితగతిన పరిశీలించి, నిబంధనల మేరకు పరిష్కరించాలని అధికారులు సూచించారు.

# సర్కిల్–49లో ఆగని అక్రమ నిర్మాణాలు!

### తాత్కాలిక సీజ్‌లు.. అరకొర కూల్చివేతలు..
### మరోవైపు యథేచ్ఛగా అక్రమ అంతస్తులు, భారీ షెడ్లు
### కమిషనర్ ఆదేశాల అమలుపై ప్రశ్నలు.. క్షేత్రస్థాయి పర్యవేక్షణ ఎక్కడ?










శేరిలింగంపల్లి, సెప్టెంబర్ 7:(అరుణ ప్రభ) : శేరిలింగంపల్లి జోన్‌లోని సర్కిల్––49 పరిధిలో అక్రమ నిర్మాణాలపై అధికారుల చర్యలు కంటితుడుపు చర్యలకేపరిమితమవుతున్నాయా? అన్న ప్రశ్నలు స్థానికుల నుంచి వెల్లువెత్తుతున్నాయి. ఒకవైపు తాత్కాలికంగా సీజ్‌లు, అరకొర కూల్చివేతలు జరుగుతున్నప్పటికీ.. మరోవైపు అనుమతులకు విరుద్ధంగా కొత్త అంతస్తులు, భారీ షెడ్లు నిర్మాణం కొనసాగుతున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. అక్రమ నిర్మాణాలపై ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేస్తున్నప్పటికీ, క్షేత్రస్థాయిలో వాటి అమలు పూర్తిస్థాయిలో జరుగుతున్నదా? అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికే నిర్మాణాలు పూర్తయ్యే వరకు చర్యలు తీసుకోకుండా, నిర్మాణం చివరి దశకు చేరుకున్న తర్వాత మాత్రమే సీజ్‌లు లేదా పాక్షిక కూల్చివేతలు చేపడితే ప్రయోజనం ఏమిటని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. నిర్మాణం ప్రారంభమైన తొలిదశలోనే నిబంధనలకు విరుద్ధంగా ఉన్న భవనాలను గుర్తించి చర్యలు తీసుకుంటే భారీ నిర్మాణాలు రూపుదిద్దుకునే పరిస్థితి ఉండదని పలువురు అభిప్రాయపడుతున్నారు.

**అంజయ్యనగర్ ఘటనపై ఆందోళన**

ఇటీవల అంజయ్యనగర్‌లో నిర్మాణంలో ఉన్న ఏడంతస్తుల భవనం కూలిన ఘటనలో ఇద్దరు కూలీలు ప్రాణాలు కోల్పోయిన విషయం స్థానికంగా తీవ్ర ఆందోళన కలిగించిన విషయం తెలిసిందే. నిర్మాణ దశలోనే భవనం కూలిపోవడం భవన నిర్మాణ భద్రత, అనుమతులు, క్షేత్రస్థాయి పర్యవేక్షణపై అనేక ప్రశ్నలను లేవనెత్తుతోంది. భవనం నిర్మాణంలో ఉన్నప్పుడే ప్రమాదం జరిగి ఇద్దరు కూలీల ప్రాణాలు పోయాయి. అదే భవనం పూర్తయి ప్రజలు నివసిస్తున్న సమయంలో ఇలాంటి ఘటన జరిగి ఉంటే పరిస్థితి ఎంత తీవ్రంగా ఉండేదో ఊహించడానికే భయంగా ఉందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**అక్రమ నిర్మాణాల వెనుక ఎవరి అండ?**

అనుమతులకు విరుద్ధంగా నిర్మాణాలు జరుగుతున్నాయని ఫిర్యాదులు వస్తున్నప్పటికీ అవి పూర్తిస్థాయిలో నిలిపివేయబడకపోవడంపై ప్రజలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. అయితే, అధికారులపై వస్తున్న అవినీతి ఆరోపణలు నిజమా? క్షేత్రస్థాయిలో ఎవరి నిర్లక్ష్యం వల్ల ఈ నిర్మాణాలు కొనసాగుతున్నాయి? అనే అంశాలపై ఉన్నతాధికారులు సమగ్ర విచారణ చేపట్టాల్సిన అవసరం ఉందని ప్రజలు కోరుతున్నారు. ప్రభుత్వ నిబంధనలను అమలు చేయాల్సిన అధికారులు అక్రమ నిర్మాణాలను ప్రారంభ దశలోనే అడ్డుకోలేకపోతే, చివరకు ప్రజాధనం, ప్రభుత్వ ఆదాయం, ప్రజల భద్రత–––మూడింటికీ నష్టం కలిగే అవకాశం ఉందని విశ్లేషకులు చెబుతున్నారు.

**ఫీల్డ్ విజిట్ చేస్తే వాస్తవాలు వెలుగులోకి!**

కార్యాలయాల నుంచి నివేదికలు తీసుకోవడం కంటే ఉన్నతాధికారులు స్వయంగా క్షేత్రస్థాయిలో పర్యటించి సర్కిల్––49 పరిధిలోని నిర్మాణాలను పరిశీలించాలని స్థానికులు కోరుతున్నారు. అనుమతులు, నిర్మాణ విస్తీర్ణం, అంతస్తుల సంఖ్య, సెట్‌బ్యాక్‌లు, ఆక్యుపెన్సీ తదితర అంశాలను సమగ్రంగా పరిశీలిస్తే నిబంధనలకు విరుద్ధంగా ఉన్న నిర్మాణాలు ఎంతవరకు ఉన్నాయో స్పష్టమవుతుందని వారు అంటున్నారు.

**బాధ్యులపై చర్యలు ఎప్పుడు?**

అక్రమ నిర్మాణాలకు సంబంధించి ఫిర్యాదులు వచ్చినప్పుడు వాటిపై తీసుకున్న చర్యలు, పెండింగ్‌లో ఉన్న కేసులు, సీజ్ చేసిన నిర్మాణాలు, కూల్చివేసిన నిర్మాణాలు, తిరిగి నిర్మాణం చేపట్టిన భవనాల వివరాలను అధికారులు ప్రజలకు వెల్లడించాలని డిమాండ్ వినిపిస్తోంది. కేవలం సీజ్ చేసి వదిలేయడం.. అరకొరగా కూల్చివేసి మళ్లీ నిర్మాణానికి అవకాశం కల్పించడం కాకుండా, నిబంధనలకు విరుద్ధమైన నిర్మాణాలపై చట్ట ప్రకారం తుది చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. ఇకనైనా ఉన్నతాధికారులు సర్కిల్––49పై ప్రత్యేక దృష్టి సారించి, క్షేత్రస్థాయి తనిఖీలు నిర్వహించి, అక్రమ నిర్మాణాలను ప్రారంభ దశలోనే అడ్డుకుని, బాధ్యత వహించాల్సిన అధికారుల నిర్లక్ష్యంపై కూడా విచారణ చేపట్టాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు. అక్రమ నిర్మాణాలపై చర్యలు కేవలం కాగితాలకే పరిమితం కాకుండా.. క్షేత్రస్థాయిలో కనిపించేలా ఉండాలని ప్రజల డిమాండ్. చేస్తున్నారు

# నేడే ధర్మవరం మెగా ఉద్యోగమేళా

### 100కు పైగా కంపెనీలు.. వేలాది ఉద్యోగ అవకాశాలు




ధర్మవరం, సెప్టెంబర్ 07; (అరుణ ప్రభ న్యూస్): నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించే లక్ష్యంతో మంత్రి సత్యకుమార్ యాదవ్ ప్రత్యేక చొరవతో మంగళవారం ధర్మవరంలో మెగా ఉద్యోగ మేళా నిర్వహించనున్నారు. బత్తలపల్లి రోడ్డులోని సిఎన్‌బి ఫంక్షన్ హాల్ లో ఉదయం 9 గంటలకు కార్యక్రమం ప్రారంభం కానుంది. రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో, సంస్కృతి సేవా సమితి సహకారంతో నిర్వహిస్తున్న ఈ ఉద్యోగ మేళాలో 100కు పైగా ప్రముఖ కంపెనీలు పాల్గొననున్నాయి. పదో తరగతి నుంచి పీజీ, ఇంజినీరింగ్ తదితర విద్యార్హతలు కలిగిన 18 నుంచి 35 ఏళ్ల యువత పాల్గొనవచ్చు. అర్హతను బట్టి నెలకు రూ. 10 వేల నుంచి రూ. 50 వేల వరకు వేతన అవకాశాలు ఉన్నట్లు నిర్వాహకులు తెలిపారు. గత ఏడాది నిర్వహించిన ఉద్యోగ మేళాకు 5 వేల మందికి పైగా హాజరై, 2 వేల మందికి పైగా ఉద్యోగాలు పొందినట్లు మంత్రి నియోజకవర్గ ఇన్‌చార్జ్ హరీష్ బాబు తెలిపారు. ఈసారి మరింత విస్తృతంగా నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి మాజీ డీఆర్‌డీఓ చైర్మన్, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ సలహాదారు జి. సతీష్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. అభ్యర్థులు ఆధార్ కార్డు, విద్యార్హతల ధ్రువపత్రాల నకళ్లు, రెండు పాస్‌పోర్టు సైజు ఫొటోలు తీసుకు రావాలని సూచించారు. నైపుణ్యం వెబ్‌సైట్ లేదా క్యూఆర్ కోడ్ ద్వారా ముందుగా నమోదు చేసుకోవచ్చని తెలిపారు. వివరాలకు: 8688466361, 9390176421, 9966682246.



### 40 ఏళ్ల చిరకాల వాంఛ నెరవేర్చిన ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డికి కృతజ్ఞతగా భూలక్ష్మి అమ్మవారికి ప్రత్యేక పూజలు

నారాయణఖేడ్ నియోజకవర్గం : నారాయణఖేడ్ మండలం తుర్కపల్లి భూలక్ష్మి అమ్మవారి ఆలయంలో తుర్కపల్లి, పోతన్‌పల్లి, పల్లుతండా, సిర్గాపూర్ మండలం కద్పల్ గ్రామాల ప్రజలు ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి గారు మరియు వారి కుటుంబ సభ్యులు ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో చల్లగా ఉండాలని కోరుకుంటూ భూలక్ష్మి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా నాలుగు గ్రామాల సర్పంచులు ప్రతాప్ రెడ్డి, శ్రీధర్ రెడ్డితో పాటు ఆయా గ్రామాల ప్రజలు పార్టీలకు అతీతంగా పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. తమ గ్రామాల ప్రజల 40 ఏళ్ల చిరకాల వాంఛ అయిన తుర్కపల్లి––కద్పల్ నూతన రహదారి నిర్మాణాన్ని ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి గారు ప్రత్యేక చొరవతో సాకారం చేశారని వారు పేర్కొన్నారు. "మా 40 ఏళ్ల కలను సాకారం చేసి రోడ్డు సౌకర్యం కల్పించిన సంజీవరెడ్డి ఎమ్మెల్యే గారికి ఎల్లప్పుడూ రుణపడి ఉంటాం" అని గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు. ముఖ్యంగా కద్పల్ గ్రామస్తులు, నూతన రహదారి అందుబాటులోకి రావడంతో నారాయణఖేడ్ పట్టణానికి తమ ప్రయాణ దూరం సుమారు 6 కిలోమీటర్లు తగ్గిందని, విద్య, వైద్యం, మార్కెట్, అత్యవసర సేవలకు వెళ్లేందుకు ఎంతో సౌకర్యంగా మారిందని ఆనందం వ్యక్తం చేశారు. ప్రజల చిరకాల సమస్యను పరిష్కరించి నాలుగు గ్రామాలను నారాయణఖేడ్‌తో మరింత చేరువ చేసిన ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి గారి సేవలకు గుర్తుగా భూలక్ష్మి అమ్మవారిని దర్శించుకుని, "ఎమ్మెల్యే గారు, వారి కుటుంబ సభ్యులు ఎల్లప్పుడూ ఆయురారోగ్యాలతో చల్లగా ఉండాలి.. ప్రజలకు మరింత సేవ చేసే శక్తిని అమ్మవారు ప్రసాదించాలి" అని గ్రామస్తులు భక్తిశ్రద్ధలతో మొక్కుకున్నారు. 40 ఏళ్ల ఎదురుచూపులకు తెరదించి.. నాలుగు గ్రామాల ప్రజల జీవితాల్లో కొత్త ప్రయాణానికి బాటలు వేసిన నూతన రహదారి ––– ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి గారికి ప్రజల కృతజ్ఞతాభివందనాలు.




# డిండి ప్రజావాణిలో పలు దరఖాస్తులు

అరుణ ప్రభ, డిండి సెప్టెంబర్ 7 ,డిండి మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం మండల పరిషత్ అధికారి నర్రా వేజన్న అధ్యక్షతన నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమం లో పలు దరఖాస్తులు అందినట్లు ఎంపీడీవో తెలిపారు. ప్రధానంగా బిత్తల ఆర్‌ఎస్ పార్టీ అధ్యక్షులు అండ్ గ్రూప్ ప్రభుత్వ హామీల అమలు విషయంలో అధిక సంఖ్యలో 187 ఫిర్యాదులు అందినట్లు, రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ విషయంలో ఒక దరఖాస్తు ,స్థానిక జూనియర్ కళాశాలలో వసతి గృహం ఏర్పాటు చేయాలని మరొక దరఖాస్తు, విద్యుత్ శాఖకు సంబంధించింది ఒకటి ఫిర్యాదులు అంది నట్లు అట్టి వాటిని సంబంధిత అధికారులకు పంపించినట్లు, మొత్తం మండల స్థాయి అధికారులు 23 మంది కి గాను 20 మంది అధికారులు హాజరైనట్లు ఎంపీడీవో తెలిపారు. ఈ కార్యక్రమంలో తాసిల్దార్ శ్రీనివాస్ గౌడ్ పాల్గొన్నారు.

### కరువు సహాయం కోసం
### 11న రెవెన్యూ కార్యాలయాల ఎదుట ధర్నా



ధర్మవరం, సెప్టెంబర్ 07; (అరుణ ప్రభ న్యూస్): రాష్ట్రంలో కరువు పరిస్థితుల నేపథ్యంలో తక్షణమే సహాయక చర్యలు చేపట్టాలని డిమాండ్ చేస్తూ సెప్టెంబర్ 11న అన్ని మండల రెవెన్యూ కార్యాలయాల ఎదుట ధర్నాలు నిర్వహించనున్నట్లు చేతి వృత్తిదారుల సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు జింక చలపతి తెలిపారు. కరువు మండలాలను ప్రకటించి నష్టపోయిన రైతులు, కౌలు రైతులు, వ్యవసాయ కార్మికులు, చేనేత కార్మికులు, చేతివృత్తిదారులు, మత్స్యకారులను ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ధర్నా అనంతరం సమస్యలతో కూడిన వినతిపత్రాలను అధికారులకు అందజేస్తామని తెలిపారు. చేతివృత్తిదారులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సి. లింగమయ్య, కె. రామాంజనేయులు, కాటమయ్య, కుళ్లాయప్ప, శ్రీనివాసులు తదితరులు పాల్గొననున్నట్లు తెలిపారు.

### రంగారెడ్డి జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులుగా
### అవార్డు అందుకున్న మంచాల గ్రామ నివాసి ఫిజికల్ డైరెక్టర్ వెంకటేష్




అరుణప్రభ ఇబ్రహీంపట్నం : రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం నియోజకవర్గం మంచాల గ్రామం నివాసి వెంకటేష్ ఫిజికల్ డైరెక్టర్ గత 14 సంవత్సరాల నుండి ఉపాధ్యాయ వృత్తిలో కొనసాగుతూ విద్యార్థులను ఉత్తమ క్రీడాకారులుగా జిల్లా, రాష్ట్ర, జాతీయస్థాయిలో ఆడించిన ఘనత వెంకటేష్ గారిది ప్రస్తుతం కడ్తాల్ మండలం ముద్విన్ జిల్లా పరిషత్ పాఠశాలలో ఫిజికల్ డైరెక్టర్ గా పనిచేస్తున్నారు. సందర్భంగా తాము మాట్లాడుతూ ఈ అవార్డు నన్ను వరించినందుకు హర్షం వ్యక్తం చేస్తున్నాను నా బాధ్యత మరింత పెరిగింది. రాబోయే రోజుల్లో విద్యార్థులను ఉత్తమ స్థాయిలో నిలపడం కోసం నా సాయ శక్తుల కృషి చేస్తారని ఈ సందర్భంగా తెలిపారు..



### త్రిలింగేశ్వర ఆలయానికి
# వెండి నాగపడగ విరాళం

ధర్మవరం, సెప్టెంబర్ 07; (అరుణ ప్రభ న్యూస్): పట్టణంలోని తీరుబజారు పేట, బసవన్న కట్ట నాగులబావి వీధిలోని శ్రీ త్రిలింగేశ్వర దేవస్థానానికి గూడూరు లక్ష్మి కుమారులు నాగేంద్ర, రాము కుటుంబ సభ్యులు అరకిలో వెండి నాగపడగను రూ. 1.20 లక్షల విలువతో విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో దాతల పేరిట ప్రత్యేక పూజలు నిర్వహించి సన్మానించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.





# క్వార్టర్ ఫైనల్స్‌కు కత్తె కొట్టాల, హిందూపూర్ ఇండియన్ స్టార్స్

ధర్మవరం, సెప్టెంబర్ 07; (అరుణ ప్రభ న్యూస్): ఆర్డీటీ మైదానంలో జరుగుతున్న అటల్ బిహారీ వాజ్‌పాయ్ స్మారక క్రికెట్ టోర్నమెంట్ సీజన్-3లో సోమవారం జరిగిన ప్రీ క్వార్టర్ ఫైనల్స్‌లో కత్తె కొట్టాల, హిందూపూర్ ఇండియన్ స్టార్స్ జట్లు విజయం సాధించాయి. తొలి మ్యాచ్‌లో కత్తె కొట్టాల 123/2 పరుగులు చేయగా, ఇండిపెండెన్స్ తాడిమర్రి 94/4 పరుగులు చేసింది. దీంతో కత్తె కొట్టాల 29 పరుగుల తేడాతో గెలిచింది. భార్గవ్‌కు ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు లభించింది. రెండో మ్యాచ్‌లో పిటిపి ఫ్రెండ్స్ XI 106/7 పరుగులు చేయగా, హిందూపూర్ ఇండియన్ స్టార్స్ 109/3 పరుగులు చేసి 7 వికెట్ల తేడాతో విజయం సాధించింది. అయ్యాజ్‌కు ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు అందింది. మ్యాచ్‌లను బీజేపీ నాయకులు కునిగిరి నీలకంత, హరీష్ బాబు, పోతుకుంట రాజు తదితరులు ప్రారంభించారు.

# కేఎల్ఐ ద్వారా డిండి ప్రాజెక్టును నింపాలి

### డిండి ఆయకట్టు రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి
### మాజీ ఎమ్మెల్యే రవీంద్ర కుమార్





అరుణ ప్రభ ,డిండి, సెప్టెంబర్ 7 ,డిండి ఆయకట్టు రైతులకు కల్వకుర్తి ఎత్తిపోతల పథకం ద్వారా దిండి ప్రాజెక్టుకు నీటి విడుదల చేసి ,డిండి రైతాంగాన్ని ఆదుకోవాలని దేవరకొండ నియోజకవర్గ పరిధిలోని దిండి మండల కేంద్రంలో సోమవారం బి ఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో దిండి మండల కేంద్రంలోని రాజీవ్ చౌరస్తాలో ధర్నా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన దేవరకొండ మాజీ ఎమ్మెల్యే రవీంద్ర కుమార్ మాట్లాడుతూ, కే ఎల్ ఐ ద్వారా నింపిన ఘనత మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ కే దక్కుతుందని అన్నారు.డిండి ప్రాజెక్టును కేఎల్ఐ ద్వారా నింపే వరకు డిండి ఆయకట్టు రైతులకు న్యాయం జరిగే వరకు, పోరాటాన్ని కొనసాగిస్తామని ఆయన అన్నారు. దిండి మండల అధ్యక్షులు రాజనేని వెంకటేశ్వరరావు అధ్యక్షతన జరిగిన ఈ మహాధర్నాలో బి ఆర్ఎస్ రాష్ట్ర నాయకులు కేతావత్ బిలియా నాయక్, కిషన్ నాయక్ ,పిఎసిఎస్ ఛైర్మన్ లు పల్లా ప్రవీణ్ రెడ్డి, మాధవరం శ్రీనివాసరావు, సర్పంచులు మల్రెడ్డి విష్ణువర్ధన్ రెడ్డి, కృష్ణయ్య, గిరమోని శ్రీను, రామావత్ వెంకట్రామ్, అంజల్ రావు, తండు వెంకటయ్య, బొడ్డుపల్లి జయంత్, ప్రశాంత్ రావు, రవీందర్రావు,బల్మూల తిరుపతయ్య, గుర్రం సురేష్, తదితర పార్టీ శ్రేణులు పాల్గొన్నారు

# గురువే సమాజానికి దిక్సూచి

### 35 మంది ఉత్తమ ఉపాధ్యాయులకు ఘన సన్మానం
### గురు-శిష్య బంధం విలువలను కాపాడాలి: ఆచార్య పిల్లలమర్రి రాములు





హైదరాబాద్: జాతీయ ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని శేరిలింగంపల్లి జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురుపూజోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. అసోసియేషన్ కన్వీనర్ తాడిబోయిన రామస్వామి యాదవ్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో భారతరత్న డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి జ్యోతి ప్రజ్వలన చేశారు. కార్యక్రమానికి హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయం తెలుగుశాఖ అధ్యక్షుడు ఆచార్య పిల్లలమర్రి రాములు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. శేరిలింగంపల్లి మండల పరిధిలోని ప్రభుత్వ డిగ్రీ, జూనియర్, గురుకుల కళాశాలలు, జవహర్ నవోదయ విద్యాలయం, విశ్వవిద్యాలయం, జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలు, ప్రాథమికోన్నత, ప్రాథమిక పాఠశాలల్లో పనిచేస్తున్న 35 మంది ఉపాధ్యాయులను ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాలతో సత్కరించారు. శాలువ, జ్ఞాపిక, పగిడి, తాంబూలాలతో వేదమంత్రాల నడుమ సంప్రదాయబద్ధంగా పురస్కారాలు అందజేశారు.

ఈ సందర్భంగా ఆచార్య పిల్లలమర్రి రాములు మాట్లాడుతూ సమాజంలో అత్యంత గౌరవప్రదమైన వృత్తి అధ్యాపక వృత్తి అని అన్నారు. జన్మనిచ్చిన తల్లిదండ్రుల తర్వాత గురువుకే అత్యున్నత స్థానం ఉందని పేర్కొన్నారు. విద్యార్థుల్లోని అజ్ఞానమనే చీకటిని తొలగించి, జ్ఞానమనే వెలుగును నింపుతూ వారి ఉజ్వల భవిష్యత్తు కోసం గురువులు నిరంతరం కృషి చేస్తారని తెలిపారు. మనిషి జీవించడానికి గాలి, నీరు, ఆహారం ఎంత అవసరమో విద్య కూడా అంతే ముఖ్యమని అన్నారు.

దేశం అభివృద్ధి చెందడానికి, ఆరోగ్యవంతమైన సమాజం నిర్మాణానికి విద్య ప్రధాన ఆధారమని రాములు పేర్కొన్నారు. సమాజంలోని వివిధ రంగాల్లో ఉన్న ప్రముఖులందరూ గురువుల బోధన, మార్గదర్శకత్వం ద్వారా ఎదిగిన వారేనన్నారు. విద్యార్థులకు పాఠ్యాంశాల బోధనతో పాటు క్రమశిక్షణ, మానవతా విలువలు, నైతికత, ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించడం కూడా ఉపాధ్యాయుల బాధ్యత అని చెప్పారు.

డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ గొప్ప తత్వవేత్త, విద్యావేత్త, రచయిత, రాజనీతిజ్ఞుడిగా దేశానికి విశేష సేవలు అందించారని కొనియాడారు. ఉపన్యాసకుడిగా, ఆచార్యుడిగా, ఉపకులపతిగా, విదేశాల్లో భారత రాయబారిగా, రాజ్యాంగ పరిషత్ సభ్యుడిగా, యునెస్కో అధ్యక్షుడిగా, ఉపరాష్ట్రపతిగా, రాష్ట్రపతిగా ఆయన అందించిన సేవలు చిరస్మరణీయమని అన్నారు. ఆయన గౌరవార్థం జన్మదినమైన సెప్టెంబరు 5న జాతీయ ఉపాధ్యాయ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు.

నేటి యువ అధ్యాపకులు రాధాకృష్ణన్ జీవితాన్ని ఆదర్శంగా తీసుకోవాలని రాములు సూచించారు. నూతన విద్యా విధానంలో వస్తున్న మార్పులను అధ్యయనం చేయడంతో పాటు, సమాజంలో చోటుచేసుకుంటున్న పరిణామాలను గమనించి, ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకోవాలని అన్నారు. భావి భారత పౌరులైన విద్యార్థులకు విలువలతో కూడిన నాణ్యమైన విద్యను అందించి వారి సర్వతోముఖాభివృద్ధికి కృషి చేయడం ఉపాధ్యాయుల సామాజిక బాధ్యత అని స్పష్టం చేశారు. భారతీయ సంప్రదాయంలోని గురుశిష్య బంధం, నైతిక విలువలను భవిష్యత్ తరాలకు అందించాలని పిలుపునిచ్చారు.

బిల్డర్, సామాజిక సేవకులు తూనిక రాఘవేంద్రరావు, యు.వి. రమణమూర్తి సౌజన్యంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. స్థానిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు సుభాష్‌చంద్రారెడ్డి, మండల విద్యాధికారి వెంకటయ్య, రిటైర్డ్ ప్రధానోపాధ్యాయులు బసవలింగం, ఉపాధ్యాయులు, ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు అమ్మయ్య చౌదరి, వాణి సాంబశివరావు, ఉమా చంద్రశేఖర్, జి.వి.రావు, బాలన్న, సుజాత, వీణ, వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



# మేడిపల్లి హెచ్‌ఎండిఏ లేఔట్‌లో నిబంధనల ప్రకారం ఇండ్ల నిర్మాణం జరగాలి

### ప్రజావాణిలో వినతిపత్రం సమర్పించిన వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు

సెప్టెంబర్ 07,అరుణ ప్రభ : మేడిపల్లి హెచ్‌ఎండిఏ లేఔట్ లో నిబంధనల ప్రకారం ఇంటి నిర్మాణాలు జరిగేలా చర్యలు చేపట్టాలని బోడుప్పల్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ శైలజ కు కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు విజ్ఞప్తి చేశారు. మల్కాజ్గిరి మున్సిపల్ కార్పొరేషన్ బోడుప్పల్ సర్కిల్ నుంచి అనుమతులు పొందిన ప్రకారం ఇండ్ల నిర్మాణాలు జరిగేలా చూడాలని కోరుతూ సోమవారం బోడుప్పల్ సర్కిల్ కార్యాలయంలో జరిగిన ప్రజావాణిలో వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు ఎంపల్లి పద్మారెడ్డి, ఈదునూరి హేమంత్ కుమార్ల ఆధ్వర్యంలో డిప్యూటీ కమిషన్ శైలజ కు వినతి పత్రం సమర్పించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ప్రతినిధులు రాజిరెడ్డి, డిఎస్ నాయక్, సాంబయ్య, సంతోష్ రెడ్డి, హనుమాన్ రెడ్డి, శ్రీనివాస్, వెంకటేష్, సతీష్, నవీన్, అశోక్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# వైసీపీ అధినేతకు ధన్యవాదాలు తెలిపిన గురవయ్య

గూడూరు – (అరుణ ప్రభ న్యూస్ ): గూడూరు నియోజక వర్గంలో దళితులకు జిల్లా స్థాయిలో పదవులు ఇచ్చి సముచిత స్థానం కల్పించిన వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి జిల్లా అధ్యక్షులు కాకాణి గోవర్ధన్ రెడ్డి లకు వైసీపీ గూడూరు ఇంచార్జి గురవయ్య ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గూడూరు పట్టణానికి చెందిన పల్లి కోటేశ్వరరావును వైసీపీ జిల్లా ఎస్సీ సెల్ సెక్రటరీ గా నియమించడం జరిగిందన్నారు. అనంతరం ప్రజా సమస్యల పట్ల కృషి చేస్తామన్నారు. విలేకరుల సమావేశం జరుగుతున్న సమయంలో గూడూరు ఒకటవ పట్టణ పోలీసు లు అక్కడికి చేరుకున్నారు. ఈ క్రమంలో వైసీపీ నాయకులు , పోలీస్ లకు వాగ్వాదం చోటు చేసింది. గతంలో పల్లి కోటేశ్వర రావు పై ఒకటవ పట్టణ పోలీసు స్టేషన్ లో కేసు నమోదు చేయడం జరిగింది. ఈ క్రమంలో పోలీస్‌లు పల్లి కోటేశ్వర రావు ను అదుపులోకి తీసుకొని ఒకటవ పట్టణ పోలీసు స్టేషన్ కి తరలించారు.





# బుద్ధనగర్లో ఘనంగా రామిని జువెలర్స్ ప్రారంభోత్సవం

### అత్యాధునిక డిజైన్లలో మగువలు మెచ్చే బంగారు, వెండి ఆభరణాల నిలయం
### ముఖ్యఅతిథిగా పాల్గొన్న మాజీ మేయర్ జక్క వెంకట్ రెడ్డి, బి ఆర్ ఎస్ నేతలు

సెప్టెంబర్ 7, అరుణ ప్రభ : మల్కాజ్గిరి మున్సిపల్ కార్పొరేషన్ బోడుప్పల్ సర్కిల్ పరిధిలోని బుద్ధ నగర్లో రామిని జువెలర్స్ ప్రారంభోత్సవం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా మాజీ మేయర్ జక్క వెంకట్ రెడ్డి, బి.ఆర్.ఎస్ నేతలు పాల్గొని షాపును ప్రారంభించారు. ఈ సందర్భంగా వ్యాపార ప్రముఖులు, స్థానికులు, బంధుమిత్రులు పెద్ద సంఖ్యలో హాజరై నిర్వాహకులకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం రామిని జువెలర్స్ నిర్వాహకులు మణికంఠ,రేఖ, శ్రీనివాస్, సోము స్వర్ణ రేఖ మాట్లాడుతూ మహిళల అభిరుచులకు అనుగుణంగా ఆకర్షణీయమైన డిజైన్లలో నాణ్యమైన బంగారు, వెండి ఆభరణాలను అందుబాటులో ఉంచడంతో పాటు, నమ్మకమైన సేవలు అందించడమే తమ ప్రధాన లక్ష్యమని తెలిపారు. బోడుప్పల్, పీర్జాదిగూడ ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో కుటుంబ సభ్యులు, స్నేహితులు, వ్యాపార ప్రముఖులు, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.





# కాంగ్రెస్ వైఫల్యాలను ఎండగడుతున్నందుకు ఈ అరెస్టులు

### బి.ఆర్.ఎస్ ఎమ్మెల్యేల అక్రమ అరెస్టులకు నిరసనగా బోడుప్పల్లో ధర్నా
### బి.ఆర్.ఎస్ ఎమ్మెల్యేల గొంతు నొక్కుతున్న కాంగ్రెస్
### కాంగ్రెస్ ఇచ్చిన హామీలు నెరవేర్చాలని ప్రజావాణిలో ఫిర్యాదులు

మాజీ ఎంపీటీసీ మంద సంజీవరెడ్డి ఆధ్వర్యంలో అంబేద్కర్ సర్కిల్ వద్ద నిరసన ధర్నా

సెప్టెంబర్ 7, అరుణ ప్రభ : కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 1000 రోజులు పూర్తయిన సందర్భంగా ఎన్నికల హామీల అమలులో విఫలమైందని ఆరోపిస్తూ బీఆర్ఎస్ గత వారం రోజులుగా బి.ఆర్.ఎస్ పార్టీ నిరసన కార్యక్రమాలను నిర్వహిస్తుంది. ఈ అసెంబ్లీ సమావేశాలలో కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టేందుకు బి.ఆర్.ఎస్ ఎమ్మెల్యేలు సిద్ధమై ప్రజా గొంతుకను అసెంబ్లీలో వినిపిస్తారని భయంతో రేవంత్ రెడ్డి సర్కార్ బి.ఆర్.ఎస్ ఎమ్మెల్యేలను అక్రమ అరెస్టులు చేసి నిర్బంధాలకు గురిచేస్తుందని, ఈ అక్రమ అరెస్టులకు నిరసనగా మాజీ జెడ్పిటిసి, బోడుప్పల్ బి.ఆర్.ఎస్ పార్టీ అధ్యక్షుడు మంద సంజీవరెడ్డి ఆధ్వర్యంలో అంబేద్కర్ సర్కిల్ నిరసన ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా మంద సంజీవరెడ్డి మాట్లాడుతూ 6 గ్యారంటీలు, 420 హామీల పేరుతో ప్రజలను నమ్మించి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్, ఇప్పుడు హామీల అమలును గాలికొదిలేసిందని కాంగ్రెస్ వెయ్యి రోజుల పాలనపై ప్రశ్నిస్తారని భయంతో రేవంత్ రెడ్డి బి.ఆర్.ఎస్ ఎమ్మెల్యేలను అక్రమంగా నిర్బంధించి, వేధిస్తున్నారని ఇది కాంగ్రెస్ నియంత పాలనకు నిదర్శనమని మండిపడ్డారు. తక్షణమే బి.ఆర్.ఎస్ ఎమ్మెల్యేల అక్రమ అరెస్టులను నిలిపివేసి అసెంబ్లీ సమావేశాలను 30 రోజులు కొనసాగించాలని డిమాండ్ చేశారు. ఈకార్యక్రమంలో మాజీ మేయర్ సామల బుచ్చిరెడ్డి, ప్రధాన కార్యదర్శి మీసాల కృష్ణ, సీనియర్ నాయకులు కొత్త రవిగౌడ్, కాటపల్లి రాంచంద్రారెడ్డి, బందారపు శ్రీధర్‌గౌడ్, తాల్క శత్రజ్ఞ, బొడగల్ల సదానంద్,, కృష్ణగౌడ్, యువజన నాయకులు ఉప్పరి విజయ్, మైసగల్ల శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

అరుణ ప్రభ
ARUNAPRABHA TELUGU DAILY



# ప్రజావాణి అర్జీల పరిష్కారంలో జాప్యం వద్దు

**56 ఫిర్యాదులు స్వీకరణ.. నిర్ణీత గడువులోగా సమస్యలను పరిష్కరించాలి: కలెక్టర్ సి. నారాయణరెడ్డి**



రంగారెడ్డి జిల్లా: ప్రజల నుంచి అందే ఫిర్యాదులను అధికారులు అత్యంత ప్రాధాన్యంతో పరిశీలించి, నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ సి. నారాయణరెడ్డి ఆదేశించారు. సోమవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజలు తమ సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చి వినతిపత్రాలు సమర్పించారు. మొత్తం 56 ఫిర్యాదులు అందగా.. వాటిలో 27 రెవెన్యూ శాఖకు, 29 ఇతర శాఖలకు సంబంధించినవిగా అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజల నుంచి వచ్చే ప్రతి అర్జీని అధికారులు బాధ్యతతో పరిశీలించాలని సూచించారు. ఎలాంటి జాప్యం లేకుండా సమస్యలకు పరిష్కారం చూపాలని, అర్జీలను పెండింగ్‌లో ఉంచకుండా ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ నిర్దేశిత గడువులోగా పరిష్కరించాలని ఆదేశించారు. ప్రజా సమస్యల పరిష్కారానికి అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించి, ప్రజలకు సత్వర సేవలు అందించాలని స్పష్టం చేశారు. ప్రజావాణి అనంతరం కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో రూపొందించిన 'మట్టి గణపతిని పూజిద్దాం--పర్యావరణాన్ని పరిరక్షిద్దాం' పోస్టర్‌ను కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 14న వినాయక చవితి సందర్భంగా ప్రజలు పర్యావరణహితంగా వేడుకలు నిర్వహించాలని సూచించారు. ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాలకు బదులుగా మట్టి గణపతి విగ్రహాలను ప్రతిష్ఠించాలని, సహజసిద్ధమైన రంగులు, పర్యావరణహిత అలంకరణలను వినియోగించాలని కోరారు. పర్యావరణ పరిరక్షణపై ప్రజల్లో అవగాహన పెంచేందుకు సంబంధిత శాఖలు విస్తృతంగా ప్రచారం నిర్వహించాలని కలెక్టర్ ఆదేశించారు. పండుగ వేడుకల సందర్భంగా పర్యావరణానికి హాని కలగకుండా ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ చంద్రారెడ్డి, జిల్లా రెవెన్యూ అధికారి శారద, వివిధ శాఖల జిల్లా అధికారులు, కలెక్టరేట్ సూపరింటెండెంట్లు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# ఐక్యతకు నిదర్శనం ఆర్యవైశ్యుల వనభోజనాలు

**మానుకోట లో వేడుకగా వాసవి వన సమారాధన**

**ఆటపాటలతో సందడి చేసి చిందులు వేసిన ఆర్యవైశ్యులు**

**అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు సామూహిక భోజనాలు**





అరుణప్రభ 7 సెప్టెంబర్ మహబూబాబాద్ అర్బన్ : పవిత్ర శ్రావణమాసాన్ని పురస్కరించుకొని మానుకోట జిల్లా కేంద్రానికి చెందిన స్థానిక ఆర్యవైశ్యులు వాసవి వన సమారాదన కార్యక్రమాన్ని చందా రవికిరణ్ మామిడి తోటలో ఘనంగా నిర్వహించారు మొదట ఆర్యవైశ్యుల కుల ఆరాధ్య దైవమైన వాసవి మాత చిత్రపటానికి ప్రత్యేక పూజలు తులసి మొక్కకు ప్రత్యేక పూజలు నిర్వహించి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు వేడుకకు ఆర్యవైశ్య చిన్న పెద్ద వయసుతో తేడా లేకుండా ఉత్సాహంగా ఉల్లాసంగా చిందులు వేస్తూ సందడి చేయడం జరిగింది నిర్వాహకులు ముందుగా తెలిపిన ప్రకారం ఎర్లీ బర్డ్స్ కింద మొదటి వందమంది విజేతలకు బహుమతులు అందజేయగా లక్కీ డ్రా ద్వారా బహుమతులు అందజేయడం జరిగింది అలాగే మహిళలకు ఆటలు, పాటలు పోటీలు నిర్వహించి బహుమతులు అందచేశారు పదునైన లాజిక్ తో కూడుకున్న ప్రశ్నలతో మరియు అంత్యాక్షరీ పాటలతో కార్యక్రమం ఆద్యంతం వేడుకగా కొనసాగింది సంస్కృతిక కార్యక్రమాలు అనంతరం అందరూ ఒకే చోట చేరి సాంప్రదాయంగా భోజనాలు చేస్తూ ఆర్యవైశ్య ఐక్యతను చాటారు భోజనాల అనంతరం విజేతలకు హర్షద్వానాల మధ్య బహుమతులు అందజేయగా అందరూ కలిసి ఎంతో ఆహ్లాదకరంగా నృత్యాలు చేస్తూ చిందులు వేయిస్తూ సందడి చేయడం జరిగింది కార్యక్రమంలో మాలే నాగేశ్వర్రావు, మాలే యోగిశ్వర్, మాలే లక్ష్మణ్, మాలే శ్రవణ్, వేమిశెట్టి కిషోర్, జంగాల విజయ్, పళ్ళపోతుల లక్ష్మి నారాయణ, జంగాల సదాశివుడు ఒబిలి శెట్టి శ్రీమన్నారాయణ మాలే నవీన్, బోనగిరి గిరిదర్ గుప్తా, నాళ్ల నరసింహారావు నాల వేణుగోపాల్, జంగాల మంగపతి, కర్లపాటి నారాయణమూర్తి, ఇమ్మడి రవి తల్లాడ సంతోష్, శ్రీరంగం నాగరాజు శరత్ బిఎస్ఎన్ఎల్, ఈగ శ్రీనివాస్, వన సమారాధన నిర్వహణ కమిటీ సభ్యులు ఆర్యవైశ్యులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు

# రూ.10 వేల పొదుపుతో.. ఒకేసారి రూ.2 కోట్లొచ్చాయ్..

ఈక్విటీ మ్యూచువల్ ఫండ్స్‌లో దీర్ఘకాలంలో హైరిటర్న్ అందుతాయని చాలా ఫండ్స్ నిరూపించాయి. నెల నెలా కొద్ది కొద్దిగా ఇన్వెస్ట్ చేస్తూ వెళ్తే కొన్ని ఫండ్స్ కోటీశ్వరులను చేశాయి. అలాంటి కోవకే చెందుతుంది కెనరా రొబెకో లార్జ్ అండ్ మిడ్ క్యాప్ ఫండ్. ఈ ఈక్విటీ స్కీమ్ రూ.10 వేల సిప్ పెట్టుబడిని రెండు దశాబ్దాల్లో రూ.2 కోట్లకు పైగా చేసింది. మరి ఈ స్కీమ్ గురించిన వివరాలు తెలుసుకుందాం. రిస్క్ ఉన్నప్పటికీ హైరటర్న్ రావాలంటే బెస్ట్ మార్గాల్లో మ్యూచువల్ ఫండ్స్ పేరు ముందు వినిపిస్తుంది. ఈక్విటీ మ్యూచువల్ ఫండ్స్‌లో దీర్ఘకాలం పాటు క్రమశిక్షణతో ఇన్వెస్ట్ చేయగలిగితే చక్రవడ్డీ మ్యాజిక్ కనిపిస్తుందని చెబుతారు. అంటే తమకు వచ్చే వడ్డీకి సైతం వడ్డీ జనరేట్ అవుతూ పెద్ద మొత్తంలో కార్పస్ ఏర్పడుతుంది. సిస్టమాటిక్ ఇన్వెస్ట్‌మెంట్ ప్లాన్ ( సిప్) ద్వారా పెట్టుబడి పెట్టిన వారికి చాలా ఫండ్స్ దీర్ఘకాలంలో హైరిటర్న్ ఇచ్చాయి. ఓపికతో ఉన్న వారిని కోటీశ్వరులను చేశాయి. అలాంటి ఫండే కెనరా రొబెకో లార్జ్ అండ్ మిడ్ క్యాప్ ఫండ్. కెనరా రొబెకో మ్యూచువల్ ఫండ్ నుంచి లాంచ్ అయిన స్కీమ్. మరి ఈ స్కీమ్ గురించిన వివరాలు తెలుసుకుందాం. కెనరా రొబెకో లార్జ్ అండ్ మిడ్ క్యాప్ ఫండ్ స్కీమ్ గడిచిన 21 సంవత్సరాల కాలంలో హైరిటర్న్ ఇచ్చింది. సగటున వార్షిక రాబడి శ×== రేటు 16.89 శాతంగా ఉంది. అంటే సిప్ పెట్టుబడిపై మార్కెట్ రేటు కంటే అధిక రాబడి ఇచ్చింది. దీని ప్రకారం రూ.10 వేల సిప్ పెట్టుబడి ఏకంగా రూ.1.97 కోట్లు అవుతుంది. అలాగే లంప్ సమ్ పెట్టుబడి విధానంలో చూసుకుంటే రూ.10 వేల పెట్టుబడి 21 ఏళ్లలో రూ.2.44 లక్షలు అవుతుంది. బెంచ్ మార్క్ కంటే 1.57 లక్షలు అధిక లాభాలు అందించింది. ఈ స్కీమ్ పెట్టుబడి ప్రధాన లక్ష్యం లార్జ్, మిడ్ క్యాప్ కంపెనీల స్టాక్స్‌లో ఇన్వెస్ట్ చేసి వైవిధ్యమైన పెట్టుబడి విధానంతో మూలధన లాభాలను అందించడం. ఈ స్కీమ్ బెంచ్ మార్క్ నిఫ్టీ లార్జ్ మిడ్ క్యాప్ 250 టీఆర్ఐగా ఉంది. ఈ స్కీమ్‌ను సీనియర్ ఫండ్ మేనేజర్ అమిత్ నడేకర్,




చీఫ్ ఇన్వెస్ట్‌మెంట్ ఆఫీసర్ శ్రీదత్త భంధ్వల్దార్ నిర్వహిస్తున్నారు. రెండు దశాబ్దాల కాలంలో పెద్ద మొత్తంలో కార్పస్ ఏర్పడేలా చేయడం అనేది ఒక కీలక మైలురాయిగా ఫండ్ నిపుణులు చెబుతున్నారు. ఇది దీర్ఘకాలంలో మంచి రాబడులు ఉంటాయని భావించిన ఇన్వెస్టర్ల నమ్మకానికి ప్రతీకగా సూచిస్తున్నారు. ఇన్వెస్టర్ల లక్ష్యాలకు అనుగుణంగా, మార్కెట్లోని వివిధ సెగ్మెంట్లను అనుసరిస్తూ అవకాశం లభించిన చోట పెట్టుబడి పెడుతూ ఈ స్థాయికి చేరుకున్నట్లు ఫండ్ హౌస్ తెలిపింది. కెనరా రొబెకో లార్జ్ అండ్ మిడ్ క్యాప్ ఫండ్ తమ నిధుల్లో 35 శాతం నుంచి 65 శాతం వరకు లార్జ్ క్యాప్ స్టాక్స్, ఈక్విటీ సంబంధిత మార్గాల్లో ఇన్వెస్ట్ చేస్తుంది. అలాగే 35-65 శాతం వరకు నిధులను మిడ్ క్యాప్ ఈక్విటీ, ఈక్వీటీ సంబంధిత మార్గాల్లో పెడుతుంది. 0-30 శాతం వరకు ఇతర ఈక్విటీలు, ఈక్విటీ సంబంధిత మార్గాల్లో ఇన్వెస్ట్ చేస్తుంది. వీటితో పాటు డెట్, మనీ మార్కెట్లకు సైతం ప్రాధాన్యత ఇస్తుంటుంది. ఈ స్కీమ్ పరిధిలో ప్రస్తుతం ఉన్న ఆస్తుల విలువ రూ.24,730.52 కోట్లు. గడిచిన ఏడాది, 3 ఏళ్లు, 5 ఏళ్ల కాంపౌండింగ్ యాన్యువల్ గ్రోత్ రేటు చూసుకుంటే వరుసగా 12.64 శాతం, 16.23 శాతం, 13.73 శాతంగా ఉన్నాయి.



# పెండింగ్ వేతనాలపై మీటర్ రీడర్ల నిరసన

ధర్మవరం, సెప్టెంబర్ 07; (అరుణ ప్రభ న్యూస్): ధర్మవరం విద్యుత్ కార్యాలయంలో మీటర్ రీడర్లు పెండింగ్ వేతనాలు చెల్లించాలని కోరుతూ నిరసన చేపట్టారు. అనంతరం జీూూ ఉమాశంకర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మీటర్ రీడర్ల రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్, ఏఐటీయూసీ జిల్లా నాయకులు కిరణ్‌కుమార్, చేనేత కార్మిక సంఘం జిల్లా గౌరవాధ్యక్షులు గుర్రం వెంకటస్వామి, సీపీఐ పట్టణ కార్యదర్శి పూలశెట్టి రవికుమార్ మాట్లాడుతూ.. మూడు నెలలుగా వేతనాలు పెండింగ్‌లో ఉండటంతో కార్మికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. సకాలంలో వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. సమస్య పరిష్కారం కాకపోతే ఈఆర్ఓ కార్యాలయాల వద్ద నిరసనలు, అనంతరం ఎస్ఈ కార్యాలయం ఎదుట ధర్నా చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో కొండయ్య, బాబావలి, శివానంద, ఆదర్శ్‌కుమార్, అశ్వర్థనారాయణ తదితరులు పాల్గొన్నారు.



## హర్మూజ్ దాటాలంటే.. టోల్ ఫీజు కట్టాల్సిందే..

పశ్చిమాసియాలో యుద్ధం భీకరంగా కొనసాగుతుంది. ప్రపంచ ఆయిల్ రవాణాకు ముఖ్యమైన హర్మూజ్ జల సంధిని ఇరాన్ నియంత్రించడంతో అంతర్జాతీయ చమురు మార్కెట్లపై తీవ్ర ప్రభావం చూపుతోంది. అయితే, తమపై ఆంక్షలు విధించిన దేశాలపై తాము కూడా అటువంటి చర్యలే తీసుకుంటామని టెహ్రాన్ అంటోంది. ఇందులో భాగంగా జల సంధిని రవాణా కోసం ఉపయోగించుకునే నౌకలు కొంత రుసుం చెల్లించేలా చట్టాన్ని తీసుకొచ్చే ప్రయత్నాల్లో ఉన్నట్టు ఇరాన్ చట్ట సభ సభ్యురాలు తాజాగా వెల్లడించారు. తమపై ఇజ్రాయెల్- అమెరికా దాడులకు ప్రతీకారంగా గల్ఫ్ దేశాల్లోని అగ్రరాజ్యం సైనిక స్థావరాలను ఇరాన్ టార్గెట్ చేసుకుంది. ఇదే సమయంలో ప్రపంచ చమురు సరఫరాకు అత్యంత కీలకమైన హర్మూజ్ జల సంధిని నియంత్రిస్తున్న విషయం తెలిసిందే. తాజాగా, ఈ జల సంధిలో నౌకల రవాణాపై ఇరాన్ మరో కీలక నిర్ణయం దిశగా అడుగులు వేస్తున్నట్టు సమాచారం. జల మార్గం గుండా రాకపోకలు సాగించే నౌకలు ఇకపై కొంత ఫీజుగా చెల్లించాల్సి రావొచ్చని భోగట్టా. ఆయిల్ ట్యాంకర్లపై టోల్ ఫీజు విధించే ప్రతిపాదనను పరిశీలిస్తున్నట్లు ఇరాన్ చట్టసభ సభ్యుడు సొమాయే రఫీయే తెలిపారు. స్థానిక మీడియాతో సొమాయే మాట్లాడుతూ.. రవాణా, ఇంధనం, ఆహార భద్రత కోసం సురక్షిత మార్గంగా కోసం హర్మూజ్ జల సంధిని ఉపయోగించుకునే దేశాలు టోల్ ఫీజులు చెల్లించేలా బిల్లును తీసుకొచ్చే ప్రయత్నాలు చేస్తున్నట్లు వెల్లడించారు. తమ శక్తి సామర్థ్యాలతో జల సంధిలో భద్రత కల్పిస్తామని, దానికి ప్రతిఫలంగా దేశాలు కొత్త మొత్తం చెల్లించాలని ఆమె అన్నారు. "యుద్ధం ముగిసి సాధారణ పరిస్థితులు నెలకున్న తర్వాత హర్మూజ్ జల సంధి రవాణాలో కొత్త విధివిధానాలు రాబోతున్నాయి. మాపై ఆంక్షలు విధించిన దేశాలపై మేమూ అటువంటి చర్యలే తీసుకునేలా నిర్ణయాలు ఉంటాయి" అని ఇప్పటికే ఇరాన్ ప్రకటన చేసింది. ఇదిలా ఉండగా అమెరికా, ఇజ్రాయెల్ ట్యాంకర్లకు మాత్రమే హర్మూజ్‌ను మూసివేసినట్లు ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాగ్చీ ఇటీవల వెల్లడించారు. ఇతర దేశాల నౌకలకు ఎటువంటి ఆటంకం కల్పించబోమని, అవి స్వేచ్ఛగా ప్రయాణించవచ్చని ఆయన చెప్పారు. మరోవైపు, గల్ఫ్ దేశాల్లో చమురు, గ్యాస్ ఫీల్డ్‌లపై బుధవారం అర్ధరాత్రి నుంచి నుంచి ఇరాన్ భీకర దాడులు చేస్తోంది. తమ సౌత్ పార్స్ గ్యాస్ ఫీల్డ్‌పై ఇజ్రాయెల్ దాడులకు ప్రతీకారంగా ఇరాన్ ఈ చర్యలకు దిగినట్టు తెలిపింది. దీంతో యుద్ధం మరో మలుపు తిరిగింది. తమ సహనాన్ని చేతగానితనంగా భావించొద్దని ఇరాన్‌కు సౌదీ అరేబియా హెచ్చరించింది. ఖతార్‌లోని రాస్ లఫాన్ గ్యాస్‌పై దాడితో అక్కడ ఉత్పత్తి నిలిచిపోయింది. ఐదేళ్ల తర్వాత ఆ ఫీల్డ్‌లో ఉత్పత్తి నిలిచిపోవడం ఇదే మొదటిసారి. ఈ కేంద్రంలో అమెరికాకు చెందిన ఎక్సాన్‌మొబిల్, చెవ్రాన్, యూకే సంస్థ షెల్ వంటి అంతర్జాతీయ సంస్థలు కార్యకలాపాలు కొనసాగిస్తున్నాయి. మరోవైపు, హర్మూజ్‌లో నౌకల సురక్షిత రవాణా కోసం తమ వంతు సహకారం అందించనున్నట్టు యూకే, ఫ్రాన్స్ సహా ఐదు ఐరోపా దేశాలు, జపాన్ గురువారం సంయుక్త ప్రకటన విడుదల చేశాయి. ఈ సందర్భంగా గల్ఫ్ దేశాల్లోని చమురు, గ్యాస్ మౌలిక సౌకర్యాలపై ఇరాన్ దాడులను అవి తీవ్రంగా ఖండించాయి.

# రూ. 24 వేల కోట్ల విలువైన క్రిప్టోకరెన్సీ చోరీ..

క్రిప్టోకరెన్సీ గురించి చాలా మందికి తెలిసే ఉంటుంది. ఇదో డిజిటల్ కరెన్సీ. ఏ దేశం, బ్యాంకులు, ప్రభుత్వం జోక్యం లేకుండా లావాదేవీలు చేసుకొనే ఒక వ్యవస్థ. వీటిల్లో పెట్టుబడులు పెట్టేవారి సంఖ్య బాగానే పెరిగిపోయింది. వీటిల్లో బిట్‌కాయిన్ మోస్ట్ పాపులర్. దీని విలువ ఎక్కువగానే ఉంటుంది. అయితే.. ఇటీవల ఆన్‌లైన్ మోసాలు పెరిగాయనేది తెలుసు కదా? ఇప్పుడు ఏకంగా అక్టోబర్‌లోనే 7 మిలియన్ డాలర్ల క్రిప్టో కరెన్సీని దొంగిలించారు హ్యాకర్లు. ఏడాదిలో ఆ సంఖ్య 3 బిలియన్ డాలర్లు. అసలు ఈ సంగతేంటో తెలుసుకుందాం. ఇటీవల కాలంలో సైబర్ మోసాలు భారీగా పెరిగిపోయాయి. ఇవి బ్యాంక్ అకౌంట్లకు సంబంధించినవే ఎక్కువగా ఉండేవి. కానీ ఇప్పుడు నేరగాళ్లు కొంత పంథా వెతుకుతున్నారు. ఏకంగా క్రిప్టోకరెన్సీనే దొంగిలిస్తున్నారు. దీనికి విలువ ఎక్కువ ఉండటమే కారణం. ఈ ఒక్క ఏడాదిలోనే 3 బిలియన్ డాలర్లకుపైగా విలువైన క్రిప్టోకరెన్సీని హ్యాకర్లు దొంగలించారు. అంటే ఇది భారత కరెన్సీలో రూ.24 వేల కోట్లకుపైనే. దాదాపు 125 హ్యాకింగ్‌ల్లో ఇంత మొత్తం తమ వశం చేసుకున్నారు. ఈ మేరకు బ్లాక్‌చెయిన్ అనాలిటిక్స్ ఫర్మ్ చైనాలిసిస్ తెలిపింది. హ్యాకింగ్ కార్యకలాపాల్లో ఏ సంవత్సరానికైనా అక్టోబర్ నెల తొలి స్థానంలో నిలిచిందని చైనాలిసిస్ తన ట్విట్టర్‌లో పోస్ట్ చేసింది. అక్టోబర్ నెలలో ఇంకా దాదాపు సగం రోజులు మిగిలేఉన్నప్పటికీ.. హ్యాకర్లు రెచ్చిపోయారని పేర్కొంది. ఏకంగా ఈ ఒక్కనెలలోనే అదీ 15 రోజుల వ్యవధిలో 718 మిలియన్ డాలర్ల విలువైన (భారత కరెన్సీలో దాదాపు 6 వేల కోట్ల రూపాయలు) క్రిప్టోకరెన్సీ చోరీకి గురైందని స్పష్టం చేసింది. ఇవి 11 వేర్వేరు హ్యాకింగుల్లోనని చైనాలిసిస్ వెల్లడించింది. దీంతో మొత్తం ఈ ఏడాదిలోనే 3 బిలియన్ డాలర్ల విలువైన క్రిప్టోను ఆన్‌లైన్ నేరగాళ్లు తస్కరించారని వివరించింది. క్రిప్టోకరెన్సీ అనేది ఒక డిజిటల్ కరెన్సీ. దీనిపై ఏ ప్రభుత్వానికిగానీ, సంస్థకు గానీ, బ్యాంకుకుగానీ నియంత్రణ, అధికారాలు ఉండవు. ఇది ఒక ఓపెన్‌సోర్స్ కంప్యూటర్ అల్గారిథమ్ ఆధారిత నెట్‌వర్క్ ద్వారా కార్యకలాపాలు నిర్వహిస్తుంటోంది. ఇక వినియోగదారులే దీనిని నియంత్రించుకుంటుంటారు. లావాదేవీలు కూడా క్రిప్టోకరెన్సీల రూపంలోనే చెల్లించుకుంటారు. క్రిప్టోకరెన్సీల్లో బిట్‌కాయిన్ మోస్ట్ పాపులర్‌గా నిలిచింది. ఇథీరియం, టెథర్, బినాన్స్ కాయిన్, రిపుల్ వంటివి కూడా ఆదరణ పొందాయి. బిట్ కాయిన్ విలువ ప్రస్తుతం రూ.15 లక్షలకుపైనే ఉంది. ఆ తర్వాత ఇథీరియం విలువ రూ.లక్షకుపైనే ఉంది. వరుసగా రెండు సెషన్లలో సెన్సెక్స్ లాభపడింది. మొత్తంగా 1500 పాయింట్లు 2 శాతం పెరిగింది. నిఫ్టీ 50 సైతం 2 శాతంతో 430 పాయింట్లు లాభపడింది. ఈ రెండు సెషన్లలో ఇన్వెస్టర్లు మొత్తంగా



రూ.3 లక్షల కోట్లు లాభాలు అందుకున్నారు. బీఎస్ఈ లిస్టెడ్ కంపెనీల మొత్తం విలువ రూ.433 లక్షల కోట్లకు పెరిగింది. ఈ విలువ గత శుక్రవారం ర్నరీ.430 లక్షల కోట్లుగా ఉండగా రెండు రోజుల్లో రూ.3 లక్షల కోట్లు పెరిగింది. వరుసగా రెండు రోజులు స్టాక్ మార్కెట్ ర్యాలీకి ప్రధాన కారణం కనిష్ఠాల వద్ద కొనుగోళ్ల మద్దతు లభించడమేనని మార్కెట్ వర్గాలు చెబుతున్నాయి. మంగళవారం రోజున ప్రపంచ మార్కెట్ల నుంచి సానుకూల సంకేతాలు, హోర్ముజ్ జలసంధి ఆంక్షల సడలింపు వంటి వార్తలతో సెకండ్ ఆఫ్‌లో కొనుగోళ్ల మద్దతు లభించింది.

# రూ. 200 కోట్లతో ధర్మపురి శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయాభివృద్ధి

## రూ. 117 కోట్లకు అదనంగా మరో రూ. 80 కోట్లు మంజూరు చేసిన ప్రజా ప్రభుత్వం



వేకువజామున 2:58 గంటల శుభ ముహూర్తంలో భూమిపూజ, శంకుస్థాపన చేసిన డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ దక్షిణ కాశీగా, పుణ్యక్షేత్రంగా విరాజిల్లుతున్న ధర్మపురి శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవస్థాన భవిష్యత్తు సరికొత్త శోభను సంతరించుకోనుంది. దశాబ్దాలుగా భక్తులు, స్థానికులు కోరుకుంటున్న ఆలయాభివృద్ధి కల నెరవేరుస్తూ ఇందిరమ్మ ప్రజా ప్రభుత్వం చారిత్రాత్మక నిర్ణయం తీసుకుంది. సోమవారం వేకువజామున 2:58 గంటలకు వేద పండితులు నిర్ణయించిన శుభ ముహూర్తంలో రూ. 10 కోట్లతో చేపట్టిన శ్రీ ఉగ్ర లక్ష్మీనరసింహస్వామి ఆలయ పునర్నిర్మాణ పనులకు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ లు వైభవంగా భూమిపూజ చేసి శంకుస్థాపన చేశారు. ?డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ గార్లు ఆలయంలోని శ్రీ ఉగ్ర లక్ష్మీనరసింహస్వామి, శ్రీ యోగానంద లక్ష్మీనరసింహస్వామి వార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు, వేద పండితులు వారికి మంత్రోచ్చారణలతో వేదాశీర్వచనం గావించి, స్వామివారి శేషవస్త్రాలు, తీర్థప్రసాదాలను అందజేశారు

**మాటల ప్రభుత్వం కాదు... చేతల ప్రభుత్వం!**

ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మాట్లాడుతూ... "మనందరికీ ఇష్టదైవమైన ధర్మపురి లక్ష్మీనరసింహస్వామి ఆలయాభివృద్ధిపై గతంలో చాలామంది మాటలు చెప్పారే తప్ప అర్ధరూపాయి కూడా ఇవ్వలేదు. కానీ మన ప్రజా ప్రభుత్వం స్వామివారి దివ్యానుగ్రహంతో, ప్రజల ఆశీస్సులతో రూ. 117 కోట్లను ముందే మంజూరు చేసింది. స్థానిక శాసనసభ్యులు, మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ఆలయ అభివృద్ధి, భక్తుల సౌకర్యాల కోసం అదనంగా నిధులు కోరగా... ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గసూచనల మేరకు మరో రూ. 80 కోట్లను సాంక్షన్ చేశామని, మొత్తంగా రూ. 200 కోట్ల అంచనా వ్యయంతో ధర్మపురి క్షేత్రాన్ని అంతర్జాతీయ స్థాయి పుణ్యక్షేత్రంగా తీర్చిదిద్దే పవిత్ర కార్యానికి శ్రీకారం చుట్టాం" అని పేర్కొన్నారు. అదేవిధంగా బాసర నుంచి భద్రాచలం వరకు గోదావరి పుష్కరాలకు సంబంధించి అన్ని ఏర్పాట్లు ముమ్మరంగా సాగుతున్నాయని వివరించారు. గోదావరి పుష్కరాల్లో భాగంగా గోదావరి నది ప్రవాహం వెంట ఉన్న ఆలయాలను అభివృద్ధి చేస్తున్నామని వెల్లడించారు.

**ఆలయంలో చేపట్టిన శంకుస్థాపన కార్యక్రమాలు**

రూ. 10 కోట్లతో శ్రీ ఉగ్ర లక్ష్మీనరసింహస్వామి దేవాలయ పునర్నిర్మాణం రూ. 58.55 కోట్లతో మొత్తం 9 రకాల మౌలిక వసతులు, ఆలయాభివృద్ధి నిర్మాణ పనులకు శంకుస్థాపన. ??రూ. 22.16 కోట్లతో పవిత్ర గోదావరి పుష్కరాల నిమిత్తం నూతన పుష్కర ఘాట్ల నిర్మాణం.

రూ. 2.48 కోట్లతో ధర్మపురి మండలం తిమ్మాపూర్ వద్ద నూతన విద్యుత్ సబ్ స్టేషన్ నిర్మాణానికి శంకుస్థాపన. ప్రజా ప్రభుత్వం చొరవతో ప్రసిద్ధ ధర్మపురి పుణ్యక్షేత్రం రూ. 200 కోట్ల వ్యయంతో దివ్య ఆధ్యాత్మిక కేంద్రంగా మారబోతుండటం పట్ల భక్తులు, స్థానిక ప్రజలు తీవ్ర హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# కాంగ్రెస్ 1000 రోజుల పాలనపై నిరసన, రాస్తారోకో

## ఎర్రబెల్లి దయాకర్ రావు

## కాంగ్రెస్ పార్టీ వెయ్యి రోజుల పాలనలో ప్రజలకు ఒరిగిందేమీ లేదు ఉష దయాకర్ రావు అరుణ ప్రభ పాలకుర్తి సెప్టెంబర్



పాలకుర్తి మండలంలో ఇచ్చిన హామీలు నెరవేర్చిందేమీ లేదు! అంటూ పాలకుర్తి చౌరస్తాలో మహిళలతో కలిసి నిర్వహించిన వంట వార్పు కార్యక్రమంలో మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు ,ఎర్రబెల్లి చారిటబుల్ ట్రస్ట్ చైర్పర్సన్ ఉషా దయాకర్ రావు పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఎర్రబెల్లి దయాకర్ రావు కాంగ్రెస్ ప్రభుత్వంపై నిప్పులు చెరిగారు.కాంగ్రెస్ పార్టీ మాటలన్నీ బూటకమే.. 420 దొంగ హామీలతో రేవంత్ రెడ్డి అధికారంలోకి వచ్చాడు.ప్రతి కుటుంబానికి లక్ష రూపాయల బాకీ పెట్టిన ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వం.ప్రజలకు ఇచ్చిన 420 హామీలను అమలు చేయలేని కాంగ్రెస్ నాయకులు ప్రజల ముందుకు సమాధానం చెప్పాలి.కమీషన్ల కోసం రాష్ట్రాన్ని అభివృద్ధి పేరుతో దోచుకుంటున్న కాంగ్రెస్ నాయకుల అసలు రంగు ప్రజలకు అర్థమైంది.పాలకుర్తిని అభివృద్ధి చేసింది బీఆర్ఎస్ ప్రభుత్వమే.దయన్న హయాంలో పాలకుర్తి రూపురేఖలే మారిపోయాయి.పాలకుర్తి సోమనాథుడు, బమ్మెర పోతన, వల్మీడి దేవస్థానాల అభివృద్ధికి కృషి చేసింది మీ.దయన్నే,పాలకుర్తి నుంచి అన్ని వైపులా డబుల్ రోడ్లు వేయించింది బీఆర్ఎస్ ప్రభుత్వమే,మిషన్ భగీరథతో ఇంటింటికీ తాగునీరు అందించిన ఘనత కేసీఆర్దే.తండాలను గ్రామ పంచాయతీలుగా మార్చి గిరిజనులకు రాజకీయ గౌరవం కల్పించిన గొప్ప నాయకుడు కేసీఆర్.కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణను దేశంలోనే ముందు వరుసలో నిలబెట్టాం కాంగ్రెస్ వచ్చాక రాష్ట్రాన్ని వెనక్కి నెట్టారు ,బీఆర్ఎస్ ప్రభుత్వం కోసం రాష్ట్ర ప్రజలు వెయ్యి కళ్లతో ఎదురుచూస్తున్నారు. రాబోయేది బీఆర్ఎస్ ప్రభుత్వమే బీఆర్ఎస్ కార్యకర్తలు ఎవ్వరూ అధైర్యపడొద్దు. కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటా కాంగ్రెస్ హామీల మోసానికి.. ప్రజా వ్యతిరేక పాలనకు చరమగీతం పాడే రోజు దగ్గర్లోనే ఉంది.బీఆర్ఎస్ జెండా మళ్లీ తెలంగాణలో ఎగరడం ఖాయం అని అన్నారు ఈ కార్యక్రమంలో మాజీ మండల బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు పసునూరి నవీన్ కుమార్ ,మాజీ జెడ్పిటిసి పుష్కారి శ్రీనివాసరావు, మాజీ ఎంపీపీ నల్ల నాగిరెడ్డి ,ఎఫ్ ఎస్ సి ఎస్ చైర్మన్ బొబ్బల్ల అశోక్ రెడ్డి,పాలకుర్తి గ్రామ సర్పంచ్ కమ్మగాని విజయ నాగన్న గౌడ్, ఉప సర్పంచ్ గాదపాక కిరణ్ మహిళలు బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు వీరమనేని సోమేశ్వరరావు, అన్నమ నేని మురళీధర్ రావు, పాము శ్రీను, మాచర్ల ఎల్లయ్య, కడుదుల కర్ణాకర్ రెడ్డి ,కోల నారాయణ ,రేపాల అశోక్, మామిళ్ళ శోభన్,కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# తండాల్లో జ్వర సర్వే. డెంగ్యూ, మలేరియా పరీక్షలు.

## పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన.



ఎల్లారెడ్డిపేట, సెప్టెంబర్ 7 (అరుణప్రభ): వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు, ముఖ్యంగా డెంగ్యూ, మలేరియా వ్యాధుల వ్యాప్తిని అరికట్టేందుకు వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో సోమవారం తండాల్లో ఫీవర్ సర్వే, మెడికల్ క్యాంపులు నిర్వహించారు. ఎల్లారెడ్డిపేట మండల వైద్యాధికారి డాక్టర్ సరియా అంజుమ్ ఆధ్వర్యంలో గుండారం గ్రామంలోని పోచమ్మతండా, రాజన్నపేటలోని కిష్టనాయక్ తండా, అల్మాస్పూర్లోని బుగ్గ రాజేశ్వర తండాలో ఈ కార్యక్రమాలు చేపట్టారు. ఈ సందర్భంగా జ్వర లక్షణాలతో ఉన్న వారితో పాటు అనుమానితులను గుర్తించి వైద్య పరీక్షలు నిర్వహించారు. పోచమ్మతండాలో 36 మందికి, కిష్టనాయక్ తండాలో 28 మందికి, బుగ్గ రాజేశ్వర తండాలో 26 మందికి డెంగ్యూ, మలేరియా నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి వైద్య పరీక్షల అనంతరం తగిన మందులను అందజేశారు. డెంగ్యూ, మలేరియా వంటి వ్యాధులు దోమల ద్వారా వ్యాప్తి చెందే అవకాశం ఉన్నందున ప్రజలు తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని వైద్య సిబ్బంది సూచించారు. ఇళ్ల చుట్టూ నీరు నిల్వ ఉండకుండా చూసుకోవడంతో పాటు, దోమల నివారణకు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అవగాహన కల్పించారు. జ్వరం, ఒళ్లు నొప్పులు, తలనొప్పి తదితర లక్షణాలు కనిపిస్తే నిర్లక్ష్యం చేయకుండా వెంటనే సమీపంలోని ప్రభుత్వ వైద్య కేంద్రాన్ని సంప్రదించాలని సూచించారు. ఈ ఫీవర్ సర్వే, వైద్య శిబిరాల్లో ఎం ఎల్ హెచ్ పి లక్ష్మీ ప్రసన్న, ఏ ఎన్ ఎం లు రాజేశ్వరి, సుమలత, రూతమ్మ, సువర్ణతో పాటు ఆశా కార్యకర్తలు పాల్గొని ప్రజలకు వైద్య సేవలు అందించారు. గ్రామీణ, తండా ప్రాంతాల్లో సీజనల్ వ్యాధుల నియంత్రణకు వైద్య ఆరోగ్య శాఖ చేపడుతున్న చర్యల్లో భాగంగా ఈ కార్యక్రమం నిర్వహించినట్లు అధికారులు తెలిపారు

# నిరుద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

## ప్రజావాణిలో బీఆర్ఎస్ యువత వినతి

ఎల్లారెడ్డిపేట, సెప్టెంబర్ 7 (అరుణప్రభ): నిరుద్యోగ యువతకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం వెంటనే అమలు చేసి, వారి సమస్యలను పరిష్కరించాలని కోరుతూ బీఆర్ఎస్ యువత ఆధ్వర్యంలో సోమవారం ఎల్లారెడ్డిపేట మండల స్థాయి ప్రజావాణి కార్యక్రమంలో వినతిపత్రం సమర్పించారు. ఈ మేరకు ఎంపీడీవోకు వినతిపత్రం అందజేసి నిరుద్యోగ యువత ఎదుర్కొంటున్న సమస్యలను వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు నిరుద్యోగ భృతి అందించడంతో పాటు రెండు లక్షల ఉద్యోగాల భర్తీ ప్రక్రియను వేగవంతం చేయాలని వారు కోరారు. ఉద్యోగాల కోసం ఏళ్ల తరబడి ఎదురుచూస్తున్న నిరుద్యోగ యువతకు ఉద్యోగ నియామకాల్లో స్పష్టమైన కార్యాచరణ ప్రకటించి, ఖాళీలను గుర్తించి త్వరితగతిన భర్తీ చేయాలని విజ్ఞప్తి చేశారు. అదేవిధంగా రాజీవ్ యువ వికాసం పథకం ద్వారా అర్హత కలిగిన నిరుద్యోగ యువతకు ఆర్థిక సహాయం అందించాలని కోరారు. స్వయం ఉపాధి, చిన్న వ్యాపారాలు, వివిధ వృత్తుల్లో స్థిరపడేందుకు ప్రభుత్వం అందించే ఆర్థిక సహాయం నిరుద్యోగ యువతకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని పేర్కొన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ పథకం ప్రయోజనాలు అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు. నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడం, ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయడం ద్వారా యువతలో నెలకొన్న ఆందోళనను తొలగించాలని బీఆర్ఎస్ యువత నాయకులు కోరారు. ఈ కార్యక్రమంలో కొర్రి అనిల్, సింగారం మధు, ములిగే ప్రమోద్, గణగోని బంటి గణేష్, లింగాల సందీప్, జుబేర్, పరశు రాములు తదితరులు పాల్గొన్నారు.



# క్రీడాకారుల భవిష్యత్తుకు అండగా ఉంటా: ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి





ఎల్.బి.నగర్ సెప్టెంబర్ 7 (అరుణ ప్రభ )వనస్థలిపురం స్కేటింగ్ రింక్కు చెందిన రోలర్ హాకీ, ఇన్లైన్ హాకీ క్రీడాకారుల తల్లిదండ్రులు ఎల్.బి.నగర్ ఎమ్మెల్యే శ్రీ దేవిరెడ్డి సుధీర్ రెడ్డిని కలిసి తెలంగాణ రోలర్ స్కేటింగ్ అసోసియేషన్ల అఫిలియేషన్ సమస్యను ఆయన దృష్టికి తీసుకువచ్చారు. రెండు అసోసియేషన్లకు నాూ అఫిలియేషన్ నిలిచిపోవడంతో జాతీయ స్థాయి ఎంపికలు ఆలస్యం అవుతున్నాయని, దీనివల్ల తమ పిల్లల క్రీడా భవిష్యత్తు ఇబ్బందుల్లో పడుతోందని తల్లిదండ్రులు ఎమ్మెల్యేకు వివరించారు. సమస్యపై సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి, ఈ అంశంపై క్రీడల శాఖ మంత్రి శ్రీ హరి గారితో మాట్లాడి, రెండు అసోసియేషన్లను ఒకే వేదికపైకి తీసుకువచ్చి సమస్యకు పరిష్కారం చూపేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అసోసియేషన్లు ఏకతాటిపైకి రాకపోయినా, రాబోయే 64వ జాతీయ స్థాయి పోటీల్లో క్రీడాకారులకు ఎలాంటి నష్టం జరగకుండా నాూ ఆధ్వర్యంలో ట్రయల్స్ నిర్వహించేలా చర్యలు తీసుకుంటానని ఆయన భరోసా ఇచ్చారు. "క్రీడాకారుల భవిష్యత్తే నా మొదటి ప్రాధాన్యత. వారికి ఎలాంటి అన్యాయం జరగకుండా అండగా ఉంటాను" అని ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి స్పష్టం చేశారు. ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించి తమ పిల్లల భవిష్యత్తుకు భరోసా కల్పించినందుకు రోలర్ హాకీ, ఇన్లైన్ హాకీ క్రీడాకారుల తల్లిదండ్రులు శ్రీ దేవిరెడ్డి సుధీర్ రెడ్డికి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టంగుటూరి నాగరాజు, కిరణ్ కుమార్, సునీల్, లింగారెడ్డి, ప్రియదర్శిని, దర్శిని, సుమ, స్నేహ, దీప్తి, హరిత, రజని, శివ, నరేష్, హరీష్, బాలరాజు, మధు, హరి, చందన్, శరత్, రాఘవేంద్ర, సీనియర్ ప్లేయర్ ముస్తఫా, అహ్మద్, శివం, సౌరవ్ మాలిక్, సంతోష్ మిశ్రా తదితరులు పాల్గొన్నారు.

# ఎల్లారెడ్డిపేటలో బీఆర్ఎస్ శ్రేణుల ధర్నా.

## కేటీఆర్, హరీశ్‌రావులను అడ్డుకోవడాన్ని నిరసిస్తూ ఆందోళన. పోలీసు బందోబస్తు.



అరుణప్రభ న్యూస్, ఎల్లారెడ్డిపేట: రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలో బీఆర్ఎస్ శ్రేణుల ఆందోళనకు దిగారు. పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, సిరిసిల్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల తారక రామారావు (కేటీఆర్), మాజీ మంత్రి హరీశ్‌రావులను పోలీసులు అడ్డుకోవడాన్ని, వారిపై దాడి చేశారంటూ వచ్చిన ఆరోపణలను నిరసిస్తూ బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు మండల కేంద్రంలో భారీ ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ శ్రేణులు పెద్ద సంఖ్యలో రోడ్డుపైకి చేరుకుని ప్రభుత్వానికి, పోలీసుల తీరుకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అనుసరిస్తున్న విధానం అప్రజాస్వామికంగా ఉందని నాయకులు తీవ్రంగా విమర్శించారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీలు, 420 హామీల అమలుపై ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ధర్నా సందర్భంగా బీఆర్ఎస్ కార్యకర్తలకు, పోలీసులకు మధ్య తీవ్ర వాగ్వాదం, నెట్టివేత, తోపులాట చోటుచేసుకోవడంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. ఆందోళనలో పాల్గొన్న నాయకులు, కార్యకర్తలను పోలీసులు అదుపులోకి తీసుకునే క్రమంలో వారిని రోడ్డుపై నుంచి ఈడ్చుకెళ్లి అరెస్టు చేశారని బీఆర్ఎస్ నాయకులు ఆరోపించారు. దీంతో కార్యకర్తలు మరింత ఆగ్రహానికి గురయ్యారు ధర్నా అనంతరం బీఆర్ఎస్ శ్రేణులు ర్యాలీగా ఎంపీడీవో కార్యాలయం వైపు కదిలారు. తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ఎం పి డి ఓ సత్తయ్య కు అందజేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు వరుస కృష్ణహరి, తిమ్మాపూర్ సర్పంచ్ అందె సుభాష్, మాజీ జెడ్పీటీసీ చీటీ లక్ష్మణరావు, మహిళా అధ్యక్షురాలు అప్సర ఉన్నిసా, ఎల్లారెడ్డిపేట సర్పంచ్ ఎలగందుల నరసింహులు తో పాటు పలువురు బి ఆర్ ఎస్ పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

# బొప్పపూర్ జక్కుల చెరువులో వినాయక నిమజ్జనాలు చేయకుండా చర్యలు తీసుకోవాలి



అరుణప్రభ న్యూస్ -- ఎల్లారెడ్డిపేట, సెప్టెంబర్ 7: రాచర్ల బొప్పాపూర్ గ్రామంలోని జక్కుల చెరువులో ఇతర గ్రామాల వినాయక విగ్రహాల నిమజ్జనాలు చేయకుండా చర్యలు తీసుకోవాలని కోరుతూ గ్రామ ప్రజాప్రతినిధులు సోమవారం ప్రజావాణిలో స్థానిక మండల ఎంపీడీవో, ఎంఆర్ఓ, ఎస్‌హెచ్ఓలకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ ఇల్లందుల గీతాంజలి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ.. జక్కుల చెరువులో గ్రామానికి మంచినీటి సరఫరా చేసే బావి ఉందని తెలిపారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో వినాయక విగ్రహాలను చెరువులో నిమజ్జనం చేయడం వల్ల నీరు కలుషితమయ్యే అవకాశం ఉందని, దీంతో గ్రామంలో తాగునీటి సమస్య తలెత్తే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రతి గ్రామంలో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహాలను ఆయా గ్రామాల్లోనే నిమజ్జనం చేసుకునేలా అధికారులు చర్యలు తీసుకోవాలని సర్పంచ్ విజ్ఞప్తి చేశారు. జక్కుల చెరువులోని తాగునీటి వనరును కాపాడేందుకు అధికారులు తగిన ముందస్తు చర్యలు చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ కొండాపురం వెంకట్ రెడ్డి, వార్డు సభ్యులు ప్రసాద్ రావు, ల్యాగల సతీష్ తదితరులు పాల్గొన్నారు.

# గణేష్ మండపాల నిర్వాహకులు మరియు డీజే ఆపరేటర్లతో శాంతి కమిటీ సమావేశం

అరుణ ప్రభ పాలకుర్తి సెప్టెంబర్ పాలకుర్తి పోలీస్ స్టేషన్ పరిధిలో జరగనున్న గణేష్ ఉత్సవాల సందర్భంగా, గణేష్ మండపాల నిర్వాహకులు మరియు డీజే ఆపరేటర్లతో పాలకుర్తి పోలీసుల ఆధ్వర్యంలో శాంతి కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో సుమారు 50 మంది నిర్వాహకులు మరియు సభ్యులు పాల్గొన్నారు.సీఐభరత్ సుమన్ పాలకుర్తి మరియు ఎస్ఐ పాలకుర్తి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సమావేశంలో గణేష్ ఉత్సవాలను ప్రశాంతంగా, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా నిర్వహించేందుకు పలు సూచనలు మరియు ఆదేశాలు జారీ చేశారు.ప్రతి గణేష్ మండపాన్ని తప్పనిసరిగా ఆన్‌లైన్/నిర్దేశిత విధానంలో రిజిస్ట్రేషన్ చేయించుకోవాలి.మండపం ఏర్పాటుకు సంబంధించి సంబంధిత అన్ని శాఖల నుంచి అవసరమైన అనుమతులు తప్పనిసరిగా పొందాలి.మండపం వద్ద కనీసం ముగ్గురు నిర్వాహకులు 24 గంటలు అందుబాటులో ఉండేలా ఏర్పాట్లు చేసుకోవాలి.గణేష్ ఊరేగింపు మరియు నిమజ్జనం సమయంలో ట్రాఫిక్‌కు ఎలాంటి అంతరాయం కలగకుండా పోలీసులకు పూర్తిగా సహకరించాలి. రిజిస్ట్రేషన్ సమయంలోనే నిమజ్జనం తేదీ మరియు నిమజ్జనం చేసే ప్రదేశం వివరాలను తప్పనిసరిగా నమోదు చేయాలి.డీజేలకు అనుమతి లేదు. డీజే ఆపరేటర్లు మరియు నిర్వాహకులు పోలీసుల ఆదేశాలను తప్పనిసరిగా పాటించాలి.మండపాల వద్ద విద్యుత్ భద్రత, అగ్నిమాపక భద్రత, తగిన లైటింగ్ మరియు భక్తుల భద్రతకు అవసరమైన అన్ని ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలి.ఊరేగింపు సమయంలో చిన్నపిల్లలు, మహిళలు మరియు వృద్ధుల భద్రతపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి.ప్రజల మధ్య వివాదాలు లేదా మత విద్వేషాలకు దారితీసే నినాదాలు, ప్రసంగాలు, కార్యక్రమాలు నిర్వహించరాదు. గణేష్ ఉత్సవాలను శాంతియుతంగా, సోదరభావంతో మరియు పోలీసుల సూచనలను పాటిస్తూ నిర్వహించాలని నిర్వాహకులకు సూచించారు.ఈ సందర్భంగా గణేష్ మండపాల నిర్వాహకులు, డీజే ఆపరేటర్లు మరియు భక్తులు పోలీసులకు పూర్తిగా సహకరించి గణేష్ ఉత్సవాలను ప్రశాంతంగా, సురక్షితంగా నిర్వహించాలని పాలకుర్తి ఎస్ ఐ లు పవన్ కుమార్, రాజు పాల్గొన్నారు.



అరుణ ప్రభ
ARUNAPRABHA TELUGU DAILY



# జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు దుస్తుల పంపిణీ

## విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకొని ఉన్నత లక్ష్యాలు సాధించాలి: సర్పంచ్ ఎనుగందుల నరసింహులు

ఎల్లారెడ్డిపేట, సెప్టెంబర్ 7 (అరుణప్రభ): ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం విద్యార్థులకు దుస్తుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ ఎనుగందుల నరసింహులు తన చేతుల మీదుగా విద్యార్థులకు దుస్తులను పంపిణీ చేశారు ఈ సందర్భంగా సర్పంచ్ ఎనుగందుల నరసింహులు మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకొని ఉన్నత లక్ష్యాలను సాధించాలని ఆకాంక్షించారు. విద్యార్థుల భవిష్యత్తుకు విద్య ఎంతో కీలకమని, పట్టుదలతో చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని సూచించారు. పేద, మధ్యతరగతి కుటుంబాలకు చెందిన విద్యార్థులకు ఇలాంటి కార్యక్రమాలు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని ఆయన పేర్కొన్నారు. విద్యార్థుల విద్యాభివృద్ధికి అవసరమైన సహాయ సహకారాలను అందించేందుకు గ్రామపంచాయతీ తరపున ఎల్లప్పుడూ ముందుంటామని తెలిపారు. పాఠశాలల్లో విద్యార్థులకు అవసరమైన మౌలిక వసతులు, ఇతర సదుపాయాల విషయంలో కూడా అందుబాటులో ఉండి సహకరిస్తామని అన్నారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాల్లోనూ ప్రతిభ కనబరచాలని సర్పంచ్ సూచించారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు తమపై



పెట్టుకున్న నమ్మకాన్ని నిలబెట్టుకుని పాఠశాలకు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# శివ పరాశక్తి పీఠంలో వైభవంగా శ్రావణ సోమవారం, ఏకాదశి పూజలు

## పంచామృతాభిషేకాలు.. సప్త హారతులతో ఆధ్యాత్మిక శోభ.. భక్తులకు అన్నప్రసాద వితరణ

ఎల్లారెడ్డిపేట, సెప్టెంబర్ 7 (అరుణప్రభ): పవిత్ర శ్రావణ మాస చివరి సోమవారం, విశిష్టమైన ఏకాదశి తిథి కలసి వచ్చిన సందర్భంగా రాచర్ల బొప్పాపూర్‌లోని శ్రీ శివ పరాశక్తి పీఠంలో సోమవారం ప్రత్యేక ఆధ్యాత్మిక కార్యక్రమాలు అత్యంత వైభవంగా నిర్వహించారు. పీఠం ప్రాంగణం శివనామస్మరణతో, భక్తుల సందడితో మార్మోగింది. వివిధ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి పరమశివుని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు.

**పంచామృతాభిషేకాలతో శివారాధన**

ఈ సందర్భంగా పీఠంలోని పరమశివునికి శాస్త్రోక్తంగా పంచామృతాభిషేకం నిర్వహించారు. పంచామృతాలతో పాటు శ్రీగంధం, పవిత్ర భస్మంతో స్వామివారికి విశేష అభిషేకాలు జరిపారు. అభిషేక కార్యక్రమాన్ని భక్తులు భక్తిశ్రద్ధలతో తిలకిస్తూ శివనామస్మరణ, తారక మంత్రాన్ని స్మరించుకున్నారు. అభిషేకానంతరం స్వామివారిని దివ్యాభరణాలు, సుగంధ పుష్పాలతో సుందరంగా అలంకరించారు. అనంతరం శాస్త్రోక్తంగా సప్త హారతులు సమర్పించారు. హారతి సమయంలో పీఠం ఆవరణలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. భక్తులు హారతిని దర్శించుకుని స్వామివారి ఆశీస్సులు పొందారు.

**వారాధనతో సకల శుభాలు**

ఈ సందర్భంగా పీఠాధిపతులు శ్రీ శ్రీ శ్రీ మనోహర్ రాజు గురూజీ భక్తులకు దివ్య ఆశీర్వచనాలు అందించారు. శ్రావణ సోమవారం, ఏకాదశి తిథి కలసి వచ్చిన ఈ పవిత్ర రోజున శివారాధన చేయడం విశేష ఫలప్రదమని ఆయన పేర్కొన్నారు. భక్తిశ్రద్ధలతో పరమశివుని ఆరాధించడం వల్ల సకల కల్మషాలు తొలగి, ఆయురారోగ్యాలు, ఐశ్వర్యాలు, సుఖసంతోషాలు కలుగుతాయని తెలిపారు. పవిత్రమైన శ్రావణ మాసంలో చివరి సోమవారం కావడంతో భక్తులు ప్రత్యేకంగా పీఠానికి చేరుకుని స్వామివారికి అభిషేకాలు, పూజలు



నిర్వహించారు. కుటుంబ సమేతంగా వచ్చిన భక్తులు శివదర్శనం చేసుకుని ఆధ్యాత్మిక అనుభూతిని పొందారు.

**భక్తులకు అన్నప్రసాద వితరణ**

మహాపూజలు, సప్త హారతుల అనంతరం పీఠం ఆవరణలో భక్తులందరికీ అన్నప్రసాద వితరణ నిర్వహించారు. పీఠం నిర్వాహకులు అత్యంత శుచిశుభ్రతతో సమృద్ధిగా అన్నప్రసాదాన్ని సిద్ధం చేసి భక్తులకు అందించారు. భక్తులు అన్నప్రసాదాన్ని స్వీకరించి పీఠాధిపతుల ఆశీస్సులు పొందారు. శ్రావణ సోమవారం, ఏకాదశి తిథి సందర్భంగా నిర్వహించిన విశేష పూజా కార్యక్రమాలు భక్తులను ఆధ్యాత్మిక పరవశంలో ముంచెత్తాయి. కార్యక్రమం ప్రశాంతంగా, భక్తిశ్రద్ధల మధ్య ముగిసింది.

# విద్యార్థుల రీయింబర్స్‌మెంట్ బకాయిల కోసం అసెంబ్లీ ముట్టడికి యత్నం

## రాచర్ల బొప్పాపూర్ బీజేపీ నాయకుడు మారావేణి రంజిత్‌కుమార్‌కు గాయాలు

ఎల్లారెడ్డిపేట, సెప్టెంబర్ 7 (అరుణప్రభ): విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తూ బీజేవైఎం నాయకులు సోమవారం అసెంబ్లీ ముట్టడికి యత్నించారు. ఈ సందర్భంగా పోలీసులు వారిని అడ్డుకోవడంతో ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. ఆందోళనలో పాల్గొన్న రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండలం రాచర్ల బొప్పాపూర్ గ్రామానికి చెందిన బీజేపీ నాయకుడు మారావేణి రంజిత్‌కుమార్ గాయపడ్డారు. అసెంబ్లీ ముట్టడికి బీజేవైఎం నాయకులు పెద్ద సంఖ్యలో తరలిరాగా పోలీసులు వారిని అడ్డుకునేందుకు ప్రయత్నించారు. ఈ క్రమంలో జరిగిన తోపులాటలో రంజిత్‌కుమార్‌కు గాయాలైనట్లు సమాచారం. అనంతరం ఆయన స్పృహ కోల్పోవడంతో అక్కడే ఉన్న పోలీసులు నీరు తాగించి పరిస్థితిని చక్కదిద్దేందుకు ప్రయత్నించారు. అయితే పరిస్థితి పూర్తిగా మెరుగుపడకపోవడంతో రంజిత్‌కుమార్‌ను పోలీసులు హైదరాబాద్‌లోని కింగ్ కోఠి ఆసుపత్రికి తరలించారు. అక్కడ వైద్యులు ఆయనకు చికిత్స అందిస్తున్నారు. ప్రస్తుతం రంజిత్‌కుమార్ వైద్యుల పర్యవేక్షణలో చికిత్స పొందుతున్నట్లు బీజేపీ నాయకులు తెలిపారు. విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని, బకాయిల కారణంగా విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని బీజేవైఎం నాయకులు ఆందోళన వ్యక్తం చేశారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం స్పందించి పెండింగ్‌లో ఉన్న రీయింబర్స్‌మెంట్ నిధులను తక్షణమే విడుదల చేయాలని వారు డిమాండ్ చేశారు. రంజిత్‌కుమార్‌కు గాయాలు కావడంతో రాచర్ల బొప్పాపూర్ గ్రామానికి చెందిన బీజేపీ నాయకులు, కార్యకర్తలు ఆందోళన వ్యక్తం చేశారు. ఆయన ఆరోగ్య పరిస్థితిపై కుటుంబ సభ్యులు, పార్టీ నాయకులు ఆరా తీస్తున్నారు.



# ఛలో హైదరాబాద్ ను విజయవంతం చేయండి

## టి జి జేఏసీ మహబూబాబాద్ జిల్లా చైర్మన్,కన్వీనర్ వడ్డేబోయిన శ్రీనివాస్,మహమూద్ రఫీ లు పిలుపు.

అరుణప్రభ 7 సెప్టెంబర్ మహబూబాబాద్ అర్బన్ రాష్ట్ర ప్రభుత్వఉద్యోగుల, ఉపాధ్యాయుల న్యాయమైన డిమాండ్ల సాధనకై సెప్టెంబర్ 10న టీజీజాక్ తలపెట్టిన ఛలో హైదరాబాద్ ను జయ ప్రదం చేయాలని కోరుతు నేతలు పోస్టర్ ను ఆవిష్కరించారు. తెలంగాణ ఉద్యోగుల జేఏసీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమానికి జిల్లా నుండి ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు పెద్ద ఎత్తున తరలి రావాలన్నారు ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం ఇప్పటికే పలు దశల్లో ఆందోళన కార్యక్రమాలు నిర్వహించినట్లు వారు పేర్కొన్నారు. ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్ల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం సత్వరమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సి పి ఎస్ రద్దు చేసి ప్రభుత్వం ఇచ్చిన హామీకి అనుగుణంగా వెంటనే ఓపిఎస్ అమలు చేయాలని వారు డిమాండ్ చేశారు పీఆర్సీ , పెండింగ్ డీఏల చెల్లింపు, ఉద్యోగుల పెండింగ్ బిల్లుల పరిష్కారం, ఆరోగ్య పథకం అమలు, తదితర సమస్యలపై ప్రభుత్వం సానుకూల నిర్ణయం తీసుకోవాలని కోరారు. ప్రభుత్వం ఉద్యోగుల సమస్యలను పరిష్కరించడంలో జాప్యం చేస్తే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామన్నారు "ఉద్యోగుల న్యాయమైన హక్కుల సాధన కోసం ఐక్యంగా ఉద్యమిద్దాం.. సెప్టెంబర్ 10న హైదరాబాద్‌లో కదం తొక్కుదాం" అని వారు పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమం లో నాయకులు మురళీకృష్ణ ఫిరోజ్ రమేష్ ప్రసాద్ హాలియా నాయక్ భాస్కర్



గోపికృష్ణ సత్యనారాయణ భద్ర నాయక్ రోహిత్ నాగమణి విష్ణువర్ధన్ రెడ్డి హరినాయక్ దేవేందర్ రాజు లక్ష్మీకాంత్ ఉపేందర్ మంజుల రోహిత్ రాజశేఖర్ బిక్షపతి తదితరులు పాల్గొన్నారు

# కాంగ్రెస్ 1000 రోజుల విఫల పాలన

**కాంగ్రెస్ ప్రభుత్వం హామీలను విస్మరించి ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నది**

**కలెక్టర్ కి వినతి పత్రం సమర్పించిన మహబూబాబాద్ నియోజకవర్గ ఇంచార్జ్,మాజీ ఎమ్మెల్యే బానోత్ శంకర్ నాయక్, జిల్లా అధ్యక్షురాలు కవిత, సత్యవతి రాథోడ్**

**అరుణప్రభ 7 సెప్టెంబర్ మహబూబాబాద్**

కాంగ్రెస్ ప్రభుత్వానికి 1000 రోజుల విజయోత్సవాల పాలన కాదు వెయ్యి రోజుల వైఫల్యాల పాలన అని తీవ్రస్థాయిలో బారాసా నేతలు మండిపడుతున్నారు ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలు మరిచి అక్రమ అరెస్టులు ఏమిటని ప్రశ్నిస్తున్నారు జిల్లా కేంద్రంలోని స్థానిక జిల్లా కలెక్టర్కు వివిధ సమస్యలపై వినతి పత్రం అందజేసి ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో మండిపడిన మాజీ ఎమ్మెల్యే శంకర్ నాయక్ మాజీ ఎంపీ కవిత మాజీ ఎమ్మెల్సీ సత్యవతి రాథోడ్ మాజీ ఎమ్మెల్యే రెడ్యానాయక్

**ప్రధాన ప్రజా సమస్యలు:**

రైతులకు రుణమాఫీ,రైతుభరోసా సకాలంలో అందకపోవడం పంటలకు గిట్టుబాటు ధర,ధాన్యం కొనుగోళ్లలో జాప్యం మహిళలకు రూపాయలు 2,500 ఆర్థిక సాయం అమలు చేయకపోవడం వృద్ధులు,వితంతువులు, వికలాంగుల పెన్షన్లపై నిర్లక్ష్యం నిరుద్యోగులకు ఉద్యోగాలు, నిరుద్యోగ భృతి అందకపోవడం విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు పెండింగ్‌లో ఉండటం పేదలకు ఇందిరమ్మ ఇళ్లు,ఇళ్ల స్థలాల విషయంలో జాప్యం పెరుగుతున్న ధరలు,విద్యుత్ ఛార్జీల భారంతో ప్రజలపై ఆర్థిక భారం ఈ



కార్యక్రమంలో మాజీ మంత్రివర్యులు సత్యవతి రాథోడ్ డీఎస్ రెడ్యా నాయక్ మాజీ ఎంపీ మాలోత్ కవిత మాజీ జడ్పీ చైర్మన్ ఆంగోత్ బిందు పాక్స్ చైర్మన్ నాయిని రంజిత్ గారు,జిల్లా నాయకులు పరకాల శ్రీనివాస్ రెడ్డి వైస్ చైర్మన్ మర్నేని వెంకన్న యూత్ ప్రెసిడెంట్ మురళీధర్ రెడ్డి కౌన్సిలర్లు గూగులోత్ నరేష్ ముత్యం వెంకన్న మండల ప్రెసిడెంట్ తేళ్ల శ్రీనివాస్ యాదవ్ గారు,వర్కింగ్ ప్రెసిడెంట్ అశోక్ నాయక్ మండల యూత్ ప్రెసిడెంట్ బానోత్ దాము నాయక్ మండల కో ఆప్షన్ ఎండీ షరీఫ్ జిల్లా కో ఆప్షన్ సభ్యులు ఎండి పాషా తదితరులు పాల్గొన్నారు.

# భీమేశ్వరాలయంలో భక్తుల రద్దీ.

## క్యూలైన్లలో బారులు తీరిన భక్తులు.. స్వామివారి దర్శనానికి 3 గంటల సమయం.



ఎల్లారెడ్డిపేట అరుణప్రభ న్యూస్ . రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడలోని శ్రీ రాజరాజేశ్వర స్వామి అనుబంధ దేవాలయమైన శ్రీ భీమేశ్వర స్వామి ఆలయంలో శ్రావణ చివరి సోమవారం భక్తుల రద్దీ నెలకొంది. స్వామివారి దర్శనం కోసం భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. భక్తులు కోడెల, ధర్మ దర్శనం, శీఘ్రదర్శనం, బ్రేక్ దర్శనం క్యూలైన్లలో బారులు తీరి స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ పరిసరాలు భక్తులతో కిక్కిరిసిపోయాయి. గంటల తరబడి క్యూలైన్లలో వేచి ఉన్న భక్తులు స్వామివారికి మొక్కులు చెల్లించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. భక్తుల రద్దీకి అనుగుణంగా ఆలయ డీఈఓ ప్రతాప నవీన్ కుమార్ పర్యవేక్షణలో సిబ్బంది ఏర్పాట్లను ఎప్పటికప్పుడు పర్యవేక్షించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా దర్శనం, క్యూలైన్లు, ఇతర ఏర్పాట్లను సిబ్బంది పర్యవేక్షిస్తున్నారు. శ్రావణ చివరి సోమవారం కావడంతో భక్తుల రద్దీ అధికంగా ఉండటంతో స్వామివారి దర్శనానికి దాదాపు మూడు గంటల సమయం పడుతోంది.

# ఇందిరమ్మ ఇళ్లు గృహప్రవేశా వేడుకల్లో పాల్గొన్న పట్లోళ్ల సుధాకర్ రెడ్డి జిల్లా కాంగ్రెస్ నాయకులు



నారాయణఖేడ్ నియోజకవర్గం నారాయణఖేడ్ మండల పరిధిలోని అనంతసాగర్ గ్రామంలో నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ ఇంటి గృహ ప్రవేశ వేడుక ఘనంగా జరిగింది. గ్రామానికి చెందిన లబ్ధిదారులు వగ్గు భూమమ్మ, వగ్గు కిష్టయ్య దంపతుల గృహ ప్రవేశ కార్యక్రమానికి జిల్లా కాంగ్రెస్ నాయకులు పట్లోళ్ల సుధాకర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పట్లోళ్ల సుధాకర్ రెడ్డి రిబ్బన్ కట్ చేసి ఇంటిని ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... పేద ప్రజల సొంతింటి కలను నిజం చేయడమే ప్రజా ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ ప్రవేశపెట్టిన ఇందిరమ్మ ఇళ్ల పథకం పేదవారి ఆత్మగౌరవానికి నిదర్శనమని, ప్రతి నిరుపేద కుటుంబానికి గూడు కల్పించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. నూతన గృహంలో అడుగుపెట్టిన వగ్గు భూమమ్మ-కిష్టయ్య కుటుంబ సభ్యులకు ఆయన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పండరి రెడ్డి మాజీ ఎంపీటీసీ,వగ్గు హన్మంతు మాజీ సర్పంచ్,హన్మారెడ్డి, లోకేష్ రెడ్డి,వగ్గు శంకర్, వగ్గు నరేష్, వగ్గు శీనుఓకొండా రాములు,బేగారి ఎవన్, బక్క శంకర్,స్థానిక కాంగ్రెస్ పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, గ్రామ పెద్దలు మరియు కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# అరెస్టులు కాదు రీయింబర్స్మెంట్ ఇవ్వండి

## భాజపా మండల అధ్యక్షుడు మారం రవికుమార్

అరుణ ప్రభ పాలకుర్తి సెప్టెంబర్



పాలకుర్తి మండలం తెలంగాణ రాష్ట్రంలో దాదాపు 40 వేల మంది విద్యార్థులకు రావాల్సిన 15వేల కోట్ల రూపాయల ఫీజు బకాయిలు చెల్లించాలి అని భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు ఛలో అసెంబ్లీ నినాదం తో అసెంబ్లీ ముట్టడికి పిలుపు ఇవ్వగా పాలకుర్తి మండల భారతీయ జనతా పార్టీ నాయకులు వెళ్లకుండా పోలీసులు ముందస్తు అరెస్టులు చేయడం అప్రజాస్వామికం అని మండల అధ్యక్షుడు మారం రవికుమార్ అన్నారు. బిజెపి నాయకులను అరెస్ట్ చేయడంపై పెట్టిన శ్రద్ధ విద్యార్థుల ఫీజు బకాయిల పైన పెడితే బాగుంటుంది అని,ఇప్పటికి అయినా పూర్తి ఫీజు రీయింబర్స్ చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సీనియర్ నాయకులు దొంగరి మహేందర్, కమ్మగాని శ్రీకాంత్ గౌడ్, మండల ప్రధాన కార్యదర్శి వేల్పుల దేవరాజు, బీజేవైఎం మండల అధ్యక్షుడు గొనె అమరేందర్ తదితరులు పాల్గొన్నారు.

# స్పీకర్ పట్ల బీఆర్ఎస్ సభ్యుడి తీరును ఖండించిన మల్‌రెడ్డి రంగారెడ్డి ...

## అసెంబ్లీ చరిత్రలో చీకటి అధ్యాయంగా పేర్కొన్న ఎమ్మెల్యే...

అరుణప్రభ ఇబ్రహీంపట్నం: గౌరవ శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌గారిపై బీఆర్ఎస్‌కు చెందిన శాసనమండలి సభ్యుడు తాతా మధు మాట్లాడిన తీరును ఇబ్రహీంపట్నం శాసనసభ్యులు మల్‌రెడ్డి రంగారెడ్డి గారు తీవ్రంగా ఖండించారు. అసెంబ్లీ చరిత్రలో ఈ ఘటనను చీకటి అధ్యాయంగా ఆయన అభివర్ణించారు. స్పీకర్ కుటుంబం పట్ల హేయమైన రీతిలో మాట్లాడిన తీరు కేవలం దళితులకు మాత్రమే కాకుండా తెలంగాణ సమాజానికి జరిగిన అవమానంగా పేర్కొన్నారు. శాసనమండలి సభ్యుడిపై చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్న మల్‌రెడ్డి రంగారెడ్డి... బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.



అరుణ ప్రభ
ARUNAPRABHA TELUGU DAILY
మంగళవారం, సెప్టెంబరు 8, 2026

# ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా 'ప్రజావాణి' కార్యక్రమము

**సమస్యలు పారదర్శకంగా, వేగవంతంగా నిర్వహించేందుకు అధికారులు నిబద్ధతతో పనిచేయాలి**

**కలెక్టర్ స్నేహ శబరిష్**

**అదనపు కలెక్టర్ రెవెన్యూ కె. అనిల్ కుమార్, ఇంచార్జీ అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు, హౌసింగ్ పీడీ పురుషోత్తం, డిఆర్ఓ నాగలక్ష్మి, న్యాయ సేవ సంస్థ ప్రతినిధి ఆనంద్ కుమార్, అన్ని విభాగాల అధికారులతో కలిసి ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించారు.**



అరుణప్రభ 7 సెప్టెంబర్ మహబూబాబాద్ అర్బన్ ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా వచ్చిన దరఖాస్తులను పరిశీలించి తమ పరిధిలో ఉంటే వెంటనే పరిష్కరించాలని లేనిపక్షంలో సంబంధిత విభాగానికి సిఫారసు చేసి పరిష్కారం దిశగా చర్యలు తీసుకోవాలని ఈ ప్రక్రియలో ప్రతి ఒక్క ఉద్యోగి బాధ్యతాయుతంగా వ్యవహరించాలని అన్నారు ప్రజావాణికి వచ్చే అర్జీదారులు తమ దరఖాస్తును స్పష్టమైన అక్షరాలతో రాయాలి. వినతిపత్రంలో పేరు, చిరునామా, ఫోన్ నంబర్ తప్పనిసరిగా పేర్కొనాలని,సమస్యకు సంబంధించిన అవసరమైన ధృవీకరణ పత్రాలు (ఆధార్ కార్డు, రేషన్ కార్డు, పట్టాదార్ పాస్ పుస్తకం మొదలైనవి) నకళ్లను అర్జీకి జత చేయాలని ప్రజావాణి నిర్వహించే రోజున (ప్రతి సోమవారం) ఉదయం 10:30 గంటల లోపు పేరు నమోదు చేసుకోవాలన్నారు, టోకెన్ ప్రాతిపదికన మాత్రమే అధికారులను కలవాల్సి ఉంటుంది. కావున ప్రతి ఒక్కరూ క్రమశిక్షణ పాటించి, సహకరించాలి. పాత దరఖాస్తులు: ఇదివరకే దరఖాస్తు చేసుకుని ఉంటే, ఆ పాత దరఖాస్తు లేదా ఐడీ నంబర్‌ను కొత్త అర్జీతో పాటు సమర్పించాలి. జిల్లాలోని అన్ని శాఖల ముఖ్య అధికారులు ప్రజావాణికి ఉదయం 10:30 నుండి మధ్యాహ్నం 1:30 గంటల వరకు తప్పనిసరిగా హాజరుకావాలి. అత్యవసర పరిస్థితి ఉంటే మినహా ముందస్తు అనుమతి లేకుండా గైర్హాజరు కాకూడదు.త్వరితగతిన పరిష్కారం: స్వీకరించిన అర్జీలను, నిర్ణీత కాలపరిమితి (గ్రీవెన్స్ రెడ్రెస్సల్ టైం లైన్ ) లోగా పరిష్కరించాక్షేత్రస్థాయి పరిశీలన: సమస్య తీవ్రతను బట్టి అధికారులు క్షేత్రస్థాయికి వెళ్లి స్వయంగా పరిశీలించి బాధితులకు న్యాయం చేయాలన్నారు, దరఖాస్తుపై తీసుకున్న చర్యలు లేదా తిరస్కరించడానికి గల సరైన కారణాలను అర్జీదారునికి లిఖితపూర్వకంగా లేదా ఎస్ఎమ్ఎస్ ద్వారా తెలియజేయాలనీ, ఆన్‌లైన్ స్టేటస్ అప్‌డేట్: ప్రజావాణి పోర్టల్‌లో అర్జీల స్థితిని (స్టేటస్ ) ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేయాలన్నారు. ప్రజావాణి ద్వారా ప్రజల సమస్యలు త్వరితగతిన పరిష్కారమయ్యేలా అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, ప్రజలు కూడా ఈ అవకాశాన్ని వినియోగించుకుని అధికారులకు సహకరించాలని ఈ సందర్భంగా కోరడమైనది అంతరం వినాయక చవితి సందర్భంగా మట్టి గణపతులను వినియోగించాలని కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో పోస్టర్ ఆవిష్కరించారు, వివిధ విభాగాలకు చెందిన మొత్తం (144) దరఖాస్తులు వచ్చాయని, సంబంధిత విభాగాలకు తగు చర్య నిమిత్తం వెంటనే పంపడం జరిగిందని అన్నారు, అంతకముందు నారాయణపురం గ్రామస్తులు దారావత్ రవి నాయక్, యమనా ఎర్పంచ్, కైక, వెంకట్ రెడ్డి, సుమన్, శ్రీలత లకు పట్టాదార్ పాస్ బుక్కులు అందజేశారు, ఈ కార్యక్రమంలో అని విభాగాల జిల్లా అధికారులు, కలెక్టరేట్ పరిపాలన అధికారి పవన్ కమార్, సంబంధిత విభాగాల సిబ్బంది పాల్గొన్నారు

# ఘనంగా 303 వాకర్స్ ఇంటర్నేషనల్ మూడవ క్యాబినెట్ సమావేశం




అరుణప్రభ 7 సెప్టెంబర్ మహబూబాబాద్ అర్బన్

303 వాకర్ ఇంటర్నేషనల్ మూడవ క్యాబినెట్ సమావేశం(ఉమ్మడి వరంగల్ ఖమ్మం జిల్లాల పరిధి) మహ,బాద్ లోని టిపిటిఎఫ్ భవన్లో కాళోజి వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగింది. ఇట్టి సమావేశానికి ముఖ్యఅతిథిగా రావడం జరిగింది. డాక్టర్ పుల్లూరి శ్రీనివాస్ గౌడ్ 303 వరంగల్ ఏరియా గవర్నర్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ పుల్లూరి శ్రీనివాస్ గౌడ్ గారు మరియు డాక్టర్ డోలి సత్యనారాయణ గారు మాట్లాడుతూ వాకర్ సంఘాలన్నీ కూడా ఆరోగ్యానికి ప్రాధాన్యతనిస్తూ ఆరోగ్య రక్షణ కొరకై నిత్యం యోగా, వాకింగ్ చేయాలని అంతే కాకుండా సమాజానికి ఉపయోగపడే అన్ని కార్యక్రమాల్లో పాల్గొనాలని అందులో ముఖ్యంగా బ్లడ్ డొనేషన్ క్యాంపులు, పర్యావరణ పరిరక్షణ కొరకు సమావేశాలు, హెల్త్ క్యాంపులు ఆరోగ్యం పై అవగాహన కార్యక్రమాలు చేపడుతూ ఉండాలని కోరారు. ముఖ్యంగా వరంగల్ ఖమ్మం ఉమ్మడి జిల్లాల పరిధిలో మహ,బాద్ లోని కాళోజి వాకర్స్ అసోసియేషన్ ఆరోగ్యమే కాకుండా సమాజ కార్యక్రమాల్లో పాల్గొంటూ మొక్కలు నాటే కార్యక్రమాలు, క్లీన్ అండ్ గ్రీన్ కార్యక్రమం, బ్లడ్ డొనేషన్లు, విద్యార్థులకు విద్యపై అవగాహన కల్పించడం, వ్యాసరచన పోటీలు పెట్టి ఎంకరేజ్ చేయడం, ఉపాధ్యాయ దినోత్సవంలో ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానించడం ఇంకా చాలా సామాజిక కార్యక్రమంలో పాల్గొంటూ చక్కని సేవ చేస్తుందని కొనియాడారు. ఇంకా ఈ కార్యక్రమానికి ఖమ్మం మరియు వరంగల్ ఉమ్మడి జిల్లాల నుండి సుమారు 20 వాకర్ అసోసియేషన్ సంఘాలు రావడం జరిగింది. 303 పెద్దలు,జంగా గోపాలరెడ్డి ,ఎల్లగౌడ్,తడక కుమారస్వామి,కస్తూరి రాజు,కొలనుపాక శ్రీనివాసులు,సుధాకర్, దశరథ రామ్ రెడ్డి అదేవిధంగా ఖమ్మం లకారం వాకర్స్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు, వరంగల్ ఏవేవి వాకర్స్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు, సైకిల్ ఆకర్స్ అసోసియేషన్ పెద్దలు మహబూబాబాద్ లోని తెలంగాణ, మిత్ర, ఉషోదయ వాకర్స్ అసోసియేషన్లు, గూడూరు అబ్దుల్ కలాం అసోసియేషన్ కూడా హాజరు కావడం జరిగింది. ఈ కార్యక్రమానికి వాకర్ అసోసియేషన్ సలహాదారులుమైస శ్రీనివాస్ ,పెద్ది వెంకన్న, మైస నాగయ్య, అధ్యక్షులు నామిరెడ్డి వెంకటరెడ్డి, కార్యదర్శి పట్టాభి లక్ష్మయ్య, కోశాధికారి సోమ విష్ణువర్ధన్, జిలకర శ్రీహరి, పులి దామోదర్, ప్రభాకర్, మల్లారెడ్డి, మేడా వెంకటేశ్వర్లు, డోలి జగదీష్, నలు దేవేందర్ రెడ్డి, ఓలశీ విద్యాసాగర్, మాచర్ల సుధాకర్, యాస హేమల్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, వీరేందర్,నరసింహారావు,వెంకటేశ్వర్లు, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## వీర్నపల్లి పోలీస్ స్టేషన్‌లో డీజే నిర్వాహకుల బైండోవర్

**అనుమతులు లేకుండా అధిక శబ్దంతో డీజేలు నిర్వహిస్తే కఠిన చర్యలు: ఎస్సై లక్ష్మణ్**



ఎల్లారెడ్డిపేట అరుణప్రభ, సెప్టెంబర్ 07: రాజన్న సిరిసిల్ల జిల్లా వీర్నపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా పోలీసులు ముందస్తు చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా డీజేలు నిర్వహించే నిర్వాహకులను సోమవారం పోలీస్ స్టేషన్‌కు పిలిపించి బైండోవర్ చేశారు. ఈ సందర్భంగా ఎస్సై లక్ష్మణ్ మాట్లాడుతూ.. పండుగలు, ఉత్సవాలు, ఇతర కార్యక్రమాల సందర్భంగా డీజేలను వినియోగించే నిర్వాహకులు తప్పనిసరిగా పోలీసుల అనుమతులు తీసుకోవాలని సూచించారు. అనుమతులు లేకుండా డీజేలు ఏర్పాటు చేయడం, నిర్ణీత పరిమితులకు మించి అధిక శబ్దంతో సౌండ్ సిస్టమ్‌లను వినియోగించడం వల్ల ప్రజలకు, ముఖ్యంగా వృద్ధులు, చిన్నారులు, అనారోగ్యంతో ఉన్నవారికి ఇబ్బందులు కలిగే అవకాశం ఉందన్నారు. ప్రజల ప్రశాంతతకు భంగం కలిగించే విధంగా డీజేలను నిర్వహించడం, నిబంధనలను ఉల్లంఘించడం, శాంతిభద్రతలకు విఘాతం కలిగించే చర్యలకు పాల్పడటం వంటివి చేస్తే సంబంధిత నిర్వాహకులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్సై హెచ్చరించారు. నిబంధనలు పాటిస్తూ పోలీసులకు సహకరించాలని డీజే నిర్వాహకులకు సూచించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పండుగలు, వేడుకలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు పోలీస్ శాఖకు సహకరించాలని ఆయన కోరారు. శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా పోలీసులు నిరంతరం నిఘా కొనసాగిస్తారని తెలిపారు.

# తెలంగాణలో డిగ్రీ, పీజీ కళాశాలల బంద్

**ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల కోసం ప్రైవేట్ కాలేజీల ఆందోళన**

**మంగళవారం బంద్‌కు పిలుపునిచ్చిన డిగ్రీ, పీజీ కాలేజీల సంఘం**

**వేల కోట్ల బకాయిలతో జీతాలు చెల్లించలేకపోతున్నామని యాజమాన్యాల ఆవేదన**

**ప్రభుత్వం స్పందించకపోతే నిరవధిక సమ్మెకు వెళ్తామని హెచ్చరిక**

ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ తెలంగాణలోని ప్రైవేట్ డిగ్రీ, పీజీ కళాశాలలు మంగళవారం బంద్‌కు పిలుపునిచ్చాయి. ఈ మేరకు తెలంగాణ ప్రైవేట్ డిగ్రీ, పీజీ కళాశాలల యాజమాన్యాల సంఘం (టీపీడీఎంఏ) ఒక ప్రకటన విడుదల చేసింది. బంద్‌లో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా ప్రైవేట్ డిగ్రీ, పీజీ కళాశాలల కార్యకలాపాలను నిలిపివేయనున్నట్లు యాజమాన్యాలు తెలిపాయి. పట్టణ కేంద్రాల్లో ర్యాలీలు నిర్వహిస్తామని, ప్రభుత్వం తమ డిమాండ్లపై తక్షణమే స్పందించకపోతే భవిష్యత్తులో నిరవధిక సమ్మెకు దిగుతామని హెచ్చరించాయి. ప్రభుత్వం నుంచి ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు సకాలంలో అందకపోవడంతో తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని కళాశాలల యాజమాన్యాలు ఆవేదన వ్యక్తం చేశాయి. సిబ్బంది వేతనాలు, భవనాల అద్దెలు, విద్యుత్ బిల్లులు వంటి నిర్వహణ ఖర్చులు కూడా చెల్లించలేని దయనీయ స్థితిలో ఉన్నామని వాపోయాయి. ఫీజు బకాయిలు సుమారు రూ. 10,000 కోట్ల వరకు పేరుకుపోయాయని ఇటీవలి కథనాలు, రాజకీయ నేతల ప్రకటనలు స్పష్టం చేస్తున్నాయి. ఇప్పటికే ఆర్థిక ఒత్తిడిని తట్టుకోలేక రాష్ట్రంలో దాదాపు 310 ప్రైవేట్ కళాశాలలు మూతపడ్డాయని ప్రతిపక్ష నాయకులు పేర్కొన్నారు.



# నేత్రదానం మహాదానం

గూడూరు – (అరుణ ప్రభ న్యూస్ ): మృతి చెందిన తర్వాత నేత్రదానం చేయడం వల్ల మన కళ్ళు బ్రతికే ఉంటాయని ప్రపంచాన్ని చూస్తాయని నేత్రదానంపై అపోహలు మానుకోవాలని గూడూరు ప్రభుత్వ ఏరియా హాస్పిటల్ సూపర్డెంట్ షరీనా వెల్లడించారు. గూడూరు పట్టణంలోని ప్రభుత్వ ఏరియా హాస్పిటల్ లో 41వ జాతీయ నేత్రదాన పక్షోత్సవాలు కార్యక్రమం నిర్వహించారు నేత్రదానం గొప్పతనాన్ని తెలియజేస్తూ కరపత్రాలను వైద్యులు విడుదల చేశారు హాస్పిటల్ సూపర్డెంట్ షరీనా మాట్లాడుతూ 41వ జాతీయ నేత్రదాన పక్షోత్సవాలు రాష్ట్రవ్యాప్తంగా జరుగుతున్నాయని మనిషి చనిపోయిన తర్వాత కళ్ళు దానం చేస్తే ఆ కళ్ళు ఇంకొకరికి అమర్చి వారికి జీవితాన్ని కలిగించవచ్చని మనం చనిపోయిన మన కళ్ళు ప్రపంచాన్ని చూస్తాయని ప్రతి ఒక్కరూ నేత్రదానం చేసేందుకు ముందుకు రావాలని సూచించారు ఈ కార్యక్రమంలో ఆర్ ఎం ఓ ప్రసన్న ,వైద్యులు హెలినా ,తనుషా, స్నేహ, హాస్పటల్ సిబ్బంది పాల్గొన్నారు.




# ఈనెల 10 న మెగా జాబ్ మేళా

గూడూరు – (అరుణ ప్రభ న్యూస్ ): లక్ష్య ఫౌండేషన్ బెంగళూరు వారి ఆధ్వర్యంలో గూడూరు డి ఆర్ డబ్ల్యు మహిళా కళాశాలలో ఈ నెల 10వ తేదీ మెగా జాబ్ మేళా నిర్వహిస్తున్నారని నిరుద్యోగులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కళాశాల ప్రిన్సిపాల్ హనుమంతరావు కోరారు. గూడూరు పట్టణంలోని డి ఆర్ డబ్ల్యు మహిళా కళాశాలలో లక్ష్య ఫౌండేషన్ బెంగళూరు వారి ఆధ్వర్యంలో జరగనున్న మెగా జాబ్ మేళా కరపత్రాలను ఫౌండేషన్ నిర్వాహకులు , కళాశాల అధ్యాపకులు విడుదల చేశారు ప్రిన్సిపాల్ హనుమంతరావు మాట్లాడుతూ ఈ నెల 10వ తేదీ గూడూరు డి ఆర్ డబ్ల్యు కళాశాలలో లక్ష్య, ఫౌండేషన్ ఆధ్వర్యంలో మెగా జాబ్ మేళా జరుగుతుందని అనేక కంపెనీ ప్రతినిధులు వస్తున్నారని అన్నారు. గూడూరు పరిసర ప్రాంతంలో ఉన్న నిరుద్యోగులు అందరూ జాబ్ మేళాలో పాల్గొని ఉద్యోగాలు పొందాలని సూచించారు.

# అత్యాధునిక హంగులతో ఎస్ఆర్ హాస్పిటల్ ప్రారంభం

**ప్రారంభించిన మాజీ మంత్రి,శ్రీమతి సత్యవతి రాథోడ్**

**శుభాకాంక్షలు తెలిపి యాజమాన్యాన్ని అభినందించిన మాజీ ఎంపీ మాలోత్ కవిత మాజీ ఎమ్మెల్యే శంకర్ నాయక్**



అరుణప్రభ 7 ఆగస్ట్ మహబూబాబాద్ అర్బన్ మహబూబాబాద్,సెప్టెంబర్7: లిమహబూబాబాద్ పట్టణంలోని హరికిషన్ మిల్ రోడ్‌లో ఏర్పాటు చేసిన ఎస్ఆర్ హాస్పిటల్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి మాజీ మంత్రి, సత్యవతి రాథోడ్ హాజరై రిబ్బన్ కట్ చేసి హాస్పిటల్‌ను ప్రారంభించారు ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీ మాలోత్ కవిత, మాజీ శాసనసభ్యులు బాణోత్ శంకర్ నాయక్, మాజీ హాస్పిటల్ యాజమాన్యానికి శుభాకాంక్షలు తెలిపి అభినందించికార్పొరేట్ స్థాయిలో వైద్యం అందరికీ అందుబాటులో ఉంచడం అభినందనీయమని అన్నారు కార్యక్రమంలో ,గుగులోత్ శ్రీరామ్ నాయక్, పర్కాల శ్రీనివాస్ రెడ్డి,కొంపల్లి శ్రీనివాస్ రెడ్డి,యాళ్ల మురళీధర్ రెడ్డి, విజయ్ సారధి,మూల మధుకర్ రెడ్డి,ప్రముఖ వైద్యులు చంద్రశేఖర్, బాలు నాయక్,వెంకట్ రాములు,నెహ్రు నాయక్,కోమల్,దీప్తి,గోపిలాల్,రాణా ప్రతాప్,బాలు చౌహన్,కీర్తి,సతీష్,గార్లపాటి వెంకట్ రెడ్డి ,ముత్యం వెంకన్న, కొమ్మినేని రవీందర్, నాయిని రంజిత్,మహబూబ్ పాషా,బానోత్ జగదీష్ నాయక్,అంగోత్ శ్రీకాంత్ నాయక్,ఐలి నరహరి,గుగులోత్ నెహ్రు నాయక్,బండ బిక్షం రెడ్డి,బొడ శ్రీను నాయక్,ఎడ్ల శ్రీనివాస్ రెడ్డి,తదితరులు పాల్గొన్నారు.

# పీపుల్స్ వార్‌లో పనిచేసి ప్రభుత్వ పిలుపుతో లొంగిపోయాం.

**పునరావాసం కింద హామీ ఇచ్చిన మూడు ఎకరాల భూమి ఇప్పించండి.**

**ప్రజావాణిలో ఎంపీడీవోకు మాజీ కార్యకర్త రోడ్డ రామచంద్రం వినతి.**



ఎల్లారెడ్డిపేట అరుణప్రభ, సెప్టెంబర్ 7: ప్రభుత్వ పిలుపు మేరకు గతంలో పీపుల్స్ వార్ పార్టీలో పనిచేసి లొంగిపోయామని, ప్రభుత్వం ప్రకటించిన పునరావాస పథకం కింద తమకు అందాల్సిన సహాయాన్ని ఇప్పటికైనా అందించాలని కోరుతూ ఎల్లారెడ్డిపేట మండలం హరిదాస్‌నగర్ గ్రామానికి చెందిన రోడ్డ రామచంద్రం అధికారులను కోరారు సోమవారం ఎల్లారెడ్డిపేట మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ఎంపీడీవో సత్తయ్యకు ఆయన వినతిపత్రం సమర్పించారు. పునరావాసం కింద ప్రభుత్వం తమకు మూడు ఎకరాల వ్యవసాయ భూమి అందిస్తామని హామీ ఇచ్చిందని, అయితే ఇప్పటివరకు ఆ హామీ అమలు కాలేదని వినతిపత్రంలో పేర్కొన్నారు. గతంలో ప్రజావాణి కార్యక్రమాల్లో పలుమార్లు వినతిపత్రాలు సమర్పించడంతో పాటు జిల్లా కలెక్టర్‌ను కూడా కలిసి తమ సమస్యను వివరించినట్లు రామచంద్రం తెలిపారు. ప్రభుత్వాలు మారుతున్నప్పటికీ తమకు రావాల్సిన పునరావాస సహాయం మాత్రం అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ పిలుపును నమ్మి జనజీవన స్రవంతిలోకి వచ్చామని, అయితే పునరావాసం కింద అందాల్సిన సహాయం అందకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఆయన పేర్కొన్నారు. వ్యవసాయ భూమి లభిస్తే కుటుంబాన్ని పోషించుకుంటూ గౌరవప్రదమైన జీవనం సాగించేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు. ఇప్పటికైనా అధికారులు తమ సమస్యను పరిశీలించి, ప్రభుత్వం ప్రకటించిన పునరావాస పథకం కింద హామీ ఇచ్చిన మూడు ఎకరాల వ్యవసాయ భూమిని మంజూరు చేయడంతో పాటు అర్హత మేరకు ఇతర పునరావాస సహాయాన్ని అందించాలని రోడ్డ రామచంద్రం కోరారు. తన వినతిని పరిశీలించి సంబంధిత ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆయన ఎంపీడీవో సత్తయ్యను కోరారు.



# దోమల నియంత్రణ -- ప్రజల ఆరోగ్య పరిరక్షణే లక్ష్యంగా ముందుకు సాగుతున్న చర్యలు

**మురికి నీటి గుంటలో ఆయిల్ బాల్స్ వేసిన మున్సిపల్ కమిషనర్ చైర్ పర్సన్**

అరుణప్రభ 7 సెప్టెంబర్ మహబూబాబాద్ అర్బన్ మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని 23వ వార్డులో దోమల నివారణ చర్యల్లో భాగంగా ఇంకుడు గుంతల్లో ఆయిల్ బాల్స్ ను వేసి దోమల వృద్ధిని అరికట్టేందుకు చర్యల చేపట్టాలని మున్సిపల్ అధికారులను ఆదేశించిన మహబూబాబాద్ మున్సిపల్ చైర్మన్ గుగులోత్ జ్యోతి రమేష్ నాయక్ ఈ యొక్క కార్యక్రమాన్ని ఉద్దేశించి చైర్మన్ మాట్లాడుతూ ప్రజారోగ్య పరిరక్షణలో భాగంగా దోమల నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా ఇంకుడు గుంతల్లో ఆయిల్ బాల్స్‌ను వేసి దోమల వృద్ధిని అరికట్టే చర్యలు చేపట్టారు... దోమల ద్వారా వ్యాప్తి చెందే వ్యాధులను నియంత్రించడంతో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచేందుకు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రజలు కూడా తమ ఇళ్ల పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, పారిశుద్ధ్య చర్యలకు సహకరించాలని అధికారులు సూచించారు ఈ యొక్క కార్యక్రమంలో స్థానిక 23వ వార్డు కౌన్సిలర్ లిబద్దిపూరి ఐశ్వర్య గోపి మున్సిపల్ కమిషనర్ వినోద్ సైనిటైజర్ ఇన్స్పెక్టర్ శ్రీహరి, స్థానిక వార్డు నాయకులు కార్యకర్తలు పాత్రికేయ మిత్రులు తదితరులు పాల్గొన్నారు...






# జ్ఞాపకాలు మాత్రం చెదరలేదు!

**కొంపల్లి జెడ్పిహెచ్ఎస్ 2002-03 పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం**

**మధుర జ్ఞాపకాల మజిలీలో... మిత్రుల పునర్మిళనం**

**చిన్ననాటి స్నేహాలను గుర్తుచేసుకుంటూ ఆత్మీయంగా ముచ్చటించిన పూర్వ విద్యార్థులు**

కొంపల్లి: అరుణప్రభ : జ్ఞాపకాలు మళ్లీ కలిశాయి... స్నేహ బంధాలు మళ్లీ చిగురించాయి... ఒకప్పుడు ఒకే తరగతి గదిలో కలిసి చదువుకున్న మిత్రులంతా ఎన్నో సంవత్సరాల తర్వాత ఒకే వేదికపై కలుసుకుని సందడి చేశారు. కొంపల్లి జెడ్పిహెచ్ ఎస్ 2002--03 విద్యా సంవత్సరానికి చెందిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం శామీర్‌పేట్‌లోని సెలబ్రెటరీ క్లబ్‌లో ఘనంగా నిర్వహించారు. చాలా కాలం తర్వాత కలుసుకున్న పూర్వ విద్యార్థులు ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకుంటూ, బాల్యపు మధుర జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. చిన్ననాటి విద్యాభ్యాసం, పాఠశాల రోజులు, అప్పటి స్నేహాలు, ఉపాధ్యాయులతో ఉన్న అనుబంధం తదితర విషయాలను గుర్తుచేసుకుంటూ ఆనందంగా గడిపారు.చదువుకునే రోజుల్లో జరిగిన సరదా సంఘటనలు, తరగతి గదిలోని చిలిపి చేష్టలు, పరీక్షల సమయంలో ఎదురైన అనుభవాలు, ఉపాధ్యాయుల మందలింపులు వంటి ఎన్నో జ్ఞాపకాలను ఒకరికొకరు గుర్తుచేసుకుంటూ నవ్వులు పంచుకున్నారు. అప్పటి మిత్రులను ఇన్నేళ్ల తర్వాత మళ్లీ కలుసుకోవడంతో పలువురి ముఖాల్లో ఆనందం వెల్లివిరిసింది. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు తమ ప్రస్తుత జీవన ప్రస్థానం, వృత్తి, కుటుంబం, సామాజిక కార్యకలాపాలకు సంబంధించిన విషయాలను పరస్పరం పంచుకున్నారు. ఎవరు ఏ రంగంలో స్థిరపడ్డారు, జీవితంలో ఎలాంటి అనుభవాలను ఎదుర్కొన్నారు అనే విషయాలను తెలుసుకుంటూ ఆత్మీయంగా ముచ్చటించుకున్నారు. అప్పుడు మనం విద్యార్థులం... ఇప్పుడు జీవితంలో ఎన్నో బాధ్యతల్లో ఉన్నాం. అయినా మన మధ్య ఉన్న స్నేహం మాత్రం మారలేదు అంటూ పలువురు తమ ఆనందాన్ని వ్యక్తం చేశారు. ఇలాంటి ఆత్మీయ సమ్మేళనాలు పాత స్నేహాలను మరింత బలోపేతం చేయడంతో పాటు, కొత్త తరాలకు కూడా స్నేహం, అనుబంధాల విలువను తెలియజేస్తాయని పేర్కొన్నారు. ఈ సమ్మేళనం కేవలం ఒక కలయికగా కాకుండా, ఏళ్ల తరబడి మనసుల్లో పదిలంగా ఉన్న బాల్య జ్ఞాపకాల పునర్మిళనంగా నిలిచింది. కాలం గడిచినా, జీవితంలో ఎన్నో మార్పులు వచ్చినా చిన్ననాటి స్నేహానికి మాత్రం వయసు ఉండదని ఈ కార్యక్రమం చాటిచెప్పింది. భవిష్యత్తులోనూ ఇలాంటి ఆత్మీయ సమావేశాలను క్రమం తప్పకుండా నిర్వహిస్తూ, పూర్వ విద్యార్థుల మధ్య స్నేహబంధాన్ని కొనసాగించాలని ఈ సందర్భంగా నిర్ణయించుకున్నారు. చివరగా పూర్వ విద్యార్థులంతా కలిసి సమూహ ఫొటోలు దిగుతూ, ఈ మధురమైన కలయికను శాశ్వత జ్ఞాపకంగా మలుచుకున్నారు. ఒకప్పుడు కలిసి చదువుకున్నారు... కాలంతో పాటు ఎవరి జీవిత ప్రయాణం వారు సాగించారు... కానీ ఇన్నేళ్ల తర్వాత మళ్లీ ఒకే చోట చేరి, చదువు ముగిసింది... స్నేహం మాత్రం ముగియలేదు అనే భావనను తమ ఆత్మీయ కలయిక ద్వారా చాటిచెప్పారు.



# చీర కట్టినప్పుడు ఏవి ధరించాలో తెలుసా?

పర్సనల్ స్టైలింగ్ అంటే కేవలం బట్టలు వేసుకోవడం కాదు, వాటికి సరైన యాక్సెసరీస్ జత చేయడం. ఎలాంటి దుస్తులకు ఎలాంటి చెప్పులు, బ్యాగులు ఎంచుకుంటే అందంగా కనిపిస్తారో పర్సనల్ స్టైలిస్ట్ నీలిమ సెథియా వివరించారు. ముఖ్యంగా చీర కట్టినప్పుడు అద్భుతమైన లుక్ కోసం పాటించాల్సిన మూడు సులభమైన యాక్సెసరీ హ్యాక్స్ ఏంటంటే. మనం ఎలాంటి దుస్తులు ధరించామనేది ఎంత ముఖ్యమో, వాటికి తగినట్లుగా చెప్పులు, బ్యాగులు, నగలు ఎంచుకోవడం కూడా అంతే ముఖ్యం. సరైన యాక్సెసరీస్ ఎంచుకోవడం వల్ల సాధారణ దుస్తులు కూడా చాలా ప్రత్యేకంగా కనిపిస్తాయి. అయితే చాలామందికి దుస్తులకు తగ్గట్టుగా యాక్సెసరీస్‌ను ఎలా మ్యాచ్ చేయాలో తెలియక తికమకపడుతుంటారు. ఈ సమస్యకు పర్సనల్ స్టైలిస్ట్ నీలిమ సెథియా చిట్కాల్ని చెప్పుకొచ్చారు. ఎలాంటి సందర్భానికైనా ఎలాంటి దుస్తులకైనా సరిపోయే మూడు ముఖ్యమైన యాక్సెసరీ హ్యాక్స్ ఏంటో తెలుసుకుందాం. ఇది కట్టుడు పళ్ల కంటే 300 రెట్లు ఉత్తమం! మరియు ధర చాలా చౌకగా ఉంటుంది



**సాండ్‌విచ్ - బ్యాలెన్స్‌డ్ లుక్**

మీ దుస్తుల్లో బ్యాలెన్స్ తీసుకువచ్చేందుకు సాండ్‌విచ్ పద్ధతి బాగా ఉపయోగపడుతుంది. చెప్పులు, టాప్ కలర్‌తో మ్యాచ్ చేయాలని చెబుతున్నారు నీలిమ సెథియా. దీనివల్ల మొత్తం లుక్ చాలా క్లాసీగా కనిపిస్తుంది. వైట్ కలర్ టాప్ వేసుకుంటే వైట్ చెప్పులు వేసుకోవడం వల్ల మీ లుక్‌కు బాగుంటుంది. ఇది డ్రెస్సింగ్‌లో కలర్స్‌ను బ్యాలెన్స్ చేయడానికి సరైన మార్గం.

**కలర్ పుల్లింగ్ - పాలిష్డ్ వైబ్**

మీ డ్రెస్‌లో ఏదైనా ఒక కలర్‌ను ఎంచుకుని, అదే కలర్‌ను మీ యాక్సెసరీస్‌లో ఉండేలా చూసుకోవడమే. ఇది మీ రూపానికి ఒక పాలిష్ చేసిన ఫీలింగ్‌ను అందిస్తుంది. ఇది చాలా సులభమైనదే అలాగే మీ స్టైల్‌ను పూర్తిగా మారుస్తుంది కూడా. మీరు ధరించిన చీరలో గ్రీన్ బార్డర్ ఉంటే మీ బ్యాగ్ లేదా చెప్పుల్ని కూడా అదే కలర్ ఉండేలాంటివి ఎంచుకోవాలి. ఇది రంగుల స్టైలింగ్‌లో సూపర్ చిట్కా.

**కలర్ రిపిటీషన్ - ఇన్స్టంట్ స్టైల్**

మీ దుస్తుల్లోని ఒకే కలర్‌ను బ్యాగ్, చెప్పులు లేదా నగల్లో ఉండేలా చేయడం వల్ల స్టైలిష్‌గా కనిపిస్తారు. ఇది ఏ దుస్తులకైనా సరిపోయే సులభమైన చిట్కా. ఇలా చేయడం వల్ల మీరు చాలా శ్రద్ధ తీసుకుని తయారయ్యారని ఇతరులకు అనిపిస్తుంది. బ్లూ కలర్ దుస్తులు ధరిస్తే, బ్లూ కలర్ బ్యాగ్, అదే కలర్ చెప్పులు ఎంచుకోవాలి. ఇది స్టైలింగ్ ట్రిక్స్ లో చాలా ముఖ్యమైనది.

**చీరకు సరిపోయే యాక్సెసరీస్**

చీర కట్టినప్పుడు మీ అందం మరింత పెరగాలంటే సరైన చెప్పులు ఎంచుకోవడం చాలా ముఖ్యం. చీర రంగుతో పాటు, సందర్భాన్ని బట్టి చెప్పులను ఎంచుకోవాలి. పెళ్లిళ్లు లేదా వేడుకలకు వెళ్తున్నప్పుడు డిజైనర్ హీల్స్ లేదా సాంప్రదాయ చెప్పులు ధరించడం వల్ల చీర లుక్ పెరుగుతుంది. సాదా చీరలకు బ్రైట్ కలర్ చెప్పులు వేసుకోవడం వల్ల మంచి లుక్ వస్తుంది. ఆఫీసు లేదా సాధారణ కార్యక్రమాలకు వెళ్తున్నప్పుడు ఫ్లాట్ చెప్పులు లేదా చిన్న హీల్స్ ఎంచుకోవడం మంచిది.

**యాక్సెసరీస్ కూడా ముఖ్యమే**

మీ వ్యక్తిత్వాన్ని ప్రతిబింబించేలా యాక్సెసరీస్ ఎంచుకోవాలి. మీరు ప్రశాంతంగా ఉండేలాంటి వారు అయితే, లైట్ కలర్ బ్యాగులు, చెప్పులు ఎంచుకోవాలి. అదే మీరు ఉల్లాసంగా, చురుకుగా ఉండే వ్యక్తి అయితే, బ్రైట్ కలర్ యాక్సెసరీస్ బాగుంటాయి. మీ స్టైల్ మీకు ఆత్మవిశ్వాసాన్ని ఇవ్వాలి. యాక్సెసరీస్ కేవలం అందం కోసం మాత్రమే కాకుండా, మీ వ్యక్తిత్వాన్ని కూడా ఇతరులకు చూపిస్తాయి.

# అంబలితో... ఎండలకు సవాల్!

అంబలి లేదా రాగి జావ రెండూ చేసేది రాగులతోనే. ఎండాకాలంలో తగిలే వడదెబ్బకు సరైన మందు. రోజూ అంబలి తింటే ఎండలకే మీరు సవాల్ విసరొచ్చు. అంతగా అది శరీరాన్ని డీహైడ్రేషన్ బారి నుంచి కాపాడుతుంది. అయితే కేవలం రాగులతోనే కాకుండా బియ్యం, సజ్జలు, జొన్నలు, రాగులతో కలిపి అంబలి చేయచ్చు. ఇది కేవలం రాగులతో చేసిన అంబలికంటే కూడా మంచి ప్రభావం చూపించడంతో పాటూ ఆరోగ్యాన్ని కాపాడుతుంది. ఎండల వల్లే కలిగే ఏ చిన్న సమస్యను దరిచేరనివ్వదు. ఇందులో ఐరన్, ఫైబర్,ఖనిజాలు, అయోడిన్ పుష్కలంగా ఉంటాయి. అంతేకాదు ఈ జావ అయిదునిమిషాల్లో సిద్ధమైపోయింది. చంటి పిల్లలకి తినిపించినా కూడా చాలా మంచిది. ఆరునెలలు దాటిన వయసు నుంచి ఎవ్వరైనా దీనిని తినొచ్చు. ఒక గిన్నెలో నీళ్లు పోసి.. రాగిపిండి కలిపి ఉండల్లేకుండా గిలక్కొట్టాలి. అందులోనే బియ్యప్పిండి, సజ్జపిండి, జొన్నపిండి, రుచికి సరిపడా ఉప్పు వేసి బాగా కలపాలి. ఇప్పుడు స్టవ్ మీద పెద్ద గిన్నె పెట్టి మూడు గ్లాసుల నీళ్లు పోయాలి. అవి బాగా వేడెక్కాక ముందుగా కలిపి పెట్టుకున్న రాగి పిండి మిశ్రమాన్ని అందులో వేయాలి. ఉండలు కట్టకుండా బాగా కలుపుతూ ఉండాలి. చిన్న మంట మీద ఉడకనివ్వాలి. కాస్త చిక్కగా మారాక స్టవ్ కట్టేయాలి. దీనికి వేసవి కాలంలో రోజుకు రెండు సార్లు తింటే చాలా మంచిది. అందులో కాస్త మజ్జిగ కలుపుకుని తాగితే ఇంకా బాగుంటుంది.



CORPORATE OFFICE:SNEHALA MEDIA PUBLICATIONS LLP, PLOT NO. 267,HUDA SAI NAGAR COLONY, BESIDE COMMUNITY HALL, VANASTHALIPURAM, RR DIST, HYDERABAD 500070.TG. CELL. 9348313999/8885727777.

Edited, Printed, Published & Owned By GURRAM PAPI REDDY,# H.No.4-57, Thorrur Village, Abdullapurmet Mandal, Turkayamal Municipality, Ranga reddy District.501511. Telangana. Printedat:GARUDA PRINT- ERS,# H.No.2-86/1, PlotNo.23-SP, SyNo.417, Sagar Highway, Rangannaguda Village, Abdullapurmet Mandal, Turkayamjal Municipality, Ranga reddy District.501510.Telangana.Published at: # H.No.4-57, Thorrur Village,Abdullapurmet Mandal, TurkayamalMunicipality, Ranga reddy District. 501511. Telangana...www.arunaprabha.com..email.arunaprabhadaily@gmail.com, RNI NO. TELTEL/2023/89778, Cell No. 9700127889